జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | శనివారం 29 ఆగస్టు 2026 | సంపుటి: 19 | సంచిక: 175 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , శ్రావణ మాసము , తిథి: చతుర్దశి - 09:10:51 వరకు నక్షత్రంధనిశ్ఠ - 26:16:19 వరకు కరణంవణిజ - 09:10:51 వరకు, విష్టి - 21:34:15 వరకు పక్షంశుక్ల యోగంశోభన - 07:55:29 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com


## రక్షణ రంగంలో మరో ముందడుగు

### అమెరికాతో రక్షణ శాఖ జావెలిన్ కొనుగోళ్లు

న్యూఢిల్లీ,ఆగస్ట్28(ప్రజాజ్యోతి): భారత్ – అమెరికా రక్షణ రంగంలో మరో ముందడుగు పడింది. యుఎస్ నుంచి 'జావెలిన్' యాంటీ ట్యాంక్ క్షిపణుల కొనుగోలుకు ఇరు దేశాల అధికారులు ఒప్పందం చేసుకున్నారు. ఈ మేరకు అమెరికా ఫారిన్ మిలిటరీ సేల్స్ పక్రియ ద్వారా లెటర్ ఆఫ్ ఆఫర్ అండ్ యాక్సెప్టెన్స్‌పై భారత అధికారులు సంతకం చేశారు. 'జావెలిన్' డీల్‌తో ఇరుదేశాల మధ్య సరికొత్త

మిగతా 2లో..

## స్కూళ్లలో చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించండి

### తెలంగాణ రాష్ట్ర కాంట్రాక్టర్స్ అసోసియేషన్

ఖమ్మం,ఆగస్ట్28(ప్రజాజ్యోతి): ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతుల కల్పనకు మన ఊరి –మన బడి కార్యక్రమంలో చేపట్టిన పనులకు వెంటనే బిల్లులు చెల్లించాలని, లేదంటే సెప్టెంబర్ 17న బడులకు తాళాలు వేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర కాంట్రాక్టర్స్ అసోసియేషన్ తెలిపింది. దీనికి సంబంధించి శు

మిగతా 2లో..

# బంగారు గని రాయదుర్గం భూమి

## 269 కోట్లకు ఎకరా పలికిన ధర

హైదరాబాద్,ఆగస్ట్28(ప్రజాజ్యోతి): రాయదుర్గం భూములు బంగారు గనిగా మారాయి. వేలంపై సుప్రీం తీర్పు తరవాత వాటికి బంగారాన్ని మించిన ధరలు పలుకుతున్నాయి. ఇలా హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో భూముల ధరలు మరోసారి రికార్డు సృష్టించాయి. రాయదుర్గంలో ఎకరం భూమి ధర ఏకంగా రూ.269 కోట్లు పలికింది. వారం క్రితం ఇక్కడే ఎకరం ధర రూ.264 కోట్లు పలకగా, తాజాగా దాని పక్కనే ఉన్న ప్లాట్‌లో ఎకరానికి రూ.269 కోట్లు పలకడం విశేషం. రాయదుర్గం సర్వే నంబరు 83/1లోని 5.38 ఎకరాలకు తాజాగా టీజీఐఐసీ వేలం నిర్వహించింది. కనీస ధర రూ.175 కోట్లుగా నిర్ణయించింది. రూ.10 కోట్లు ముందస్తుగా చెల్లించిన వారికి ఆన్‌లైన్ వేలంలో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు. దీంతో పలు రియల్ ఎస్టేట్ సంస్థలు వేలంలో పోటీపడ్డాయి. చివరికి వంశీరాం బిల్డర్స్ ఎకరానికి రూ.269 కోట్ల చొప్పున 5.38 ఎకరాలను కొనుగోలు చేసింది. దీంతో టీజీఐఐసీ కాసుల పంట పండినట్లైంది. ఈ వేలం ద్వారా ప్రభుత్వానికి సుమారు రూ.1,447 కోట్లు సమకూరాయి.



# 15,982 అంగన్‌వాడీ పోస్టుల భర్తీ

## సెప్టెంబర్ నాటికి నియామకాలు పూర్తి

## రెండు జోన్ల పరిధిలో నియామకాలు

## తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలు జారీ




హైదరాబాద్,ఆగస్ట్28(ప్రజాజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న భారీ సంఖ్యలో పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మొత్తం 15,982 పోస్టులను సెప్టెంబర్ నెలలోగా భర్తీ చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, ఈ నియామకాలు జిల్లా స్థాయిలో జరగనున్నాయి. మొత్తం ఖాళీలలో జోన్-1 పరిధిలో 1,853 టీచర్ పోస్టులు, 7,737 ఆయా పోస్టులు ఉన్నాయి. జోన్-2 పరిధిలో

మిగతా 2లో..



# గట్టిగా వాదించండి

- రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేలా ఉండాలి
- అధికారులకు సిఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం
- అంతర్రాష్ట్ర నదీజలాల వివాదాలపై సూచన
- నీటిపారుదల శాఖపై సీఎం రేవంత్ సమీక్ష

హైదరాబాద్,ఆగస్ట్28: అంతర్రాష్ట్ర జల వివాదాలపై వివిధ వేదికలపై రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేలా గట్టిగా వాదించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. సెప్టెంబరు 1న తుమ్మిడిహట్టిపై దిల్లీలో జరగనున్న అధికారుల భేటీ, సెప్టెంబరు 7న సీడబ్ల్యూసీ హైలెవెల్ కమిటీ సమావేశ ఎజెండాపై చర్చించినట్లు తెలుస్తోంది. మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నీటిపారుదల శాఖపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహంచారు. మహారాష్ట్ర, ఏపీతో వివాదాలపై అధికారులు, న్యాయవాదులు తెలంగాణ వైఖరిని స్పష్టం చేయాలని సీఎం సూచించినట్లు సమాచారం. సుప్రీంకోర్టు, కేంద్ర జలవనరుల సంఘం,


మిగతా 2లో..

## ముఖ్యమంత్రికి రాఖీలు కట్టిన మహిళా మంత్రులు

### వివాదాల తరవాత తొలిసారి సిఎం ఇంటికి కొండా సురేఖ

### సిఎంకు ఆడబిడ్డల ఆశీర్వాదాలు ఉండాలని వ్యాఖ్య

### సిఎంకు రాఖీలు కట్టిన బ్రహ్మకుమారీలు, మహిళా కానిస్టేబుల్స్



హైదరాబాద్,ఆగస్ట్28(ప్రజాజ్యోతి): రక్షా బంధన్ సందర్భంగా అపూర్వ సన్నివేశం ఆవిష్కృతం అయ్యింది. మంత్రులు కొండా సురేఖ, సీతక్కలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లి రేవంత్‌కు రాఖీ కట్టారు. సిఎం కుటుంబ సభ్యులు సమక్షంలో వీరిద్దరు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. పరకాల వివాదం తర్వాత కొండా సురేఖ.. సీఎం నివాసానికి వెళ్లడం

మిగతా 2లో..




# చిన్నోడు తీసిన డ్రాలో కుటుంబానికి లక్కీ

## అదే కుటుంబానికి తగిలిన లక్కీ డ్రా

## ఎక్స్‌లో పోస్ట్ చేసిన మంత్రి పొంగులేటి

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తాం

## మరో 10 రోజుల్లో రెండో విడత విడుదల

## లక్రీడ్రా కార్యక్రమంలో మంత్రి పొంగులేటి

హైదరాబాద్,ఆగస్ట్28(ప్రజాజ్యోతి): హైదరాబాద్‌లోని క్యూర్ పరిధిలో తెలంగాణ ప్రభుత్వం నిర్మించనున్న ఇందిరమ్మ టవర్స్‌లో ప్లాట్ల కేటాయింపునకు లక్కీడ్రా ప్రారంభమైంది. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్‌దేవుపల్లి లక్ష్మీగూడలో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. లక్కీ డ్రా టోకెన్‌ను ఓ బాలుడితో తీయించగా.. ఆ చిన్నోడి కుటుంబానికే ఇల్లు వరించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ వీడియోను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. పేదల సొంతింటి కల తీర్చాలనే ఈ ప్రభుత్వ సంకల్పానికి, దేవుడి ఆశీస్సులు తోడైనట్టు చిన్నోడు తీసిన లక్కీ డ్రాలో వారి కుటుంబానికే (జరపుల లక్ష్మి) టోకెన్ రావడం తమ అందరినీ ఆనందానికి, ఆశ్చర్యానికి గురిచేసిందని మంత్రి పేర్కొన్నారు. ఇలాంటి సందర్భాలు చాలా అరుదు. చిన్న పిల్లలు దేవుళ్లతో సమానం. చిన్నారులు స్వచ్ఛమైన మనసు కలిగినవారు. ఆ దేవుడి ఆశీర్వాదం, ప్రభుత్వ సహకారంతో వారి కల నేరవేరుతున్నందున ఆ కుటుంబం సొంతింటిలో జీవితాంతం చల్లగా బతకాలని, ఆ ఆడబిడ్డను ఆశీర్వదించాను' అని పేర్కొంటూ వీడియోను షేర్ చేశారు. మరోవైపు, నేటి నుంచి ఈ నెల 31వ తేదీ వరకు 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సుమారు 8 వేల ఎ÷-లాట్లకు లక్కీడ్రా నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. రోజుకు నాలుగు నియోజకవర్గాల చొప్పున ఈ పక్రియ కొనసాగుతుందని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో 480 ఎ÷-లాట్లకు 600 మంది లబ్దిదారులను లక్కీడ్రా ద్వారా ఎంపిక చేస్తామని, అనంతరం అధికారులు క్షేత్రస్థాయిలో తుది పరిశీలన చేస్తారన్నారు. వీరిలో ఎవరైనా అనర్హులుగా తేలితే మిగిలిన 120 మందిలోని అర్హులకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. క్యూర్ పరిధిలో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణాన్ని

మిగతా 12లో..

## కోడిపందాలను చట్టబద్ధం చేయలేం

- జంతు సంరక్షణలో పక్షులు కూడా భాగమే
- కోడి పందాలను సాంస్కృతిక వారసత్వంగా గుర్తించలేం
- సినిమాలు, ఆచారాలు చూపి..పందాలను నడపడం సాధ్యం కాదు
- మద్రాస్ హైకోర్టు మధురై బెంచ్ స్పష్టీకరణ

చెన్నై,ఆగస్ట్28(ప్రజాజ్యోతి): కోడిపందేలపై మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ పందేలు నిర్వహించడం చట్టపరిధిలో పూర్తిగా నిషేధమని మద్రాస్ హైకోర్టు మధురై బెంచ్ స్పష్టం చేసింది. గతంలో అనుమతులిస్తూ ఇచ్చిన ఉత్తర్వులు చట్టపరంగా చెల్లవని జస్టిస్ జి.ఆర్. స్వామినాథన్ వ్యాఖ్యానించారు. కోడిపందేల నిర్వహణ పౌరుల ప్రాథమిక హక్కు కాదని తేల్చిచెప్పారు. జంతు హింస నిరోధక చట్టం-1960 ప్రకారం కోడిపందేలు తీవ్ర నేరమని జస్టిస్ జి.ఆర్. స్వామినాథన్ అభిప్రాయపడ్డారు. 'రిట్ ఆఫ్ మాండమస్' కింద అనుమతులు

మిగతా 2లో..

## గనులశాఖలో అవినీతి మేట

### లెక్కకు మిక్కిలిగా జయరాజ్ ఆస్తులు

### రిమాండ్‌కు ఆదేశించిన ఎసిబి కోర్టు

### 14 రోజులు రిమాండ్‌కు వరంగల్ జైలుకు తరలింపు

వరంగల్,ఆగస్ట్28(ప్రజాజ్యోతి): ఆదాయానికి మించి భారీగా ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలతో గనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జయరాజ్‌ను అవినీతి నిరోధక శాఖ అరెస్ట్ చేసింది. కోర్టులో హాజరు పర్చగా

మిగతా 2లో..




## బంగారం మైనింగ్‌లో హట్టి- సింగరేణి

# జతకట్టాలి

### భవిష్యత్తు ప్రాజెక్టుల్లో కలిసి పనిచేయాలి

### సింగరేణి అధికారులకు భట్టి విక్రమార్క దిశా నిర్ధేశం

### హట్టి, యుటీ బంగారు గనులలో భట్టి విస్తృత పర్యటన



హైదరాబాద్,ఆగస్ట్28(ప్రజాజ్యోతి): బంగారం మైనింగ్‌లో విశేష అనుభవమున్న కర్ణాటక ప్రభుత్వ సంస్థ హట్టి గోల్డ్ మైన్స్‌తో సింగరేణి కలిసి పనిచేసేలా జాయింట్ వెంచర్ అవకాశాలను పరిశీలించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. రెండు ప్రభుత్వ రంగ సంస్థల సాంకేతిక సామర్థ్యం, అనుభవాన్ని సమన్వయం చేస్తే దేశీయ బంగారం ఉత్పత్తిలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. కర్ణాటక గోల్డ్ మైన్స్ ప్రాంతంలో రెండో రోజు పర్యటనలో భాగంగా శుక్రవారం రాయచూర్ జిల్లాలోని హట్టి, యూటి బంగారు గనులను ఉప ముఖ్యమంత్రి

మిగతా 12లో..

## సింగరేణి కార్మికుల సమస్యలపై ఒప్పందం

### సమ్మె నోటీసుతో యాజామన్యం చర్చలు

### పలు అంశాల పరిష్కారానికి దక్కిన హామీ

కొత్తగూడెం,ఆగస్ట్28(ప్రజాజ్యోతి): సింగరేణి కార్మికుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రత కోసం గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ చేపట్టిన నిరంతర పోరాటం కీలక విజయాన్ని సాధించింది. ఏఐటీయూసీ ఇచ్చిన సమ్మె నోటీసు ప్రభావంతో సింగరేణి యాజమాన్యం దిగివచ్చి కార్మికుల పలు ప్రధాన డిమాండ్ల పరిష్కారానికి అంగీకరించింది. జూన్ 8న ఏఐటీయూసీ ఇచ్చిన సమ్మె నోటీసుపై ఆర్ఎల్‌సీ సమక్షంలో పలుమార్లు జరిగిన చర్చల అనంతరం జరిగిన కీలక చర్చల్లో యాజమాన్యం పలు అంశాలపై సానుకూల నిర్ణయాలు తీసుకుంది. అనంతరం కేంద్ర కార్మిక ప్రాంతీయ కమిషనర్ కార్యాలయంలో ఏఎల్‌సీ శాశ్వతిరెడ్డి సమక్షంలో యాజమాన్యం, గుర్తింపు కార్మిక సంఘం

మిగతా 12లో..

# సంపాదకీయం

## కాంగ్రెస్‌లో కలుపు మొక్కలు !

తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటు కొత్తేమీ కాదు.. ఇవే మొదలు కాదు..ఇవే చివరికి కూడా కావు. అధికారం ఉంటే ఒక రకమైన కొట్లాట ఉంటుంది. లేకుంటే మరో రకమైన కొట్లాట ఉంటుంది. ఇవన్నీ కూడా ఆధిపత్యపోరులో భాగమే. ఒకరంటే ఒకరికి పడదు. ఒకరంటే ఒకరికి గిట్టదు. ప్రజల పేరు చెప్పి, పథకాల పేరు చెప్పి దంబాచారాలు ప్రచారం చేయడం తప్ప క్షేత్రస్థాయిలో ఏ ఒక్కరు కూడా సమయం వెచ్చించి ప్రజా సమస్యలపై మాట్లాడరు. తాజా పరిణామాలను పరిశీలిస్తే...రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని ఇప్పుడున్న కాంగ్రెస్ నేతలు జీర్ణించుకోవడం లేదన్నది ముమ్మాటికి నిజం. రేవంత్ టిడిపి నుంచి కాంగ్రెస్‌లోకి రావడం అన్నదే వారు చూసారు తప్ప కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకుని వచ్చారన్న నిజాన్ని పట్టించుకోరు. అందుకే అడపాదడపా వారు నోరు పారేసుకుంటారు. మేమున్నామని చెప్పుకునే ప్రయత్నం చేస్తుంటారు. మంత్రిగా కొండా సురేఖ పెద్దగా పొడించిందేమీ లేదు. దేవాదాయశాఖలో ఎన్ని గుళ్లుల ఉన్నాయో, ఎంతమంది పూజారులు ఉన్నారో, ఎలాంటి పూజాదిక వ్యవస్థ మనదగ్గర ఉందో ఆమెకు తెలియదు. బ్రోచర్లు విడుదల చేయడం, బోనాలెత్తడం తప్ప ఈ మూడేళ్లలో ఆమె చేసింది శూన్యం. దేవాలయాలు కునారిల్లుతున్నాయి. ధూపదీప నైవేద్యాలు అందడం లేదు. అన్యాక్రాంతం అయిన భూముల్లో ఇంచు భూమి కూడా ఆమె వెనక్కి తీసుకోలేదు. గ్రామాల్లో దేవాలయాల భూములు వేలాది ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయి, కొందరు ఏకంగా పట్టాలు చేసుకున్నారు. ఉమ్మడి వరగంల్ జిల్లాలోనే ఇలా వందలాది ఎకరాలు ఉంటాయి. జనగామ జిల్లా బచ్చన్నపేట చెన్నకేశవస్వామి దేవాలయ భూములు కౌలు చేస్తున్నవారే పట్టాలు చేయించుకున్నారు. జీడికల్ భూములు, కొండాపూరం భూములు, ఇలా చెప్పుకుంటూ పోతే ఊరికో చరిత్ర ఉంది. ఆమె ఏనాడూ ఈ భూముల గురించి మాట్లాడడం లేదు. అటవీ శాఖ మంత్రిగా అసలు ఒక్క మొక్కయినా నాటి పెంచారా అన్న అనుమానం కలుగుతుంది. ఎపిలో పవన్ కళ్యాణ్ సామాజిక వనాల పెంపునకు పాల్పడుతుంటే ఇక్కడ కనీసం వరమహోత్సవాలు లేవు. ఉన్నా మొక్కుబడిగా సాగుతున్నాయి. ఇవన్నీ వదిలేసి కూతురుతో సిఎం రేవంత్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయించి, తనకేమీ సంబంధం లేదన్నట్లుగా మాట్లాడడం వారికే చెల్లింది. నిజానికి ఆమె దేవాలయాలను పట్టించుకుని, అడవులను పట్టించుకుని ఉంటే జనం ఆమె అంటే అభిమానం చూపేవారు. కానీ కూతరు రాజకీయం ముఖ్యం. రాజకీయాలు తప్ప ప్రజల సేవ ముఖ్యం కాదు. ఇక చిన్నరెడ్డి కూడా అంతే. ప్రణాళికి సంఘం ఉపాధ్యక్షుడుగా ఉన్నారు. ప్రజావాణిలో వచ్చిన అనేక ముఖ్యమైన సమస్యలు ఏమిటో వాటిని ఎలా పిరష్కరించారో చెప్పలేరు. రాజగోపాల రెడ్డికి మంత్రి పదవి కావాలి. ఆయన జీవిత ధ్యేయం అదే. అందుకే ఇప్పుడు కాంగ్రెస్‌లో డ్రామాలు నడుస్తున్నాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ దశదిశా లేకుండా వ్యవహరించింది. కెసిఆర్‌ను నమ్మిన ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మలేదు. అందుకే అధికారం లోకి రావడానికి తొమ్మిదిన్నరేళ్లు పట్టింది. ఇది కూడా కాంగ్రెస్ పార్టీని చూసి ఓటేయలేదు. కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావుల అవినీతి కార్యక్రమాలతో విసుగు చెందిన ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారు. ఈ విషయం కాంగ్రెస్‌కు అర్థం కావడం లేదు. నిజానికి కాంగ్రెస్‌లో బలమైన నేతగా ఎదిగిన అవకాశం ఉమ్మడి ఎపిలో ఒక్క రాజశేఖర్ రెడ్డికే సొంతం. ముఖ్యమంత్రిగా దాదాపు మూడేళ్లు పూర్తిచేసుకోబోతున్న రేవంత్‌రెడ్డి బలమైన నాయకుడిగా ఎదగలేక పోయారు. అందుకే కాంగ్రెస్ పార్టీలో తాజాగా చోటు చేసుకుంటున్న పరిణామాలు ఆ పార్టీ సంస్కృతిలో భాగమని ఊరుకోక తప్పదు. ఎందుకంటే కొండాసురేఖ,చిన్నారెడ్డిలపై కఠిన చర్యలు తీసుకునే సాహసం కాంగ్రెస్ నేతలు చేయరు. నిజంగానే వీరిద్దరిని పీకి అవతల పడేస్తే కాంగ్రెస్‌లో చురుకు పుడుతుంది. కాంగ్రెస్ బలం పెరుగుతుంది. జీవన్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య పార్టీని వీడితే ఏమయ్యింది. వీరు పోయినా ఏమీ కాదు. రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని ఇప్పటికీ కొంత మంది కాంగ్రెస్ నేతలు జీర్ణించుకోలేక పోతున్నారు. అంతర్గత కుమ్ములాటలకు పాల్పడుతున్న కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో ఏవగింపు ఏర్పడింది. బిఆర్ఎస్‌ను మించి పాలన సాగిస్తారని అనుకుంటే మంత్రులంతా పర్సంటేజీల ఖాతాలు తెరిచారు. గ్రామస్థాయిలో అవినీతి మరింత పెరిగింది. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్.. ఇలా ఒకరి తర్వాత ఒకరు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై విమర్శలు ఎక్కుపెట్టడం భరిస్తూ పోతే వీరి జాబితా పెరగడమే తప్ప తగ్గదని గురించాలి. రాజశేఖరరెడ్డి నాయకత్వంలో కిక్కురుమనకుండా పనిచేసిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు మాత్రం తలలు ఎగరేస్తున్నారు. ఈ ఇద్దరు నేతు ఏ పార్టీలోకైనా వెళ్లి రాగలరని ఇప్పటికే రుజువయ్యింది. బిఆర్ఎస్ పాలనను నిలదీస్తూ...ముఖ్యమంత్రి కేసీఆర్‌ను దీటుగా ఎదుర్కొనే సత్తా రేవంత్‌రెడ్డికి మాత్రమే ఉందన్న నమ్మకంతో కాంగ్రెస్ అధిష్ఠానం ఆయనకు పీసీసీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించింది. అదే సమయంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల నుంచి బండి సంజయ్‌ను తొలగించడం రేవంత్‌రెడ్డికి కలిసొచ్చింది. కేసీఆర్ పోకడల పట్ల విముఖంగా ఉన్న ప్రజలు ప్రత్యామ్నాయ నాయకుడిగా రేవంత్‌రెడ్డిని ఎంచుకున్నారే తప్ప కాంగ్రెస్‌పైనో లేదా రాహుల్‌పైనో ప్రేమతో కాదు. కేసీఆర్‌కు ప్రత్యామ్నాయం ఎవరన్న ప్రశ్న ఉదయించినప్పుడు, తాను ఉన్నానన్న నమ్మకాన్ని ప్రజల్లో కల్పించడంలో రేవంత్‌రెడ్డి విజయం సాధించడంతోనే ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారు. అధికారం దక్కాక ప్రజలకు మెరుగైన పాలన అందించడంలో మంత్రులదీ పెద్ద పాత్రే ఉంది. అయితే పాత కాంగ్రెస్ సంస్కృతిని మరవకపోవడంతో పార్టీలో క్రమశిక్షణ కట్టుతప్పింది. వీరివల్ల ఎన్నుకున్న ప్రజలకు రాష్ట్ర ప్రజలకు ఉపయోగం లేదన్న ప్రచారం బాగా వ్యాప్తి చెందుతున్న వేళ కొండా సురేఖ లాంటి వారి చర్యలు కాంగ్రెస్‌కు బలహీనతే తప్ప బలం కాదు. వీరిని వదిలించుకుంటే తప్ప మేలు జరగదు. కాంగ్రెస్ దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

# గట్టిగా వాదించండి

మొదటిపేజీ తరువాయి..

కృష్ణా, గోదావరి నదీ జలాల నిర్వహణ బోర్డుల్లో ఉన్న వివిధ కేసులపై సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి చర్చించారు. కేసులు ఏ దశలో ఉన్నాయి?, ఇతర రాష్ట్రాల వాదనలేంటి?, తెలంగాణ ప్రయోజనాలు వంటి అంశాలపై సీఎం ఆరా తీసినట్లు సమాచారం. సమీక్షలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈనెల 26న జరిగిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డులో ప్రభుత్వం తమ అభ్యంతరాలను వివరించింది. ఈఎన్సీ జనరల్ రమేశ్‌బాబు 2027 ఆగస్టు వరకు తాగునీటి అవసరాల కోసం 112 టీఎంసీల నీటిని కేటాయించాలని బోర్డును కోరారు. ఈ మేరకు శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లో అవసరమైన నీటి నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ కోరింది. అలాగే తాగునీటి అవసరాల కోసం తమకు 47 టీఎంసీలు కేటాయించలన్న ఏపీ ప్రతిపాదనపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో సమావేశం ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే వాయిదా పడింది. తదుపరి సెప్టెంబర్ నాలుగున జరిగే తదుపరి సమావేశంలోనూ తెలంగాణ ప్రభుత్వ ప్రయోజనాల విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని అధికారులను ముఖ్యమంత్రి సూచించినట్లు సమాచారం. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాపాతం లోటును దృష్టిలో ఉంచుకొని తాగునీటి విషయంలో రాజీ పడకుండా ఉండాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యంగా కనిపిస్తోంది.



## ముఖ్యమంత్రికి రాఖీలు కట్టిన మహిళా మంత్రులు

మొదటిపేజీ తరువాయి..

ఇదే తొలిసారి. సీఎంతో భేటీ అనంతరం కొండా సురేఖ మీడియాతో మాట్లాడకుండానే అక్కడి నుంచి వెళ్లి పోయారు. సీఎం రేవంత్‌రెడ్డికి బంగారు రాఖీ కట్టిన తర్వాత.. ఆమె నివాసంలో కొండా సురేఖ మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డికి మూడోసారి రాఖీ కట్టా. నేను అందరికీ సోదరినే. పండుగ వాతావరణంలో ఎలాంటి రాజకీయ వ్యాఖ్యలు చేయను. ముఖ్యమంత్రికి మహిళల అండ ఎప్పుడూ ఉంటుంది. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే శక్తి ఆయనకు ఇవ్వాలని దేవుడిని కోరుకున్నా. ఆడబిడ్డల ఆశీర్వాదాలు సీఎంకు ఎప్పుడూ ఉండాలని కోరుకున్నానని తెలిపారు. ఇటీవల.. ములుగు, పరకాలలో జరిగిన కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. అయితే ఈ కార్యక్రమాల్లో వరంగల్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తోన్న కొండా సురేఖ పాల్గొనలేదు. ముఖ్యమంత్రి పర్యటనలో స్థానిక మంత్రి పాల్గొనకపోవడం చర్చనీయాంశమైంది. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మంత్రి కొండా సురేఖ తీవ్ర స్థాయిలో వ్యతిరేకిస్తున్నారు. తమ వర్గీయులను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణలు చేశారు. మరోవైపు పరకాల బహిరంగ సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాశ్‌రెడ్డిని భారీ ఆధిక్యతతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే ఎన్నికల్లో రేవూరే అభ్యర్థి అన్న సంకేతం ఇచ్చినట్లయ్యింది. ఇది జరిగిన మరుసటి రోజే కొండా సురేఖ కుమార్తె పరకాల నియోజకవర్గంలోని గీసుకొండలో సభ ఏర్పాటు చేసి ముఖ్యమంత్రిపైన, స్థానిక ఎమ్మెల్యేపైన తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేయడంతో పాటు వచ్చే ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీచేస్తానని చెప్పారు. సుస్మిత చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ అధిష్ఠానం కూడా సీరియస్‌గా తీసుకొన్నట్లు సమాచారం. నేరుగా ముఖ్యమంత్రి పై చేసిన విమర్శలు, ఆరోపణలు కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యవహారంలో పీసీసీ క్రమశిక్షణా కమిటీ మంత్రి కొండా సురేఖకు నోటీసు ఇవ్వగా, కుమార్తె చేసిన ఆరోపణలకు తానెలా బాధ్యురాలిని అవుతానని సమాధానం ఇచ్చారు. క్రమశిక్షణా రాహిత్యంగా భావించి నోటీసులివ్వడంతోనే పరిమితం కాకుండా చర్యలకు కూడా ఉపక్రమించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో సీఎం నివాసానికి కొండా సురేఖ వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఇదిలావుంటే బ్రహ్మకుమారీలు, హోంగార్డులు, మహిళా కానిస్టేబుళ్లు కూడా సిఎం రేవంత్ రెడ్డికి రాఖీలు కట్టారు. వారి పట్ల సిఎం రేవంత్ వాత్సత్యం ప్రకటించారు.



## అమెరికాలో తెలుగుయువతి హత్య

### ఆగ్రాలో నిందితుడి పట్టివేత
### అమెరికాకు అప్పగించనున్న పోలీసులు

న్యూఢిల్లీ,ఆగస్ట్28(ప్రజాజ్యోతి): అమెరికాలో సంచలనం సృష్టించిన హైదరాబాద్ యువతి నిఖిత గోదిశాల (27) హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. హత్య కేసు నిందితుడు, ఆమె మాజీ రూమ్‌మేట్ అర్జున్ శర్మ (26)ను హైదరాబాద్ పోలీసులు ఆగ్రాలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ విధించింది. ఈ హత్య కేసులో భాగంగా ఇప్పటికే నిందితుడిపై అమెరికా పోలీసులు అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. దీంతో ప్రస్తుతం అమెరికా అధికారులకు అర్జున్ శర్మను అప్పగించే




ప్రక్రియ కొనసాగుతోంది. హైదరాబాద్‌కు చెందిన నిఖిత గోదిశాల అమెరికాలోని మేరీల్యాండ్‌లోని ఎల్లికాట్ సిటీలో ఉద్యోగం చేస్తోంది. ఆమె కనిపించడం లేదంటూ జనవరి 2న ఫిర్యాదు అందడంతో హోవర్డ్ కౌంటీ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మేరీల్యాండ్‌లోని అర్జున్ శర్మ అపార్ట్‌మెంట్‌లో నిఖిత మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఆమె శరీరంపై కత్తిపోట్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ కేసులో శర్మపై ఫస్ట్-డిగ్రీ, సెకండ్-డిగ్రీ హత్యారోపణలతో అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. దీంతో నిందితుడు భారత్‌కు పారిపోయి వచ్చాడు. మరోవైపు, డిసెంబర్ 31, 2025న నిఖిత హత్యకు గురైనట్లు బాధిత కుటుంబ సభ్యులకు భారత అధికారులు సమాచారం అందించారు. నిఖిత తండ్రి ఆనంద్ గోదిశాల ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తెలంగాణలోనూ అర్జున్‌పై మోసం కేసు నమోదైంది. నిఖిత నుంచి డబ్బులు తీసుకుని తిరిగి ఇవ్వలేదని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏప్రిల్‌లో కేసు నమోదు చేసిన హైదరాబాద్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో లభించిన ఆధారాలతో ఆగ్రాలో అర్జున్ ఉన్నట్లు గుర్తించారు. దీంతో ప్రత్యేక బృందం అక్కడికి వెళ్లి ఓ ఎ÷-లాట్‌లో అతడిని అదుపులోకి తీసుకుంది. అనంతరం హత్య కేసు దర్యాప్తులో భాగంగా కేంద్ర దర్యాప్తు సంస్థలకు అప్పగించారు. న్యూఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టులో ఆగస్టు 25న హాజరుపరుచగా.. హత్యకు సంబంధించిన కేసులో రిమాండ్ విధించింది.

## స్కూళ్లలో చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించండి

మొదటిపేజీ తరువాయి..

క్రవారం మన ఊరు మనబడి పథకంలో పనులు చేసిన కాంట్రాక్టర్లు, ఖమ్మం కలెక్టర్ దివాకర టీఎస్ కు వినతిప్రతం అందజేశారు. పనులు పూర్తి చేసిన మూడేండ్లు అయినా బిల్లులు చెల్లించలేదని, అప్పులు చేసి పనులు చేయించామని వారు వినతిలో ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులతో మానసిక ఒత్తిడి గురై ఆత్మహత్యలే శరణ్యంగా మారిందన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవం లోపు పెండింగ్ బిల్లులు చెల్లించాలని లేనిచో పనులు చేసినా బిల్లులు రాని బదులకు గత్యంతరం లేక తాళాలు వేయడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం కాంట్రాక్టర్ల బాధలు తెలుసుకుని బిల్లులు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టి.వసంతరావు, వి.రామిరెడ్డి, గడిపర్తి వీరభద్రరావు, ఏసుబాబు, ఎన్.శ్రీనివాసరావు, రఘు పాల్గొన్నారు.

## రక్షణ రంగంలో మరో ముందడుగు

మొదటిపేజీ తరువాయి..

అధ్యాయం మొదలైందని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. భారత్‌లో జావెలిన్ క్షిపణుల సంయుక్త ఉత్పత్తికి మార్గం సుగమం అయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. క్షిపణులను ప్రయోగించిన తర్వాత మళ్లీ గైడ్ చేయక్కర్లేని 'ఫైర్ అండ్ పర్గెట్' ఆటోమేటిక్ టెక్నాలజీతో జావెలిన్ మిస్సైళ్లు పనిచేస్తాయని వివరించారు. శత్రు దేశాల ట్యాంకులు, బంకర్లకు చెక్ పెట్టేలా భయానక టెక్నాలజీ అందుబాటులోకి వస్తుందని చెప్పుకొచ్చారు. చైనా, పాకిస్థాన్ సరిహద్దుల్లో శత్రువుల ట్యాంకులు, బంకర్లు, సాయుధ వాహనాలను ధ్వంసం చేయడంలో ఈ ఆయుధాలు కీలక పాత్ర పోషిస్తాయని అమెరికా రాయబారి సెర్గియో గోర్ పేర్కొన్నారు.

## 15,982 అంగన్‌వాడీ పోస్టుల భర్తీ


మొదటిపేజీ తరువాయి..

1,247 టీచర్ పోస్టులు, 5,145 ఆయా పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఇంటర్మీడియట్ (ఇంటర్) ఉత్తీర్ణులై ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఇంటర్వ్యూ ద్వారా జరగనుంది. ఎంపికలో భాగంగా అభ్యర్థుల ఇంటర్మీడియట్‌లో సాధించిన మార్కులకు 70 శాతం వెయిటేజీ ఇవ్వనున్నారు. ఇంటర్వ్యూకు 10 శాతం మార్కులు కేటాయించారు. అలాగే, ప్రత్యేక కేటగిరీల కింద వితంతువులకు 5 శాతం, అనాథలకు 10 శాతం, దివ్యాంగులకు 5 శాతం చొప్పున వెయిటేజీ కల్పించనున్నారు. ఈ నియామక ప్రక్రియను వేగవంతం చేసి, సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ నిర్ణయంతో వేలాది మంది నిరుద్యోగ మహిళలకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

## కోడిపందాలను చట్టబద్ధం చేయలేం

మొదటిపేజీ తరువాయి..

జారీ చేయలేమని తేల్చిచెప్పారు. కోడిపందేలకు 'సంస్కృతి' హోదా ఇవ్వలేమని పేర్కొన్నారు. సినిమాలు, ఆచారాల్లో ప్రసిద్ధి చెందినంత మాత్రాన ఈ పందేలను సాంస్కృతిక క్రీడగా గుర్తించలేమని తెలిపారు. జల్లికట్టు తరహాలో ప్రత్యేక చట్టసవరణ లేనంతవరకు మినహాయింపులు ఇవ్వలేమని స్పష్టం చేశారు. కత్తులు కట్టకపోయినా పందేలు నేరమేనని చెప్పుకొచ్చారు. కత్తులు లేవనే సాకుతో ఈ పందేలకు అనుమతి కోరిన పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు తెలిపారు. జంతు సంక్షేమ చట్టంలో 'పక్షులు' కూడా భాగమేనని స్పష్టం చేశారు. జల్లికట్టు లాగా ప్రత్యేక చట్టసవరణ తీసుకువస్తేనే మినహాయింపు దక్కుతుందని జస్టిస్ జి.ఆర్. స్వామినాథన్ స్పష్టం చేశారు. గతంలో కోడిపందేలకు అనుమతిస్తూ ఇచ్చిన ఉత్తర్వులు చట్టవిరుద్ధమని జస్టిస్ జి.ఆర్. స్వామినాథన్ వ్యాఖ్యానించారు. గత తీర్పులను భవిష్యత్తు కేసుల్లో నిదర్శనంగా పరిగణించరాదని తెలిపారు. ఆయా షరతులతో కోడిపందేలకు అనుమతి ఇచ్చిన పాత ఉత్తర్వులపై రివ్యూ పిటిషన్‌లో కీలక తీర్పు వెల్లడించారు. కత్తులు కట్టకుండా నిర్వహించినా కోడిపందేలకు చట్టబద్ధత లేదని స్పష్టం చేశారు. పక్షులకు గాయాలు కాకుండా చూడాలనే షరతులతో ఇచ్చిన పాత అనుమతులు కూడా చట్టానికి విరుద్ధమేనని తెలిపారు. జంతు హింస నిరోధక చట్టంలోని నిబంధనలను ఉల్లంఘించి ఈ పందేలకు అనుమతి ఇవ్వలేమని అన్నారు. కోడిపందేలకు అనుమతి ఇచ్చిన గత డివిజన్ బెంచ్ ఉత్తర్వులు 'పూర్తిగా అనవసరం' అని వ్యాఖ్యానించారు. తంజావూరు జిల్లా కలెక్టర్ దాఖలు చేసిన రివిజన్ పిటిషన్‌కు మద్రాస్ హైకోర్టు అనుకూల తీర్పు ఇచ్చింది.



## గనులశాఖలో అవినీతి మేట

మొదటిపేజీ తరువాయి..

ఆదేశాలతో వరంగల్ జైలుకు తరలించారు. జయరాజ్ ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ నిర్ధారణకు రావడంతో.. ఆయనను అరెస్ట్ చేసి వరంగల్‌కు తరలించారు. అనంతరం జయరాజ్‌ను వరంగల్‌లోని ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. కేసును పరిశీలించిన కోర్టు ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ఏసీబీ అధికారులు జయరాజ్‌ను వరంగల్ జైలుకు తరలించారు. ప్రస్తుతం వరంగల్ జిల్లా గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న జయరాజ్‌పై అవినీతి ఆరోపణలు రావడంతో దాడులు చేపట్టినట్లు ఎసిబి అధికారులు తెలిపారు. జయరాజ్ అవినీతికి పాల్పడుతున్నారంటూ గతంలోనే గనుల శాఖ అధికారులు హెచ్చరించారు కూడా. ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నప్పటికీ తీరులో మార్పు రాలేదని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. ఈ క్రమంలో జయరాజ్ భారీగా అక్రమ ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీకి సమాచారం అందడంతో దర్యాప్తు చేపట్టింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్, వరంగల్‌తో పాటు మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. బోడుప్పల్‌లోని జయరాజ్ నివాసంతో పాటు ఆయన స్నేహితులు, బంధువుల ఇళ్లలోనూ తనిఖీలు చేపట్టారు. సోదాల్లో భారీగా ఆస్తులు, నగదు, బంగారు ఆభరణాలు, బ్యాంకు డిపాజిట్లు ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. ఏసీబీ లెక్కల ప్రకారం జయరాజ్‌కు సంబంధించిన సుమారు రూ.65 కోట్లకు పైగా విలువైన ఆస్తులను గుర్తించినట్లు సమాచారం. బోడుప్పల్‌లో రెండంతస్తుల భవనం, తూప్రాన్, తుంగతుర్తి, సూర్యాపేటలో ఒక్కో ఎ÷-లాట్, కీసరలో రెండు ఇంటి స్థలాలు, 3.21 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు గుర్తించారు. కేపీహెచ్‌బీలో విలువైన మరో ఎ÷-లాట్‌ను కూడా అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. అలాగే సుమారు రూ.20 లక్షల విలువైన ఎల్ఐసీ బాండ్లు, రూ.20 లక్షలకు పైగా పోస్టాఫీస్ సేవింగ్స్, మూడు బ్యాంకు ఖాతాల్లో రూ.71 లక్షల నగదు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. వీటితో పాటు సుమారు రూ.40 లక్షల విలువైన మూడు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు, 629 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఇక జయరాజ్ తన ఇంటి డ్రైవర్ బ్యాంకు ఖాతా నుంచి తన కుమార్తె ఖాతాలోకి రూ.24 లక్షలు బదిలీ చేయించినట్లు కూడా ఏసీబీ దర్యాప్తులో తేలింది. ఈ లావాదేవీలపై కూడా అధికారులు విచారణ చేపట్టారు. సోదాల్లో బయటపడిన ఆస్తులు, నగదు, బంగారం, బ్యాంకు లావాదేవీల ఆధారంగా జయరాజ్ ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ నిర్ధారణకు రావడంతో.. ఆయనను అరెస్ట్ చేసి వరంగల్‌కు తరలించారు. అనంతరం జయరాజ్‌ను వరంగల్‌లోని ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. కేసును పరిశీలించిన కోర్టు ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ఏసీబీ అధికారులు జయరాజ్‌ను వరంగల్ జైలుకు తరలించారు.

# నేపాల్ వరదల్లో ఆచూకీ లేని ప్రవాస ఆంధ్రులు

### ఆందోళనలో వారి కుటుంబ సభ్యులు

న్యూఢిల్లీ,ఆగస్ట్28(ప్రజాజ్యోతి): నేపాల్‌లో జరిగిన జలప్రళయంలో ఇరుక్కుపోయిన, గల్లంతైన వారిలో తెలుగు ప్రవాసీయుల కోసం వారి కుటుంబాలు ఆందోళనగా చూస్తున్నాయి. తమ వారి ఆచూకీ చెప్పాలని రాయబార కార్యాలయాలకు ఫోన్లు చేస్తున్నారు. నేపాల్- టిబెట్ సరిహద్దులో వీరి సెల్ ఫోన్లు కూడా పని చేయకపోవడంతో ప్రవాసీయుల బంధుమిత్రులు ఆందోళన చెందుతున్నారు. ఖతర్‌లో పని చేసే సి. రమేశ్ బాబు జలప్రళయానికి కొన్ని గంటల ముందు చైనా-నేపాల్ సరిహద్దులోని రసువాలో చైనా వైపు ఇమ్మిగ్రేషన్ కార్యాలయం వద్ద కనిపించారు. ఆ తర్వాత ఆయన జాడ తెలియకపోవడంతో ఖతర్‌లోని బంధుమిత్రులతో పాటు స్వస్థలమైన కృష్ణా జిల్లాలో ఆయన కుటుంబం ఆందోళన చెందుతోంది.



దుబాయిలో నివాసముండే మూడు తెలుగు కుటుంబాలకు చెందిన ఐదుగురు ప్రవాసీయులు కైలాస మానస సరోవర పరిక్రమ యాత్ర ముగించుకుని తిరిగి వస్తుండగా వరదల కారణంగా వారి ప్రయాణానికి తాత్కాలిక అడ్డంకి ఏర్పడింది. గత మూడు రోజులుగా వరద కారణాన చైనా భూభాగం వైపు రాకపోకలు ఆగిపోవడంతో పాటు సెల్ ఫోన్ సంబంధాలు కూడా తెగిపోయి దుబాయిలోని వారి కుటుంబాలు తీవ్ర ఆందోళన చెందాయి. అదృష్టవశాత్తూ శుక్రవారం టిబెట్ నుండి వీరు సురక్షితంగా నేపాల్‌కు చేరుకోవడంతో కుటుంబసభ్యుల మానసిక క్షోభకు తెరపడింది. 5 వేల అడుగుల ఎత్తున మానస సరోవర పర్వత ప్రాంతంలో వీరి సెల్ ఫోన్లు పని చేయకపోవడంతో అప్పుడప్పుడు వీరు వాట్సప్ మీద పంపుతున్న సందేశాల కోసం కుటుంబాలు ఎదురు చేశాయి. తాము చేరుకునే సమయానికి రుసువా చెక్ పోస్ట్ వరదలలో కొట్టుకుపోయిందని ఈ బృందంలోని గుంటూరు జిల్లాకు చెందిన సౌజన్య రెడ్డి దుబాయిలోని తన బంధుమిత్రులకు సమాచారమందించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మొత్తం 10 మంది ప్రవాసీయుల ఆచూకీ తెలియడం లేదని తెలుస్తోంది. వీరిలో కొందరు అమెరికాలో స్థిరపడిన వారని తెలిసింది. మంగళగిరిలోని ఏపీ ఎన్నార్టీఎస్ సంస్థ అధికారులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో వీరి యోగక్షేమ సమాచారాల గురించి రేయింబవళ్ళు విచారిస్తున్నారు. తెలంగాణకు చెందిన మొత్తం 23 మంది ప్రవాసీయులు యాత్రకు వెళ్లగా అందులో అత్యధికులు అమెరికాకు చెందిన వారే ఉన్నారు. దుబాయిలోని రెండు తెలంగాణ కుటుంబాలు కూడా యాత్రకు వెళ్లగా వారు క్షేమంగా ఉన్నట్లుగా సమాచారం.

## బాలిక ఆరోగ్యంపై మంత్రి ఆరా

### ఖమ్మం బాలికను పరామర్శించిన మంత్రి పొంగులేటి

హైదరాబాద్,ఆగస్ట్28(ప్రజాజ్యోతి): ఖమ్మం జిల్లాలో దారుణ ఘటనకు గురై నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం పరామర్శించారు. బాలిక ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న మంత్రి, అందుతున్న చికిత్సపై ఆరా తీశారు. బాలికకు మెరుగైన వైద్యం అందించి, త్వరగా కోలుకునేలా అన్ని చర్యలు తీసుకోవాలని వైద్యులను కోరారు. బాలిక కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి వారికి ధైర్యం చెప్పారు. బాలికకు న్యాయం జరిగేలా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, నిందితులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. బాలిక ఆరోగ్య పరిస్థితిని ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుందని మంత్రి పొంగులేటి తెలిపారు.

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ
మెట్రో జోన్, మింట్ కాంపౌండ్ :: హైదరాబాద్ - 63
చీఫ్ ఇంజనీర్ / మెట్రో జోన్ / గ్రేటర్ హైదరాబాద్
టెండర్ స్పెసిఫికేషన్ నంబర్లు: OT-01 నుండి OT-14/26-27 & eMZ-19/26-27 (NEW)
టెండర్ నోటీస్ నం.: CE-MZ-12/26-27 (పేపర్ నోటిఫికేషన్)
హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్‌లోని జనరల్ కేటగిరీ కింద, అర్హత కలిగిన ఏజెన్సీల నుండి క్రింది పనుల కోసం టెండర్లు ఆహ్వానించబడుతున్నాయి: (ఎ) కొన్ని O&M మెటీరియల్స్ సేకరణ (స్పెక్ నం. OT-01 నుండి OT-14/26-27) మరియు (బి) TGSRTC, ముషీరాబాద్ బస్ డిపోకు 33KV HT విద్యుత్ సరఫరాను పొడిగించే పని (eMZ-19/26-27 (New). ఈ పనులకు సంబంధించిన వివరాలను చీఫ్ ఇంజనీర్ / ఆపరేషన్ / మెట్రో జోన్ కార్యాలయం నుండి పొందవచ్చు. ఈ విషయానికి సంబంధించి మరింత సమాచారం కోసం క్రింది వెబ్‌సైట్లను సందర్శించవచ్చు: www.tender.telangana.gov.in, www.tgsouthernpower.org
R.O. No. : 8823-PP/CL/ADVT/2026-27 Date: 28-08-2026 చీఫ్ ఇంజనీర్ / ఆపరేషన్, మెట్రో జోన్, హైదరాబాద్.

# 12వ వేతన ఒప్పందంపై చిగురిస్తున్న ఆశలు

**- సెప్టెంబర్ 2న అపెక్స్ జేసీసీ సమావేశంపై కార్మికుల్లో ఉత్కంఠ**

**- ఐఎన్‌టీయూసీకి ప్రాతినిధ్యంపై ట్విస్ట్.. కోల్ ఇండియా నిర్ణయమే కీలకం**




**మంచిర్యాల, 28, ఆగస్టు (ప్రజాజ్యోతి):** బొగ్గు గని కార్మికుల వేతనాలు, భత్యాలు, ఇతర ప్రయోజనాలను నిర్ణయించే 12వ వేతన ఒప్పందం (ఎన్‌సీడబ్ల్యూఏ--శ××)పై ఆశలు మళ్లీ చిగురిస్తున్నాయి. జేబీసీసీఐ--శ×× ఏర్పాటు, గత వేతన ఒప్పందాల అమలు, కార్మిక చట్టాలపై చర్చలు కీలక దశకు చేరుకుంటున్న నేపథ్యంలో సెప్టెంబర్ 2న కోల్ ఇండియాలో జరగనున్న అపెక్స్ జాయింట్ కన్సల్టేటివ్ కమిటీ (అపెక్స్ జేసీసీ) సమావేశంపై కార్మికులు, కార్మిక సంఘాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

**- కీలక చర్చలకు వేదికగా సెప్టెంబర్ 2 సమావేశం....**

సెప్టెంబర్ 2న జరగనున్న అపెక్స్ జేసీసీ సమావేశంలో కార్మిక చట్టాల అమలులో ఇప్పటివరకు జరిగిన పురోగతి, తదుపరి కార్యాచరణ ప్రణాళికతో పాటు కార్మిక సంఘాలకు సంబంధించిన పలు పెండింగ్ అంశాలపై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా జేబీసీసీఐ--శ×× ఏర్పాటు, ఎన్‌సీడబ్ల్యూఏ--శ×× చర్చలకు మార్గం సుగమం చేయడం వంటి అంశాలపై కార్మిక సంఘాలు చాలాకాలంగా డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది.

**- ఐఎన్‌టీయూసీ లేఖతో కొత్త మలుపు........**

ఇదిలా ఉండగా, సెప్టెంబర్ 2న జరిగే అపెక్స్ జేసీసీ సమావేశంలో తమ ప్రతినిధులను కూడా అనుమతించాలని ఇండియన్ నేషనల్ మైన్‌వర్కర్స్ ఫెడరేషన్ (ఐఎన్ఎంఎఫ్--ఐఎన్‌టీయూసీ) కోల్ ఇండియా యాజమాన్యాన్ని కోరింది. ఈ మేరకు ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి ఎస్.క్యూ. జామా ఆగస్టు 27న కోల్ ఇండియా ఛైర్మన్, డైరెక్టర్ (హెచ్‌ఆర్)కు లేఖ రాసినట్లు సమాచారం.

**- ఉమ్మడి నోటీసుపై సంతకం..**

**తమకూ ప్రాతినిధ్యం ఇవ్వాలని డిమాండ్......**

జూలై 29, 2026న హెచ్ఎంఎస్, ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎన్ఎంఎఫ్ (ఐఎన్‌టీయూసీ) కలిసి జారీ చేసిన ఉమ్మడి నోటీసును ఐఎన్‌టీయూసీ తన లేఖలో ప్రస్తావించింది. జేబీసీసీఐ--శ×× ఏర్పాటు, గత ఎన్‌సీడబ్ల్యూఏ అమలు వంటి డిమాండ్లపై తాము కూడా సంతకం చేశామని పేర్కొంది. అందువల్ల అదే అంశాలపై జరిగే సెప్టెంబర్ 2 సమావేశంలో తమ ప్రతినిధులకు కూడా ప్రాతినిధ్యం కల్పించాలని కోరింది. సమావేశానికి హాజరయ్యేందుకు తమ ప్రతినిధులకు సాంకేతిక, చట్టపరమైన, పరిపాలనాపరమైన అడ్డంకులు లేవని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.

**- గత సమావేశాల్లో పాల్గొన్న విషయాన్ని ప్రస్తావించిన ఐఎన్‌టీయూసీ........**

కోల్ ఇండియా అపెక్స్ జేసీసీతో పాటు జేబీసీసీఐ--శ× ప్రామాణీకరణ కమిటీ వంటి సమావేశాల్లో తమ ప్రతినిధులు గతంలో పాల్గొన్న విషయాన్ని కూడా ఐఎన్‌టీయూసీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లింది. గతంలో అవకాశం కల్పించిన నేపథ్యంలో ప్రస్తుతం కూడా సెప్టెంబర్ 2 సమావేశానికి తమ ప్రతినిధులను అనుమతించాలని కోరుతోంది.

**- 2017 అవగాహన ఒప్పందంపైనా ప్రస్తావన........**

2017 జనవరి 11న కుదిరిన అవగాహన ఒప్పందాన్ని కూడా ఐఎన్‌టీయూసీ తన లేఖలో ప్రస్తావించింది. ఆ ఒప్పందానికి ఆధారంగా పేర్కొన్న చట్టపరమైన పరిస్థితులు ప్రస్తుతం వర్తించవని పేర్కొంటూ, దీనికి సంబంధించి 2016 సెప్టెంబర్ 16న ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును కూడా ప్రస్తావించినట్లు సమాచారం. కోల్ ఇండియా, సింగరేణి సంస్థల్లోని తమ అనుబంధ కార్మిక సంఘాల సభ్యుల సమిష్టి ప్రయోజనాలకు తాము ప్రాతినిధ్యం వహిస్తున్నామని ఐఎన్‌టీయూసీ స్పష్టం చేసింది.

**- జేబీసీసీఐ--XII ఏర్పాటుపైనే ప్రధాన ఆసక్తి...........**

బొగ్గు గని కార్మికుల వేతనాలు, భత్యాలు, ఉద్యోగ భద్రత, ఇతర ప్రయోజనాలపై ప్రభావం చూపే ఎన్‌సీడబ్ల్యూఏ-XII కోసం కార్మిక వర్గాలు చాలాకాలంగా ఎదురుచూస్తున్నాయి. జేబీసీసీఐ--XII ఏర్పాటు పూర్తయిన తర్వాతే 12వ వేతన ఒప్పందానికి సంబంధించిన చర్చలు అధికారికంగా ముందుకు సాగే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 2న జరిగే అపెక్స్ జేసీసీ సమావేశంలో జేబీసీసీఐ-XII ఏర్పాటుపై ఏదైనా స్పష్టత వస్తుందా? వేతన ఒప్పంద చర్చలకు కదలిక లభిస్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.

**- కోల్ ఇండియా నిర్ణయంపైనే ఉత్కంఠ..........**

మరోవైపు సెప్టెంబర్ 2 సమావేశానికి ఐఎన్ఎంఎఫ్ (ఐఎన్‌టీయూసీ) ప్రతినిధులను అనుమతిస్తారా? లేదా? అన్న అంశం కూడా చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి డిమాండ్‌పై తాము సంతకం చేశామని, గతంలో కోల్ ఇండియా సమావేశాల్లో పాల్గొన్నామని ఐఎన్‌టీయూసీ వాదిస్తుండగా.. సమావేశంలో ఎవరికి ఎంత ప్రాతినిధ్యం కల్పించాలన్నది కోల్ ఇండియా యాజమాన్యం తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంది.

ఈ అంశం కార్మిక వర్గాల్లో హాట్‌టాపిక్ గా మారింది . 12వ వేతన ఒప్పందంపై చిగురిస్తున్న ఆశలు, జేబీసీసీఐ-XII ఏర్పాటుపై పెరుగుతున్న ఆసక్తి, సెప్టెంబర్ 2 అపెక్స్ జేసీసీ సమావేశంపై ఉత్కంఠ, ఐఎన్‌టీయూసీ ప్రాతినిధ్యంపై నెలకొన్న ట్విస్ట్ ప్రస్తుతం బొగ్గు గని కార్మిక వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారాయి. సెప్టెంబర్ 2న కోల్ ఇండియా యాజమాన్యం తీసుకునే నిర్ణయాలు 12వ వేతన ఒప్పందం దిశగా తదుపరి పరిణామాలకు ఎంతవరకు దోహదం చేస్తాయన్నది వేచిచూడాల్సి ఉంది.

# మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసులు ఇవ్వాలి

**ఇంటింటికీ వెళ్లి వివరాలు పరిశీలించాలి: తహసీల్దార్ కవిత**



**ఆసిఫాబాద్, ఆగస్టు 28 (ప్రజాజ్యోతి) :** మ్యాపింగ్ కాని, అనమలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు ఎలాంటి జాప్యం లేకుండా నోటీసులు అందించాలని వాంకిడి తహసీల్దార్ కవిత బీఎల్‌ఓలను ఆదేశించారు. శుక్రవారం ఖమనా పంచాయతీ రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి సంబంధిత ఓటర్లకు నోటీసులు అందించడంతో పాటు వారి వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు, అవకతవకలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు సక్రమంగా ఉండేలా అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీపీఓ దుర్గం రాజేశ్వర్, భునేశ్వర్, బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఖేలో ఇండియా వూషూ శిక్షణ కేంద్రంలో క్రీడా సందడి





**నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 28, (ప్రజాజ్యోతి) :** జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో భైంసాలోని ఖేలో ఇండియా వూషూ శిక్షణ కేంద్రంలో క్రీడాకారులకు వివిధ వినోదాత్మక క్రీడా పోటీలు నిర్వహించారు. శిక్షణ కేంద్రం కోచ్ సాయికృష్ణ సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి, కౌన్సిలర్ రజిత పతకాలను అందజేసి అభినందించారు.

ఈ సందర్భంగా జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువతలో క్రీడలపై ఆసక్తిని పెంపొందించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చడం, క్రమశిక్షణ, పట్టుదల, జట్టు స్ఫూర్తిని పెంపొందించడమే జాతీయ క్రీడా దినోత్సవం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. యువత ప్రతిరోజూ క్రీడలు, వ్యాయామం, యోగా వంటి శారీరక కార్యకలాపాలకు సమయం కేటాయించాలని సూచించారు.

"ఆరోగ్యమే మహాభాగ్యం – క్రీడలే ఆరోగ్యానికి పునాది" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు ముగ్గం విక్రమ్, ప్రకాష్ పాటిల్, ఉప్పు రవీందర్, శ్రీ సాయినాథ్ తదితరులు పాల్గొని క్రీడాకారులను అభినందించారు. ఖేలో ఇండియా వూషూ శిక్షణ కేంద్రం క్రీడాకారులు, కోచ్‌లు, క్రీడాభిమానులు, ప్రజాప్రతినిధులు, క్రీడా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# పద్మశాలి సంఘంలో జంధ్యాల పౌర్ణమి వేడుకలు







**బాసర, ఆగస్టు 28 (ప్రజా జ్యోతి) :** బాసర మండల కేంద్రంలోని పద్మశాలి సంఘ భవనంలో శుక్రవారం జంధ్యాల పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని సంఘ సభ్యులు మార్కండేయునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూలుపోగులతో తయారు చేసిన జంధ్యాలను ధరించి, ఒకరికొకరు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘ సభ్యులు సంప్రదాయాలను పాటిస్తూ జంధ్యాలు ధరించారు. పండుగ ప్రాధాన్యతను గుర్తుచేసుకుంటూ సంఘ సభ్యులు పరస్పరం ఆత్మీయంగా శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు స్వామి, రాష్ట్ర కార్యదర్శి కే.గంగాధర్, కోశాధికారి మేకల అశోక్, అంకం రమేష్, ఇంకేటి శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

# బంగారం మైనింగ్‌లో హట్టి-సింగరేణి జతకట్టాలి








**- భవిష్యత్ ప్రాజెక్టుల్లో జాయింట్ వెంచర్‌గా కలిసి పనిచేసే అవకాశాలను పరిశీలించాలి**

**- సింగరేణి అధికారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దిశానిర్దేశం**

**- హట్టి, యూటీ బంగారు గనులు, శుద్ధి కేంద్రాలను పరిశీలించిన డిప్యూటీ సీఎం**

**మంచిర్యాల, 28, ఆగస్టు (ప్రజాజ్యోతి) :** బంగారం మైనింగ్‌లో విశేష అనుభవం కలిగిన కర్ణాటక ప్రభుత్వ రంగ సంస్థ హట్టి గోల్డ్ మైన్స్‌తో సింగరేణి కలిసి పనిచేసేలా భవిష్యత్ ప్రాజెక్టుల్లో జాయింట్ వెంచర్ అవకాశాలను పరిశీలించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు సింగరేణి అధికారులను ఆదేశించారు. రెండు ప్రభుత్వ రంగ సంస్థలకు ఉన్న సాంకేతిక సామర్థ్యం, అనుభవాన్ని సమన్వయం చేస్తే దేశీయ బంగారం ఉత్పత్తిలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని అన్నారు. కర్ణాటక గోల్డ్ మైన్స్ ప్రాంతంలో రెండో రోజు పర్యటనలో భాగంగా శుక్రవారం రాయచూర్ జిల్లాలోని హట్టి, యూటీ బంగారు గనులను ఉప ముఖ్యమంత్రి సందర్శించారు. బంగారు ఖనిజం అన్వేషణ, తవ్వకం, ప్రాసెసింగ్ నుంచి శుద్ధ బంగారం తయారీ వరకు కొనసాగుతున్న ప్రక్రియలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. హట్టి గోల్డ్ మైన్స్‌కు బంగారం అన్వేషణ, తవ్వకం, ప్రాసెసింగ్, శుద్ధిలో అపార అనుభవం ఉందని భట్టి విక్రమార్క తెలిపారు. బొగ్గు, ఇతర ఖనిజాల అన్వేషణ, తవ్వకాల్లో సింగరేణికి ఉన్న సాంకేతిక నైపుణ్యాన్ని హట్టి అనుభవంతో అనుసంధానం చేయాలని సూచించారు. బంగారం అన్వేషణ, తవ్వకం, వెలికితీత, శుద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, నిపుణుల సేవలు, మానవ వనరుల శిక్షణ తదితర అంశాల్లో రెండు సంస్థలు సంయుక్తంగా పనిచేసేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సింగరేణి అధికారులను ఆదేశించారు. భవిష్యత్‌లో బంగారు ఖనిజ ప్రాజెక్టులను చేపట్టే సమయంలో హట్టి గోల్డ్ మైన్స్‌తో సాంకేతిక సహకారం, భాగస్వామ్యం, జాయింట్ వెంచర్ అవకాశాలను పరిశీలించాలని స్పష్టం చేశారు. దేశ ఆర్థిక భద్రతలో బంగారం కీలక పాత్ర పోషిస్తుందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. దేశంలో అందుబాటులో ఉన్న బంగారు ఖనిజ వనరులను శాస్త్రీయ పద్ధతుల్లో అన్వేషించి వెలికితీయడంలో సింగరేణి వంటి ప్రభుత్వ రంగ సంస్థలు ముందుండాలని అన్నారు. బంగారం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి దేశీయ ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. హట్టి--సింగరేణి భాగస్వామ్యంతో బంగారం ఉత్పత్తిని పెంచడంతోపాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, స్థానిక ఉపాధి కల్పన, దేశ ఆర్థికాభివృద్ధికి మేలు జరుగుతుందని తెలిపారు. హట్టి గోల్డ్ మైన్స్‌లోని ప్రొడక్షన్ యూనిట్, ఖనిజ శుద్ధి కేంద్రం, ఎలక్ట్రో విన్నింగ్ కేంద్రాలను ఉప ముఖ్యమంత్రి పరిశీలించారు. గని నుంచి వెలికితీసిన ఖనిజాన్ని వివిధ దశల్లో ప్రాసెస్ చేసి శుద్ధ బంగారంగా మార్చే విధానాన్ని అధికారులు వివరించారు. హట్టి ప్రాజెక్టు ద్వారా రోజుకు సగటున రెండు నుంచి నాలుగు కిలోల బంగారం ఉత్పత్తి అవుతోందని అధికారులు తెలిపారు. అనంతరం యూటీ ఓపెన్ కాస్ట్ గోల్డ్ మైన్ వ్యూ పాయింట్‌ను సందర్శించిన భట్టి విక్రమార్క.. బంగారం ముడి ఖనిజాన్ని వెలికితీస్తున్న విధానం, ఖనిజం సేకరిస్తున్న ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఓపెన్ కాస్ట్ గనిలో ఎంత లోతు నుంచి బంగారం తయారీకి అవసరమైన ముడి ఖనిజాన్ని వెలికితీస్తున్నారనే వివరాలను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బంగారు ఖనిజ గనికి సంబంధించిన సమగ్ర మ్యాప్‌లను పరిశీలించారు.

బంగారు ఖనిజ అన్వేషణకు ఎలాంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడి అధికారులు ఉప ముఖ్యమంత్రితో మొక్కను నాటించారు. తదుపరి యూటీ భూగర్భ గనిలో జరుగుతున్న బంగారు ఖనిజ తవ్వకాలను కూడా ఆయన పరిశీలించారు. భూగర్భ గనిలో ఖనిజం తవ్వకం, రవాణా, యంత్రాల వినియోగం, కార్మికుల భద్రత తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

బంగారం మైనింగ్‌లో అనుసరిస్తున్న భద్రతా ప్రమాణాలు, సాంకేతిక విధానాలను సింగరేణి భవిష్యత్ ప్రాజెక్టుల్లో ఉపయోగించుకునే అంశాలను కూడా పరిశీలించాలని సూచించారు. ఈ పర్యటనలో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి, ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, జనరల్ మేనేజర్ పంకజ్ కులశ్రేష్ఠ, రాయచూరు జిల్లా పరిషత్ సభ్యులు అమ్జద్, హట్టి గోల్డ్ మైన్స్ ఉన్నతాధికారులు అరుణవ ఘోష్, సఫీయుల్లా ఖాన్, విధాత్రి ఉపుంద, యెమ్నూరప్ప గౌడ, రిటైర్డ్ కల్నల్ దస్తగిరిసాహెబ్ దఫేదార్ తదితరులు పాల్గొన్నారు.


# పెండింగ్ భూసమస్యల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 28, (ప్రజాజ్యోతి) :** పెండింగ్‌లో ఉన్న భూసమస్యల దరఖాస్తులను ప్రాధాన్యత ప్రాతిపదికన వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి తహసీల్దార్లతో పెండింగ్ భూసమస్యల దరఖాస్తుల పరిష్కారంపై జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తుల వివరాలను సమీక్షించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయి విచారణను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. దరఖాస్తుదారుల వినతులను నిబంధనల ప్రకారం ఎప్పటికప్పుడు పరిష్కరించాలని స్పష్టం చేశారు. తగిన ఆధారాలు లేని దరఖాస్తులను తిరస్కరించే సమయంలో అందుకు గల కారణాలను స్పష్టంగా నమోదు చేయాలన్నారు. భూసమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని, రెవెన్యూ, సర్వే బృందాలు సమన్వయంతో పనిచేసి భూవివాదాల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.

# తేజాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం



**నేరడిగొండ, ఆగస్టు 28 (ప్రజాజ్యోతి) :** మండలంలోని తేజాపూర్ గ్రామంలో హార్వెస్ట్ మినిస్ట్రీస్, ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామస్తులకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. శిబిరంలో రక్త పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలతో పాటు కంటి పరీక్షలు, ఎక్స్‌రే, దంత వైద్య పరీక్షలు, మహిళల ఆరోగ్య పరీక్షలు, ఈసీజీ తదితర వైద్య పరీక్షలను నిర్వహించారు. వైద్యుల సూచనల మేరకు అర్హులైన రోగులకు ఉచితంగా మందులు, కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తేజాపూర్ సర్పంచ్ సింగారి వసుంధర నవీన్, ఉపసర్పంచ్ తెడ్డు రవి, నిర్వాహకులు పాస్టర్ డేవిడ్ పాల్, సంఘ పెద్దలు, యువత, హార్వెస్ట్ మినిస్ట్రీస్ కోఆర్డినేటర్ శ్రీధర్, ఆశ్రయం వైద్య బృందం ఇన్‌చార్జి జయరాజ్‌తో పాటు వైద్య, పారామెడికల్ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేకు రాఖీ కట్టిన శిశుమందిర్ చిన్నారులు



**నేరడిగొండ, ఆగస్టు 28 (ప్రజాజ్యోతి) :** రాఖీ పండుగ సందర్భంగా నేరడిగొండ మండల కేంద్రంలోని శిశుమందిర్ పాఠశాల విద్యార్థులు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిసి రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులు ఎమ్మెల్యేకు రాఖీ కట్టి ఆయనకు తమ ఆప్యాయతను చాటుకున్నారు.రాఖీ కడుతూ ఓ చిన్నారి "మీరు మాకు రక్ష, మేము మీకు రక్ష, మనమందరం దేశానికి రక్ష" అంటూ చెప్పిన మాటలు ఎమ్మెల్యేను ఆకట్టుకున్నాయి. చిన్నారి మాటలకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు మాట్లాడుతూ నియోజకవర్గ అన్నగా ప్రజలకు మరిన్ని సేవలు అందిస్తూ, భవిష్యత్‌లో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# బాసర పోలీస్ స్టేషన్‌లో ఘనంగా రాఖీ వేడుకలు

**బాసర, ఆగస్టు 28 (ప్రజాజ్యోతి) :** బాసర మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో రాఖీ పండుగ వేడుకలను పోలీసులు ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు స్టేషన్ హౌస్ ఆఫీసర్ దీపక్ ఆధ్వర్యంలో సిబ్బంది రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న మహిళా సిబ్బంది సీఐ దీపక్‌కు రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది రాఖీ వేడుకల్లో పాల్గొన్నారు.

# అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్



**జన్నారం, ఆగస్ట్ 28 (ప్రజాజ్యోతి) :** అన్నాచెల్లెళ్ల, అక్క తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్. రక్షాబంధన్ వేడుకలను శుక్రవారం రోజున జన్నారం మండల కేంద్రంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు.అక్కలు తమ్ముళ్లకు, చెల్లెల్లు అన్నయ్యలకు రాఖీ లు కట్టి మిఠాయిలు తినిపించారు. సోదరీమణులపై ప్రేమతో వారి సోదరులు గుర్తుగా నగదు, కానుకలు అందజేశారు.రక్షాబంధన్ అంటేనే ఎక్కడెక్కడో ఉన్న అక్కలు,చెల్లెల్లు వారి సోదరులకు రాఖీ కట్టడానికి సోదరుల ఇంటికి వచ్చి రాఖీ కట్టి తమ ప్రేమను చాటుకున్నారు.

# కబ్జాకు గురైన చెరును సర్వే చేయాలని తాసిల్దార్ కార్యాలయం ముందు నిరసన



**జన్నారం, ఆగస్ట్ 28 (ప్రజాజ్యోతి) :** జన్నారం మండలం రేండ్లగూడ గ్రామంలో కబ్జాకు గురైన అల్లం వారి కుంట ను సర్వే చేయాలని కోరుతూ గ్రామానికి చెందిన కొందరు శుక్రవారం రోజున తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నెంబర్ 160,161 లో ఉన్న దాదాపు 25 ఎకరాల అల్లం వారి కుంట కబ్జాకు గురైందని గత కొన్ని రోజులుగా రెవెన్యూ మరియు ఇరిగేషన్ అధికారులకు తెలియజేసిన పట్టించుకోకపోవడంతో కలెక్టర్ ఫిర్యాదు చేయడం జరిగిందని, కబ్జాకు గురైన చెరువును సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని కలెక్టర్ ఆదేశించిన కూడా అధికారులు పట్టించుకోవడంలేదని వాపోయారు.కబ్జాకు గురైన చేరువును సర్వే చేయడానికి అధికారులు ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు.కబ్జాకు గురైన కుంటను వెంటనే సర్వే చేసి హద్దులు నిర్ణయించి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సముద్రాల శంకర్,దాసరి తిరుపతి, అల్లం సాంబయ్య,ఆకుల మధు,దస్తగిరి,శ్రీనివాస్,ప్రభాకర్ లు పాల్గొన్నారు.

# జనాభా లెక్కల్లో బీసీ ఉపకులాలకు ప్రత్యేక కోడ్‌లను కేటాయించాలి



**జన్నారం, ఆగస్ట్ 28 (ప్రజాజ్యోతి) :** బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం తెలంగాణ రాష్ట్ర సీనియర్ నాయకులు కోడూరి చంద్రయ్య గారు మాట్లాడుతూ 2027లో నిర్వహించనున్న జనాభా లెక్కల్లో బీసీ ఉపకులానికి ప్రత్యేక సబ్ క్యాస్ట్ కోడ్ కేటాయించాలని బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం తెలంగాణ రాష్ట్ర సీనియర్ నాయకులు కోడూరి చంద్రయ్య డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బీసీ సమాజం అనేక ఉపకులాలుగా విభజించబడి ఉందని, ప్రతి ఉపకులం సామాజిక, ఆర్థిక, విద్యా, వృత్తి పరంగా ప్రత్యేక పరిస్థితులను ఎదుర్కొంటోందని అన్నారు.కావున " బిసి" అనే ఒకే కోడ్‌తో జనాభా వివరాలను నమోదు చేయడం వల్ల ఉపకులాల వాస్తవ జనాభా, వెనుకబాటుతనం, అవసరాలు స్పష్టంగా తెలియవని పేర్కొన్నారు. కావున 2027 జనాభా లెక్కల్లో కులం, బీసీ ఉపకులం, ఉపకులానికి ప్రత్యేక కోడ్ వంటి వివరాలను శాస్త్రీయ పద్ధతిలో నమోదు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

## తోబుట్టువుగా అండగా ఉంటా.. పెద్దన్నగా పనిచేస్తా

**రాఖీ కట్టిన మహిళలకు చీరలు బహూకరించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి**

వనపర్తి, ఆగస్టు 28 (ప్రజాజ్యోతి): రాఖీ పౌర్ణమి సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి నియోజకవర్గంలోని మహిళలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు,



మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా రాఖీ కట్టిన మహిళలకు ఎమ్మెల్యే చీరలు బహూకరించారు. మహిళలు తనను అన్నగా భావించి రాఖీ కట్టినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ‘‘ఇకపై మిమ్మల్ని నా తోబుట్టువులుగా భావిస్తూ ఎల్లవేళలా అండగా ఉంటా. ఏ సమస్య వచ్చినా నా దృష్టికి తీసుకురండి. పరిష్కారానికి కృషి చేస్తా’’ అని మేఘారెడ్డి భరోసా ఇచ్చారు. నియోజకవర్గంలోని ప్రతి మహిళకు పెద్దన్నగా అండగా ఉంటానని, వారి భద్రత, సంక్షేమం, గౌరవానికి ప్రాధాన్యం ఇస్తానని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరించి చీరలు బహూకరించడం తమకు సంతోషాన్ని కలిగించిందని మహిళలు తెలిపారు.

## ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

– దాతృత్వం చాటుకున్న రేగుల బాలరాజు

వనపర్తి, ఆగస్టు 28 (ప్రజాజ్యోతి): భక్త మార్కండేయ స్వామి శ్రీ జ్ఞాన సరస్వతి దేవి ఆలయ నిర్మాణానికి భక్తుల నుంచి విరాళాల సేకరణ కొనసాగుతోంది. ఇందులో భాగంగా వనపర్తికి చెందిన రేగుల బాలరాజు (పాతబజార్ చిన్న) ఆలయ నిర్మాణం కోసం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. పద్మశాలి సంక్షేమ సేవా సమితి (ట్రస్ట్), వనపర్తి జిల్లా ఆధ్వర్యంలో చేపడుతున్న విరాళాల సేకరణ కార్యక్రమంలో భాగంగా బాలరాజు ఈ మొత్తాన్ని అందించారు. ఆలయ నిర్మాణానికి తనవంతు సహకారం అందించడం పట్ల



ట్రస్ట్ సభ్యులు దాతృత్వం చాటుకున్న బాలరాజును అభినందించారు. ఆలయ నిర్మాణం విజయవంతంగా పూర్తయ్యేందుకు భక్తులు, దాతలు తమవంతు సహకారం అందించాలని ట్రస్ట్ సభ్యులు కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ రావిరాల శ్రీనివాస్, కార్యదర్శి కర్లీ శాంతయ్య, కోశాధికారి బాస శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కె.జి.బి.వి విద్యార్థినులతో రాఖీ కట్టించుకున్న అదనపు కలెక్టర్

**విద్యార్థినులతో కలిసి అల్పాహారం.. భవిష్యత్ లక్ష్యాలపై ఆప్యాయంగా ముచ్చట**

మహబూబ్‌నగర్, ఆగస్టు 28:1 ( ప్రజా జ్యోతి బ్యూరో ): రక్షాబంధన్ పండుగ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని యెనుగొండ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కె.జి.బి.వి.)లో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులతో కలిసి పండుగ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ





సందర్భంగా విద్యార్థినులు అదనపు కలెక్టర్‌కు రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థినులతో ఆప్యాయంగా ముచ్చటించిన అదనపు కలెక్టర్.. రక్షాబంధన్ పండుగ సోదర సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, పరస్పర గౌరవం, రక్షణకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. పాఠశాలకు ఉదయమే చేరుకున్న అదనపు కలెక్టర్ విద్యార్థినులతో కలిసి అల్పాహారం చేశారు. అనంతరం వారి చదువు, భవిష్యత్ లక్ష్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు కష్టపడి చదివి ఉన్నత విద్యను అభ్యసిస్తూ తమకు నచ్చిన రంగాల్లో రాణించాలని, జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అదనపు కలెక్టర్ తమతో కలిసి రాఖీ పౌర్ణమి వేడుకల్లో పాల్గొని, తమతో కలిసి అల్పాహారం చేయడం పట్ల విద్యార్థినులు, పాఠశాల సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కె.జి.బి.వి. ప్రత్యేక అధికారి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఛత్రపతి శివాజీ సేన అధ్యక్షుడిగా బాదేపల్లి నరేష్ గౌడ్ ఎన్నిక

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, ఆగస్టు 28 (ప్రజా జ్యోతి): నారాయణపేట జిల్లా ఛత్రపతి శివాజీ సేన అధ్యక్షుడిగా మక్తల్ పట్టణానికి చెందిన బాదేపల్లి నరేష్ గౌడ్ను నియమించి



నట్లు ఛత్రపతి శివాజీ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు తోట మధుకర్ తెలిపారు. నారాయణ పేట జిల్లాలో జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ఛత్రపతి శివాజీ సేనను మరింత బలోపేతం చేయడంతో పాటు, సంస్థ కార్యకలాపాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతలను బాదేపల్లి నరేష్ గౌడ్‌కు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు బాదేపల్లి నరేష్ గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు తోట మధుకర్‌కు, అలాగే ఛత్రపతి శివాజీ సేన సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆశయాలు, ధైర్యసాహసాలు, ప్రజా సంక్షేమం కోసం ఆయన చేసిన పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని నరేష్ గౌడ్ తెలిపారు. నారాయణపేట జిల్లాలో సంస్థను గ్రామస్థాయి వరకు విస్తరించి, యువతను సంఘటితం చేసి, ఛత్రపతి శివాజీ సేనను మరింత బలోపేతం చేయడానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని ఆయన అన్నారు.

# ప్రతి తండా అభివృద్ధే లక్ష్యం.. ప్రతి తండాకు రోడ్డు.. సాగునీరు

– గిరిజనుల ఆత్మగౌరవం, సంక్షేమానికి పెద్దపీట: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి. ఆగస్టు 28 (ప్రజాజ్యోతి): గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి, ఆత్మగౌరవం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని



వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. ప్రతి తండాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. శుక్రవారం పెద్దమందడి మండలం మంగంపల్లిలో నిర్వహించిన నియోజక వర్గస్థాయి గిరిజనుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. నియోజక వర్గంలోని ప్రతి తండాలో ఇల్లు లేని గిరిజన కుటుంబాలను గుర్తించి అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

### 32 తండాల్లో సేవాలాల్ ఆలయాలు

వనపర్తి నియోజకవర్గంలోని 32 తండా గ్రామపంచాయతీల్లో సేవాలాల్ మహారాజ్ ఆలయాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని మేఘారెడ్డి తెలిపారు. ఖిల్లాఘణపురం మండల కేంద్రంలో సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

### ప్రతి తండాకు రోడ్డు, సాగునీరు

ప్రతి తండాకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. తాగునీరు, విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను సమర్థవంతంగా వినియోగించి గిరిజన గ్రామపంచాయతీలను అభివృద్ధి చేస్తామన్నారు. గిరిజన రైతుల భూములకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కర్నేతండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు ‘శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ ప్రాజెక్ట్’ గా నామకరణం చేయిస్తున్నట్లు వెల్లడించారు. పోడు భూముల సమస్య పరిష్కారానికి ప్రభుత్వ స్థాయిలో కృషి చేస్తామని తెలిపారు. ప్రతి తండాలో ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా అవసరమైన చోట హెల్త్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

### సర్పంచుల పెండింగ్ బిల్లుల చెల్లింపునకు చర్యలు

గ్రామాల అభివృద్ధికి పనిచేసిన పాత, కొత్త



సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజాప్రతినిధులకు న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు, మహిళలు, పేదలు, యువత, గిరిజనులు, బలహీన వర్గాల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టిందని వివరించారు. వనపర్తి నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ.2 వేల కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు.

### 24 గంటలు ప్రజల కోసం పనిచేస్తా

నియోజకవర్గ అభివృద్ధి కోసం 24 గంటలు పనిచేయడానికి సిద్ధంగా ఉన్నానని మేఘారెడ్డి అన్నారు. పదవిని ప్రజలకు సేవ చేసే అవకాశంగా భావిస్తున్నానని, ప్రతి గ్రామం, ప్రతి తండా అభివృద్ధి చెందే వరకు విశ్రమించబోనని స్పష్టం చేశారు. ‘‘ప్రతి తండా అభివృద్ధి చెందాలి.. ప్రతి గిరిజన కుటుంబం ఆత్మగౌరవంతో జీవించాలి. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఇదే నా సంకల్పం’’ అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు వాల్యానాయక్, దిశా కమిటీ సభ్యుడు రవినాయక్, జిల్లా కాంగ్రెస్ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు విజయలక్ష్మి , మంగంపల్లి సర్పంచ్ రమేష్, మాజీ సర్పంచ్ రాధాకృష్ణ, అనకాపల్లి సర్పంచ్ ఆంజనేయులు నాయక్, కోతులకుంట తండా సర్పంచ్ పాండునాయక్, మాజీ ఎంపీపీ శంకర్‌నాయక్, ఎంపీటీసీ నాగరాజునాయక్‌తో పాటు పలువురు సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గిరిజన పెద్దలు, యువత, మహిళలు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి

**పంటలకు నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి: అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**

మహబూబ్‌నగర్, ఆగస్టు 28 ( ప్రజా జ్యోతి బ్యూరో ): ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున వ్యవసాయ రంగంపై ప్రతికూల ప్రభావం పడకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా రైతులకు ఎప్పటికప్పుడు పంటల సాగు, సంరక్షణపై సరైన సూచనలు, సలహాలు అందించాలని సూచించారు.



శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్ నుంచి వ్యవసాయ శాఖ అధికారులతో వెబెక్స్ ద్వారా అదనపు కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నెలకొన్న వాతావరణ పరిస్థితులు, ఇప్పటివరకు నమోదైన వర్షపాతం, మండలాల వారీగా పంటల సాగు విస్తీర్ణం, ప్రస్తుతం పంటల పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు తదితర వ్యవసాయ ఇన్‌పుట్‌ల లభ్యత, సరఫరా పరిస్థితిని సమీక్షించారు. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో మార్పులు సంభవించే అవకాశం ఉన్న నేపథ్యంలో పంటల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పంటల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు, సలహాలను సకాలంలో అందించాలని ఆదేశించారు. వాతావరణ మార్పులు, వాటి ప్రభావాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించడంతో పాటు పంటలకు నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించాలని అన్నారు. ఎల్‌నినో ప్రభావానికి గురయ్యే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ రైతుల సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని, అవసరమైన సాంకేతిక సహకారం అందించాలని స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన వ్యవసాయ ఇన్‌పుట్‌లు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సంరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎల్‌నినో పరిస్థితుల కారణంగా వ్యవసాయ కార్యకలాపాలపై ప్రతికూల ప్రభావం పడకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, రైతులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయాన్ని సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని మధుసూదన్ నాయక్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద నాయక్, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీల్లో మౌలిక వసతుల పనులు వేగవంతం చేయాలి

**- నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి: అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**

మహబూబ్‌నగర్, ఆగస్టు 28 ( ప్రజా జ్యోతి బ్యూరో ): జిల్లాలోని వివిధ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) నాబార్డ్ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నాబార్డ్ నిధుల కింద మంజూరైన పనుల పురోగతిపై శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్ నుంచి వెబెక్స్ ద్వారా అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా కేజీబీవీల్లో విద్యా సంక్షేమ మౌలిక వసతుల సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని పనుల వారీగా సమీక్షించారు. అదనపు తరగతి గదులు, సైన్స్ ల్యాబ్‌లు, కిచెన్ షెడ్లు, మరుగుదొడ్లు, ప్రహరీ గోడల నిర్మాణం, ఇతర మరమ్మతు పనుల ప్రస్తుత స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పూర్తయిన పనులు, నిర్మాణంలో ఉన్నవి, ఇంకా ప్రారంభం కానివి, పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలతో పాటు పనుల పురోగతిలో ఎదురవుతున్న సమస్యలపై సమగ్రంగా సమీక్షించారు. పనులు నిర్ణీత ప్రణాళిక ప్రకారం సాగుతున్నాయా లేదా అనే విషయాన్ని క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. పెండింగ్ పనులను గుర్తించి వాటిని త్వరితగతిన పూర్తి చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఎలాంటి జాప్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన సాంకేతిక, నాణ్యతా ప్రమాణాలతో పాటు పనుల షెడ్యూల్‌ను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పనులను తరచూ పరిశీలించి నాణ్యత, పనుల వేగం, ప్రణాళికాబద్ధమైన అమలును



నిర్ధారించాలని ఆదేశించారు. పనుల అమలులో ఎదురయ్యే సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు. నాబార్డ్ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులు పూర్తయితే కేజీబీవీ విద్యార్థినులకు మెరుగైన విద్యా, మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయని, అందువల్ల పనుల పూర్తి విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మధుసూదన్ నాయక్ సూచించారు. ఈ సమావేశంలో కేజీబీవీ డీజీసీవో అస్త్ర ఖాద్రి, స్పెషల్ ఆఫీసర్లు, ఈఈ, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి దర్శనానికి వెళ్లి గుండెపోటుతో ఏఎస్సై కన్నయ్య మృతి

గద్వాల ఆగస్టు 28(ప్రజా జ్యోతి ప్రతినిధి): తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనానికి వెళ్లిన జోగుళాంబ గద్వాల జిల్లా పోలీసు శాఖకు చెందిన ఏఎస్సై కన్నయ్య గుండెపోటుతో మృతి చెందారు.ఆయన మృతిపట్ల జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు, ఐపీఎస్ తీవ్ర



దిగ్భ్రాంతి వ్యక్తం చేసి ప్రగాఢ సంతాపం తెలిపారు.శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించిన కన్నయ్య ప్రస్తుతం జిల్లా స్పెషల్ బ్రాంచ్‌లో ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు.గురువారం రాత్రి తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనం కోసం వెళ్లి,మొక్కు తీర్చుకునే క్రమంలో మెట్ల మార్గం ద్వారా కొండపైకి వెళ్తుండగా చివరి దశలో అకస్మాత్తుగా గుండెపోటుకు గురై మృతి చెందినట్లు అధికారులు తెలిపారు.కన్నయ్య 1989 బ్యాచ్‌లో పోలీస్ కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరారు.37 సంవత్సరాల 8 నెలల సుదీర్ఘ పోలీసు సేవలో హెడ్ కానిస్టేబుల్‌గా,అనంతరం ఏఎస్సైగా పదోన్నతులు పొందారు.వివిధ పోలీస్‌స్టేషన్లు,విభాగాల్లో విధులు నిర్వహిస్తూ నిబద్ధత, సౌమ్యత,బాధ్యతాయుతమైన పనితీరుతో ఉన్నతాధికారులు,సహచర సిబ్బంది,ప్రజల మన్ననలు పొందారు.కన్నయ్య ఆకస్మిక మృతి జిల్లా పోలీసు శాఖకు తీరని లోటని ఎస్పీ టి.శ్రీనివాసరావు పేర్కొన్నారు.సుదీర్ఘకాలం పోలీసు శాఖకు అంకితభావంతో సేవలందించిన మంచి అధికారి,మంచి మనిషిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు.ఎస్పీ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ కె.శంకర్,జిల్లా పోలీసు అధికారులు, సహచర ఉద్యోగులు కన్నయ్య పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం దహన సంస్కారాల నిమిత్తం రూ.30 వేల ఆర్థిక సహాయాన్ని ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా కన్నయ్యతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని ఆయన సేవలను స్మరించుకున్నారు.కన్నయ్య కుటుంబ సభ్యులకు జిల్లా ఎస్పీ ప్రగాఢ సానుభూతి తెలిపారు.విషాద సమయంలో జిల్లా పోలీసు శాఖ బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటుందని, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.

## పన్నుల వసూళ్లలో జాప్యం.. మఖ్తల్ మున్సిపల్ కమిషనర్ పై కలెక్టర్ ఆగ్రహం

–మఖ్తల్ లో అభివృద్ధి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, ఆగస్టు 28 (ప్రజా జ్యోతి): మఖ్తల్ నియోజకవర్గ కేంద్రంలో కొనసాగుతున్న పలు అభివృద్ధి నిర్మాణ పనులను శుక్రవారం జిల్లా కలెక్టర్ ప్రియాంక పరిశీలించారు. ముందుగా మక్తల్ మండలం గొల్ల పల్లి సమీపంలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో రూ.250 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు నిర్మాణ పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే గొల్ల పల్లి శివారులోనే ఆర్టిఫిసియల్ విభాగానికి 9 ఎకరాలు, సెట్విన్ కు 10 ఎకరాల 30 గుంటలు, ఏ టీ సీ కి 1.5 ఎకరాలు, సెట్విన్ ట్రైనింగ్ సెంటర్ కు 20 గుంటల స్థలాన్ని కేటాయించినట్లు అధికారులు వివరించారు.



అలాగే మక్తల్ లో కొనసాగుతున్న ఫైర్ స్టేషన్ నిర్మాణ పనులను కూడా కలెక్టర్ పరిశీలించి, పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మఖ్తల్ మున్సిపాలిటీ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ పట్టణంలో ఇంటి పన్ను, నీటి పన్ను, ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూళ్ల వివరాలను పరిశీలించారు. పన్నుల వసూళ్లలో జాప్యం జరుగుతుండటంపై మున్సిపల్ కమిషనర్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. ,ఆస్తి పన్ను బకాయిల వసూళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. పట్టణంలో పలుచోట్ల చెత్త పేరుకుపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసి, వెంటనే చెత్తను తొలగించి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని సూచించారు. చెత్త సేకరణ వాహనాలు నిర్దేశిత ప్రాంతాల్లో సక్రమంగా తిరుగుతున్నాయా లేదా అనే విషయాన్ని జీపీఎస్ ద్వారా పర్యవేక్షించాలని ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో సిబ్బంది హాజరు కోసం బయోమెట్రిక్ విధానాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. మున్సిపాలిటీలో ఉన్న వార్డు అధికారులు, మొత్తం వార్డుల సంఖ్య తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం మక్తల్ సమీపంలోని 916/2, 917/2 సర్వే నంబర్లలోని సుమారు 10 ఎకరాల ప్రభుత్వ స్థలంలో రూ.35 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 150 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.

ఆస్పత్రి నిర్మాణానికి సంబంధించిన A, B, C, D బ్లాక్ పనులు పూర్తి అయ్యాయని అధికారులు తెలపగా, మిగతా పనులను మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేసి, ఆస్పత్రిని ప్రారంభానికి సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతతో పాటు నిర్దేశిత గడువును తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సతీష్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస, మున్సిపల్ కమిషనర్ రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబలకు అండగా నిలుస్తున్న ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి

**ఉకల్ గ్రామంలో సోమారపు వెంకటయ్య, ఉప్పలమ్మల కుటుంబాలను పరామర్శ ఆర్థిక సహాయం**

**రాయపర్తి ఆగస్టు 28 ప్రజా జ్యోతి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం ఊకల్ గ్రామంలో సోమరాపు వెంకటేయ్య మరియు సోమరాపు ఉప్పలమ్మా ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలిసి వారిని ఇంటివద్ద రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు దేశాల మేరకు పరామర్శించి, ఒక్కోరికి ఫౌండేషన్ తరపున ఆర్థిక సహాయం చేసినఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులుపరుపతి శ్రీనివాస్ రెడ్డి.ఈ సహాయంను వారికీ అందించిన రాయపర్తి మండల నాయకులు లేతకుల రంగారెడ్డి సంకినేని ఎల్లస్వామి స్థానిక నాయకులు అయిన వెన్నప్ప క్రిష్ణమూర్తి అయ్యగారు, మాజీ సర్పచ్, బానోత్ హనుమా, నరమూరెడ్డి ఉపేందర్ రెడ్డి, పాము మనోహర్, దళిత రత్న పోలేపక బిక్షపతి, బుర్ర రామ్మూర్తి, పెద్దొజు నరేష్ చారి పాము క్రిష్ణ, దికొండ దేవేందర్, కందుకూరి రమేష్, తిరియారపు శివ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**కలెక్టర్ చాహత్ బాజ్ పాయికి రాఖీ కట్టిన బాలసదన్ బాలికలు**



**హనుమకొండ జిల్లా ప్రతినిధి ఆగస్టు 28 ప్రజా జ్యోతి :** హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సుబేదారిలోని బాలసదన్‌కు చెందిన బాలికలు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయికి రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధానికి రక్షాబంధన్ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. బాలసదన్ బాలికలకు అండగా, రక్షణగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం కలెక్టర్ కూడా బాలికలకు రాఖీలు కట్టి వారికి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌తో కలిసి రక్షాబంధన్ వేడుకలు జరుపుకోవడం పట్ల బాలసదన్ బాలికలు ఆనందం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, బాలసదన్ సూపరింటెండెంట్ కళ్యాణి, బాలసదన్ బాలికలు, సిబ్బంది పాల్గొన్నారు.


## బాలికల విద్యే దేశ సాధికారతకు పునాది

**- బాలికలను చదివిద్దాం -దేశాన్ని సాధికారత వైపు నడిపిద్దాం అనే సందేశంతో రాఖీలు కట్టిన బాలసదనం బాలికలు**

**- బాలికలను ఆశీర్వదించి మిఠాయిలు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**








**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి) :** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలసదనం బాలికలు శుక్రవారం ములుగు నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావును కలిసి రాఖీలు కట్టారు. బాలికను చదివిద్దాం - దేశాన్ని సాధికారత వైపు నడిపిద్దాం అనే సందేశంతో ప్రత్యేకంగా రూపొందించిన రాఖీలను కలెక్టర్‌కు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలికలను ఆప్యాయంగా పలకరించి ఆశీర్వదించడం తోపాటు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాలికలతో మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని జీవితంలో మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. బాలికల సంరక్షణ,విద్య, ఆరోగ్యం, భద్రత, నైపుణ్యాభి వృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వారికి మెరుగైన సేవలు అందించాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. బాలికల అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలను ఎల్లప్పుడూ అందిస్తుందని జిల్లా యంత్రాంగం భరోసా కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి ఇపి ప్రేమలత మాట్లాడుతూ రక్షాబంధన్ ప్రేమానుబంధంతోపాటు పరస్పర బాధ్యత, రక్షణకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ఒక బాలికను చదివించడం ద్వారా ఆమె భవిష్యత్తుతోపాటు కుటుంబం, సమాజం, దేశ పురోగతికి బాటలు వేయవచ్చని పేర్కొన్నారు. బాలికలకు సురక్షితమైన వాతావరణం, సమాన అవకాశాలు కల్పించి వారి ప్రతిభను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలల సహాయవాణి జిల్లా సమన్వయకర్త నరేష్, బాలసదనం సిబ్బంది అరుణ, రాణి, సఖి కేంద్రం సిబ్బంది లావణ్య, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నూతన సమీకృత కలెక్టరేట్‌కు డిపిఆర్ఓ కార్యాలయం తరలింపు

**- నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండే డిపిఆర్ఓ కార్యకలాపాలు**

**- గ్రౌండ్ ఫ్లోర్‌లోని జి - 20 గదిలో డిపిఆర్ఓ కార్యాలయం ఏర్పాటు**

**- జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి రఫీక్**



**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి) :** ములుగు పాత కలెక్టరేట్‌లో కొనసాగుతున్న జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయాన్ని నూతనంగా ప్రారంభించిన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోకి తరలించినట్లు జిల్లా పౌర సంబంధాల అధికారి ఎండి. రఫీక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న జీ - 20 గదిని జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయానికి జిల్లా కలెక్టర్ కేటాయించినట్లు పేర్కొన్నారు. ఇకపై జిల్లా పౌర సంబంధాల శాఖకు సంబంధించిన అన్ని కార్యాలయ కార్యకలాపాలు నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(ఐడీఓసీ) నుండే కొనసాగుతాయని తెలిపారు. జిల్లా పౌర సంబంధాల శాఖకు సంబంధించిన అధికారిక సమాచార వ్యవహారాలు, మీడియా సమన్వయం, ఇతర కార్యాలయ కార్య కలాపాలు ఇకపై నూతన ఐడీఓసీ నుండే నిర్వహించ నున్నట్లు డీపీఆర్ఓ ఆ ప్రకటనలో వెల్లడించారు.

## బస్టాండ్ కోసం ఎదురుచూపులు..

# ఇంకెన్నాళ్లు..?

**పండుగ వేళ రోడ్డుపైనే ప్రయాణికుల పడిగాపులు**





**కాటారం, ఆగస్టు 28, ప్రజా జ్యోతి :** రాఖీ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం వివిధ గ్రామాలకు వెళ్లేందుకు మహిళలు, ప్రయాణికులు బస్సుల కోసం గంటల తరబడి పడిగాపులు కాయల్సి వచ్చింది. సోదరులకు రాఖీలు కట్టేందుకు సొంతూళ్లకు వెళ్లే మహిళలు పెద్ద సంఖ్యలో ఆయా ప్రాంతాల నుండి కాటారం మండల కేంద్రానికి చేరుకోవడంతో రహదారిపై ప్రయాణికుల రద్దీ నెలకొంది.

కాటారంలో సంవత్సరాల తరబడి బస్టాండ్ సౌకర్యం లేకపోవడంతో ఎండైనా, వానైనా రోడ్డుపైనే నిలబడి బస్సుల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. పండుగ రోజుల్లో ప్రయాణికుల రద్దీ మరింత పెరగడంతో ఇబ్బందులు అధికమవుతున్నాయని తెలిపారు. బస్సుల కోసం రహదారి పక్కన వేచి ఉండటంతో వృద్ధులు, మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కాటారం సబ్ డివిజన్ కేంద్రంగా ఉన్నప్పటికీ ఇప్పటివరకు బస్టాండ్ ఏర్పాటు చేయకపోవడం చాలా బాధాకరమని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతకాలంగా సమస్య కొనసాగుతున్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాటారం మండల కేంద్రంలో బస్టాండ్ ఏర్పాటు చేసి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

## స్కానింగ్ సెంటర్లపై కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆకస్మిక తనిఖీలు..



**మెప్సన్, న్యూ విజన్ డయాగ్నస్టిక్ సెంటర్లకు నోటీసులు జారీ చేయాలని ఆదేశం..**



**హనుమకొండ జిల్లా ప్రతినిధి ఆగస్టు 28 (ప్రజాజ్యోతి) :** హనుమకొండ నగరంలోని స్కానింగ్, డయాగ్నస్టిక్ సెంటర్లను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాకాజీ కాలనీలోని మెప్సన్ డయాగ్నస్టిక్ సెంటర్, న్యూ విజన్ డయాగ్నస్టిక్ సెంటర్లను ఆమె తనిఖీ చేసి నిబంధనల అమలును పరిశీలించారు. ముందుగా మెప్సన్ డయాగ్నస్టిక్ సెంటర్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ అక్కడి అల్ట్రాసౌండ్, సీటీ స్కాన్, ఎంఆర్ఐ గదులను పరిశీలించారు. వివిధ రకాల స్కానింగ్ పరీక్షలకు సంబంధించిన వివరాలను కేంద్రం ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. స్కానింగ్ పరీక్షల ధరలను తెలిపే పట్టిక కింద స్థాయిలో ఉండటాన్ని గమనించిన కలెక్టర్, స్కానింగ్ కోసం వచ్చే ప్రజలకు ధరలు స్పష్టంగా కనిపించేలా నిబంధనల మేరకు ప్రదర్శించాలని ఆదేశించారు. అనంతరం న్యూ విజన్ డయాగ్నస్టిక్ సెంటర్‌ను తనిఖీ చేసేందుకు వెళ్లగా సెంటర్‌కు తాళం వేసి ఉండటంతో అక్కడి అండర్‌గ్రౌండ్ (సెల్లార్) ప్రాంతాన్ని పరిశీలించారు.

**పార్కింగ్ స్థలాల వినియోగంపై చర్యలు.. :** ప్రభుత్వ నిబంధనల ప్రకారం బిల్డింగ్ ప్లాన్‌లో పార్కింగ్ కోసం కేటాయించిన స్థలాలను డయాగ్నస్టిక్ సేవలకు వినియోగిస్తున్నట్లు గుర్తించిన కలెక్టర్, మెప్సన్, న్యూ విజన్ డయాగ్నస్టిక్ సెంటర్లకు నోటీసులు జారీ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ.అప్పయ్యను ఆదేశించారు. పార్కింగ్ కోసం అనుమతించిన ప్రదేశాలను ఇతర అవసరాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. స్కానింగ్ పరీక్షల ధరల పట్టికతో పాటు సేవలందిస్తున్న వైద్యుల వివరాలను ప్రజలకు స్పష్టంగా కనిపించే విధంగా ప్రదర్శించాలని ఆదేశించారు. ప్రతి క్లినిక్, ఆసుపత్రి, డయాగ్నస్టిక్ సెంటర్ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం, పీసీపీఎన్‌డీటీ చట్టం నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అలాగే బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలను కూడా అమలు చేయాలని తెలిపారు.

**పలు ఆసుపత్రుల్లో తనిఖీలు :** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య అనంతరం కాకతీయ కిడ్నీ సెంటర్, సిద్ధార్థ కార్డియాక్ సెంటర్, వినోద డెంటల్, మల్లిక చిల్డ్రన్స్ హాస్పిటల్‌లను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ ప్రదేశాలను మెడికల్ షాపులు, ఇతర అవసరాలకు వినియోగిస్తున్నట్లు గుర్తించిన ఆసుపత్రులకు నోటీసులు జారీ చేయనున్నట్లు డీఎంహెచ్ఓ తెలిపారు. ఈ తనిఖీల్లో వైద్య సిబ్బంది సందీప్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డలకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపిన ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి

**రాయపర్తి ఆగస్టు 28 ప్రజా జ్యోతి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం బాలు నాయక్ తండా'గ్రామం గొప్య తండాలో శుక్రవారం రాఖీ పండుగ సందర్భంగా తండా పర్యటన లో తనకు మహిళలు రాఖీ కట్టగా తండా ప్రజలకు 'రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపిన. ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపతి శ్రీనివాస్ రెడ్డి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు చిన్నపాక రాంబాబు, గుగులోత్ రమేష్, మండల పార్టీ నాయకులు పోతుల కొమురుమల్లు, సంకినేని ఎల్లస్వామి, కోలా సంపత్, భూక్య వెంకన్న, భూక్య బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నాయినికి రాఖీ కట్టిన ఎంపీ కావ్య..



**హనుమకొండ జిల్లా ప్రతినిధి ఆగస్టు 28 (ప్రజాజ్యోతి) :** రాఖీ పౌర్ణమి సందర్భంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య రాఖీ కట్టారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను పురస్కరించుకుని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి ఎంపీ కావ్య రాఖీ కట్టి, ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఇరువురు పరస్పరం రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అన్నా చెల్లెళ్ల ఆత్మీయతకు ఈ సందర్భంగా సంబంధించిన ఫొటోలు ఆకట్టుకున్నాయి.

## గుంతలమయంగా ప్రధాన రహదారి..

**- ఇబ్బందుల్లో ప్రయాణికులు, వాహనదారులు**



**కాటారం, ఆగస్టు 28, ప్రజా జ్యోతి :** కాటారం--మంథని ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని ధన్వాడ సమీపంలో కల్వర్టుపై భారీగా గుంతలు ఏర్పడి ప్రమాదాలకు గురవుతున్నారు. కాటారం మండల కేంద్రం నుంచి గంగారం క్రాస్ వరకు ఎక్కడ చూసినా గుంతలు దర్శనమిస్తున్నాయి.

ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు నిలవడంతో వాటి లోతు తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డుపై కంకర తేలిపోవడంతో ద్విచక్ర వాహనదారులు జారిపడి గాయాలపాలవుతున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతలను తప్పించుకునే క్రమంలో ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొనే ప్రమాదం కూడా ఉందని వాహనదారులు చెబుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే కాటారం--మంథని ప్రధాన రహదారిపై గుంతల కారణంగా ప్రయాణం ఇబ్బందికరంగా మారిందని వారు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గుంతలను పూడ్చడంతోపాటు రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

## హైవే విస్తరణతో

# మూసుకుపోయిన దారులు..

**- రోడ్డెక్కిన కోతులనడుమ గ్రామస్తులు..**
**- అభివృద్ధి పనులతో అవస్థలు..**
**- కోతులనడుమ గ్రామానికి రహదారి కరువు..**
**- దారి కోసం ధర్నా.. రాస్తారోకో..**

**హనుమకొండ/ఎల్కతుర్తి, ఆగస్టు 28 (ప్రజాజ్యోతి) :** జాతీయ రహదారి-563 విస్తరణ పనులు అభివృద్ధికి బాటలు వేయాల్సింది పోయి ఎల్కతుర్తి మండలం కోతులనడుమ గ్రామ ప్రజలకు కష్టాల కడలిని మిగిల్చాయి. హనుమకొండ-హుజురాబాద్ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా గ్రామానికి ఉన్న అనుసంధాన మార్గాలు మూసుకుపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామానికి సరైన రాకపోకల మార్గం ఏర్పాటు చేయకపోవడంతో దారి కోసం గ్రామస్తులు ధర్నా, రాస్తారోకోకు సిద్ధమయ్యారు.

హనుమకొండ వైపు నుంచి గ్రామంలోకి రావాలన్నా, హుజురాబాద్ వైపు నుంచి చేరుకోవాలన్నా సరైన మార్గం లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. జాతీయ రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నప్పటికీ గ్రామానికి ప్రత్యామ్నాయ అనుసంధాన



రహదారి ఏర్పాటు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**రైతులకు పొలం దారి కూడా కరువే..!? :** కోతులనడుమ గ్రామానికి చెందిన రైతులు తమ వ్యవసాయ భూములకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పొలాలకు వెళ్లే మార్గాలు సక్రమంగా లేకపోవడంతో వ్యవసాయ పనులకు ఆటంకం ఏర్పడుతోంది. విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలను పొలాలకు తరలించడం కష్టంగా మారింది. పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించే సమయంలో రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారే అవకాశం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**గొల్లకురుమల జీవనోపాధికి అడ్డంకులు :** గ్రామంలోని గొల్లకురుమలు గొర్రెలను మేపేందుకు బయటకు తీసుకెళ్లాలన్నా దారి సమస్యగా మారింది. రైతులు పశువులను వ్యవసాయ భూములకు తీసుకెళ్లేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు జాతీయ రహదారి నిర్మాణ పనులు.. మరోవైపు మూసుకుపోయిన గ్రామీణ మార్గాలు.. మధ్యలో ప్రజల జీవనోపాధి అన్నట్లుగా పరిస్థితి తయారైంది.

**విద్య, వైద్యం కోసం హుజురాబాద్ వెళ్లాలంటే.. :** గ్రామ ప్రజలు విద్య, వైద్యం, నిత్యావసర వస్తువులు, ఎరువులు తదితర అవసరాల కోసం హుజురాబాద్ వెళ్లాల్సి ఉంటుంది. అయితే గ్రామం నుంచి ప్రధాన రహదారికి సరైన అనుసంధానం లేకపోవడంతో చిన్నపాటి అవసరానికీ చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. వృద్ధులు, మహిళలు, చిన్నారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**108 రావాలన్నా.. డయల్-100 చేరాలన్నా ఇదే సమస్య :** రహదారి సమస్య కేవలం ప్రయాణానికి సంబంధించినది కాదని, ప్రజల ప్రాణ భద్రతకు సంబంధించిన అంశమని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఎవరైనా అనారోగ్యానికి గురైతే 108 అంబులెన్స్ రావాలి. అత్యవసర పరిస్థితుల్లో డయల్-100 పోలీసులు చేరుకోవాలి. కానీ గ్రామానికి సరైన అనుసంధాన రహదారి లేకపోవడంతో అత్యవసర సేవలు సకాలంలో అందుతాయా అన్న ఆందోళన నెలకొంది.

"ఒక ప్రాణాన్ని కాపాడటంలో ఒక్క నిమిషం కూడా కీలకం. అలాంటిది గ్రామానికి చేరుకునే దారే లేకపోతే మా భద్రత ఎవరిది?" అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

**అభివృద్ధి ఎవరికోసం..? సర్పంచ్ మాట్ల లింగయ్య ఆవేదన :** జాతీయ రహదారి విస్తరణ అవసరమేనని, రహదారులు వెడల్పు కావాలని, మౌలిక వసతులు మెరుగుపడాలని గ్రామ సర్పంచ్ మాట్ల లింగయ్య అన్నారు. అయితే అభివృద్ధి పనుల పేరుతో ఒక గ్రామాన్ని రహదారి సౌకర్యానికి దూరం చేయడం మాత్రం అభివృద్ధి నిర్వచనం కాదన్నారు.

ప్రాజెక్టు రూపకల్పనలోనే గ్రామాలకు అనుసంధాన రహదారులను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ప్రధాన రహదారి నిర్మాణంతో పాటు సర్వీస్ రోడ్డు, అవసరమైన చోట అండర్‌పాస్‌లు, ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను డిమాండ్ చేశారు.

**తక్షణమే అధికారులు స్పందించాలి :** కోతులనడుమ గ్రామ ప్రజలు అడుగుతున్న ప్రశ్న ఒక్కటే.. "మా గ్రామానికి దారేది?" ఇది కేవలం ఒక గ్రామ సమస్య కాదని, అభివృద్ధి ప్రణాళికలు ప్రజల జీవనానికి అనుగుణంగా ఉండాలనే ప్రశ్న అని



గ్రామస్తులు పేర్కొన్నారు. జాతీయ రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలోనే సంబంధిత అధికారులు గ్రామ పరిస్థితిని పరిశీలించి తక్షణమే శాశ్వత అనుసంధాన రహదారిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాకపోకలు, వ్యవసాయం, పశుపోషణ, విద్య, వైద్యం, అత్యవసర సేవలకు ఎలాంటి ఆటంకం లేకుండా ప్రత్యామ్నాయ మార్గాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. లేనిపక్షంలో హైవే పక్కనే "దారిలేని గ్రామం"గా కోతులనడుమ చరిత్రలో మిగిలిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాట్ల లింగయ్య, ఉప సర్పంచ్ దుండ్ర శ్రీనివాస్, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్, ఎల్ఐసీ రవీందర్, ఐటీసీ రవి, శ్రీపతి భాస్కర్, పల్లె వేణు రవి, శ్రీపతి తిరుపతి గౌడ్, శ్యాంసుందర్ రావు, బోయినపల్లి దేవేందర్ రావు, బోయినపల్లి తిరుపతిరావు, శ్రీపతి సంపత్, పొశాల కిరణ్, శ్రీపతి కిరణ్, తడుగుల రాజకుమార్, మాట్ల సురేష్, చిర్ర సారయ్య, లచ్చన్న, ఎదురు గట్ల రాజేష్‌తో పాటు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఏనామాలిస్ ఓటర్ల జాబితాను పరిశీలించిన తహసీల్దార్

నాంపల్లి, ఆగస్టు, 28(ప్రజాజ్యోతి ): మండల కేంద్రంలో ఏనామాలిస్ ఓటర్లకి నోటీసులు జరిచేయగా, శుక్రవారం గ్రామ సభలో నిర్వహించిన ఏనామాలిస్ (అనుమానాస్పద/అసాధారణ) ఓటర్ల జాబితాను మండల తహసీల్దార్ అంబటి



ఆంజనేయులు పరిశీలించారు. గ్రామంలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా గుర్తించిన అనుమానాస్పద ఓటర్ల వివరాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఓటర్ల పేర్లు, చిరునామాలు, ఇతర వివరాలను సంబంధిత రికార్డులతో సరిపోల్చి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఉండేలా, అనర్హులు లేదా పునరావృతంగా నమోదైన పేర్లను గుర్తించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామసభలో 323 బి ఎల్ ఓ ఇందిరమ్మ మరియు ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలు, సూచనలను కూడా పరిశీలించి నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా పరిశీలనలో గ్రామస్థులు, బీఎల్ఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. జాబితాలో తమ పేర్లు, వివరాలను ప్రజలు పరిశీలించుకుని ఏవైనా తప్పులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## ఘనంగా రాఖీ పండుగ వేడుకలు

### మేరీ మదర్ ఆఫ్ హోప్ పాఠశాలలో సందడిగా రాఖీ వేడుకలు

నాగారం ఆగస్టు 28 ప్రజా జ్యోతి: ఫణిగిరిలోని మేరీ మదర్ ఆఫ్ హోప్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో రాఖీ పండుగ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టి, సోదర–సోదరీమణుల మధ్య ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ విశిష్టతను వివరించారు. రాఖీ వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, పరస్పరం ప్రేమ, ఆప్యాయతలను పంచుకున్నారు. పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ రోజ్‌మేరీ మాట్లాడుతూ.. రాఖీ పండుగ సోదర–సోదరీమణుల మధ్య ఉన్న ప్రేమ, అనుబంధం, రక్షణ, బాధ్యతలను గుర్తుచేస్తుందని తెలిపారు. విద్యార్థుల్లో సోదరభావం, మానవతా విలువలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు.



## అన్న చెల్లెల ఆత్మీయ బంధానికి ప్రతీక రాఖీ పూర్ణమి

భువనగిరి ఆగస్ట్ 28(ప్రజాజ్యోతి): భువనగిరి పట్టణంలోని సీనియర్ కాంగ్రెస్ నాయకులు హీరకర్ శ్రీను నివాసంలో ఘనంగా రాఖీ పండుగ జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు అన్న లకు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా హిరేకర్ శ్రీను మాట్లాడుతూ సోదరి కంట్లో ఒక కన్నీటి చుక్క



రాకూడదని తపించే ప్రతి సోదరుడు ఉదయం ఆ రాగి ముందు మరింత బలంగా మారుతుంది. అక్క అంటే రెండో అమ్మ తమ్ముడు తప్పు చేసిన కాపాడేది అక్క, బాధలో ఉంటే తల్లిలా ఓదార్చేది అక్క.... రాఖీ అన్నది కేవలం ఒక దారం కాదు అది జన్మజన్మల అనుబంధానికి జీవితాంతం తోడు ఉంటేనే నమ్మకానికి గుర్తింపు అన్నారు.

## పోలీసుల తనిఖీల్లో అక్రమ పశు రవాణా గుట్టురట్టు

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 28 (ప్రజాజ్యోతి): అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని పోచంపల్లి పోలీసులు అడ్డుకుని 13 పశువులను సురక్షితంగా స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం భూదాన్ పోచంపల్లి మండలంలోని పిలాయిపల్లి గ్రామ శివార్లలో ఎస్ఐ జె. జగన్ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా AP39WP8138



నంబర్ గల అశోక్ లేలాండ్ వాహనాన్ని తనిఖీ చేయగా, ఎలాంటి అనుమతులు లేకుండా 10 మగ దూడలు, 3 ఆడ దూడలు కలిపి మొత్తం 13 పశువులను క్రూరమైన పరిస్థితుల్లో తరలిస్తున్నట్లు గుర్తించారు. పశువులను తాళ్లతో కట్టివేసి, తగిన ఆహారం, నీరు అందించకుండా రవాణా చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో వాహన డ్రైవర్ పిసర్ల జోసెఫ్ (30), అంగులూరి అశోక్ (26)లను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో పశువులను అనకాపల్లి జిల్లా తుని సంతలో కొనుగోలు చేసి హైదరాబాద్ బహదూర్‌పురాకు తరలిస్తున్నట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న 13 పశువులను రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మండలం జాఫర్‌గూడలోని శ్రీ ప్రత్యంగిర గోశాలకు తరలించారు. జంతువులపై క్రూరత్వం, అక్రమ రవాణాను సహించబోమని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# అన్నా చెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా రక్షా బంధన్

నాంపల్లి, ఆగస్టు, 28(ప్రజా జ్యోతి ): అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా







నిలిచే రాఖీ పండుగను శుక్రవారం నాంపల్లి లో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు.ఈ పండుగ సందర్భంగా చెల్లెళ్లు తమ అన్నదమ్ముల చేతికి రాఖీలు కట్టి, వారి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలను ఆకాంక్షించారు. అన్నలు కూడా తమ చెల్లెళ్లకు అండగా ఉంటామని హామీ ఇస్తూ ప్రేమాభిమానాలను చాటుకున్నారు.రాఖీ పండుగను పురస్కరించుకుని గ్రామాలు, పట్టణాల్లో సందడి నెలకొంది. వివిధ రకాల రంగురంగుల రాఖీలు, అలంకరణ వస్తువులు మార్కెట్లలో అందుబాటులో ఉండటంతో కొనుగోలుదారులతో మార్కెట్లు కిటకిటలాడాయి. చిన్నారుల నుంచి పెద్దల వరకు తమకు నచ్చిన రాఖీలను కొనుగోలు చేసి పండుగను ఆనందంగా జరుపుకున్నారు.పండుగ రోజున చెల్లెళ్లు అన్నలకు తిలకం దిద్ది, హారతి ఇచ్చి రాఖీ కట్టారు. అనంతరం మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అన్నలు సైతం చెల్లెళ్లకు బహుమతులు అందించి తమ ప్రేమను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులంతా ఒకచోట చేరడంతో ఇళ్లలో పండుగ వాతావరణం నెలకొంది.రాఖీ కేవలం ఒక దారం మాత్రమే కాదని, అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న ప్రేమ, నమ్మకం,ఆప్యాయతలకు ప్రతీకగా నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు. చిన్ననాటి నుంచి కలిసి పెరిగిన అన్నాచెల్లెళ్లు తమ మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. వివాహం, ఉద్యోగం, చదువు తదితర కారణాలతో దూరంగా ఉన్న వారు కూడా రాఖీ పండుగ సందర్భంగా స్వస్థలాలకు చేరుకుని కుటుంబ సభ్యులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు.అన్నకు రాఖీ కడుతున్న చెల్లెలు, చెల్లెలి చేత రాఖీ కట్టించుకుంటున్న అన్న దృశ్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ప్రేమానురాగాలు, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే ఈ పండుగ కుటుంబ బంధాల విలువను మరోసారి గుర్తుచేస్తోంది. రాఖీ పండుగ సందర్భంగా అన్నాచెల్లెళ్ల మధ్య అనుబంధం మరింత బలపడాలని పలువురు ఆకాంక్షించారు.

## రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రజలకు ఎమ్మెల్యే బాలు నాయక్ శుభాకాంక్షలు

దేవరకొండ, ఆగస్టు 29, ( ప్రజా జ్యోతి ) : పవిత్రమైన రాఖీ పౌర్ణమి సందర్భంగా దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ హృదయపూర్వక శుభాకాంక్షలు



తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ.. రాఖీ పౌర్ణమి అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉన్న ఆత్మీయత, ప్రేమ, అనురాగం, ఆప్యాయత, పరస్పర నమ్మకానికి ప్రతీక గా జరుపుకునే పవిత్రమైన పండుగ అని అన్నారు. సోదరి తన సోదరుడి చేతికి రాఖీ కట్టి, అతని సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలను కోరుకోవడం, సోదరుడు తన సోదరికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇవ్వడం ఈ పండుగ ప్రత్యేకత అని తెలిపారు.రాఖీ అనేది కేవలం ఒక దారపు ముడి కాదని, సోదరసోదరీమణుల మధ్య జీవితాంతం కొనసాగే అనుబంధం, బాధ్యత, ప్రేమకు ప్రతీక అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. చిన్ననాటి జ్ఞాపకాల నుంచి జీవితంలోని ప్రతి అడుగులో అక్కాచెల్లెళ్లకు, అన్నదమ్ములకు ఒకరికొకరు తోడుగా నిలిచే బంధమే రాఖీ పండుగ స్ఫూర్తి అని అన్నారు.సోదరులు తమ అక్కాచెల్లెళ్లను గౌరవిస్తూ, వారికి అన్ని విధాలుగా అండగా నిలవాలని, సోదరీమణులు తమ సోదరుల అభివృద్ధి, ఆయురారోగ్యాల కోసం ఆకాంక్షించాలని కోరారు. కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేసే ఇలాంటి పండుగలు ప్రేమ, ఐక్యత, మానవీయ విలువలను పెంపొందిస్తాయని అన్నారు.రాఖీ పౌర్ణమి ప్రతి కుటుంబంలో ఆనందం, ఆత్మీయత, సంతోషాలను నింపాలని, అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధం ఎల్లప్పుడూ చిరస్థాయిగా ఉండాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఆకాంక్షించారు.

## అనారోగ్యంతో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ కార్యకర్తలను పరామర్శించిన దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్

దేవరకొండ, ఆగస్టు 29, ( ప్రజా జ్యోతి ) : దేవరకొండ నియోజకవర్గ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ ఈరోజు హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను పరామర్శించారు.దేవరకొండ మండలం చింతబావి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త నోముల రవీందర్ హైదరాబాద్ హస్తినాపురంలోని ఆరుష్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాలు నాయక్ వెంటనే ఆసుపత్రికి చేరుకుని రవీందర్‌ను, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం



చెప్పారు.అనంతరం అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డిండి మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ కార్యకర్తను కూడా ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడారు. కార్యకర్తలిద్దరికీ మెరుగైన వైద్యం అందించాలని, అవసరమైన అన్ని రకాల చికిత్సలు అందించి వారు త్వరగా కోలుకునేలా చూడాలని సూచించారు. వారు త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి తమ కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్యకు రావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.కష్టకాలంలో పార్టీ కార్యకర్తలకు తాము ఎల్లప్పుడూ అండగా నిలుస్తామని, వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని ఎమ్మెల్యే బాలు నాయక్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## అజొల్లాతో రైతుకు అదనపు లాభం

గరిడేపల్లి,ఆగస్టు 28 (ప్రజా జ్యోతి): రైతులకు తక్కువ ఖర్చుతో అధిక ప్రయోజనాలు అందించే అజొల్లా సాగుపై ఏలూరుకు చెందిన సెయింట్ థెరిస్సా



కాలేజ్ ఫర్ ఉమెన్ విద్యార్థినులు గడ్డి పల్లి గ్రామంలో అవగాహన కల్పించారు.రూరల్ వర్క్ ఎక్స్ పీరియన్స్ శిక్షణలో భాగంగా రైతు బి.నాగరాజు సాగు చేస్తు న్న చింట్లు రకం వరి పొలంలో అజొల్లాను ప్రవేశపెట్టారు.అజొ ల్లా సాగు విధానం,వరి పంటలో వినియోగం,నేల సారవంతత పెంపు,పంటకు అవసర మైన పోషకాలు అందించడం వంటి ప్రయోజనాలను విద్యార్థినులు రైతులకు వివరించారు.అజొల్లా ను తక్కువ ఖర్చుతో సేంద్రియ ఎరువుగా ఉపయోగించడంతో పాటు పశువులకు దాణాగా కూడా వినియోగించుకోవచ్చని తెలిపారు.రైతుల సహకారంతో వరి పొలంలో అజొల్లాను వేసి, క్షేత్రస్థాయిలో సాగు విధానాన్ని ఆచరణాత్మకంగా వివరించారు. రైతుల పొలాల్లో ప్రత్యక్షంగా పాల్గొని ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించ డం విద్యార్థులకు ఆచరణాత్మక జ్ఞానాన్ని అందించడంతో పాటు రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యార్థినులు దీప్తి,గౌతమి,సుమ జాన్,జాయ్సి,భావన, దేవి,ప్రియ పాల్గొన్నారు.రైతులు బి.నాగరా జు,కె.ఆపయ్య,జె. రాములు సహకరించారు.

## మంత్రుల సభను విజయవంతం చేయాలి

నూతనకల్.. ఆగస్టు 28 (ప్రజాజ్యోతి): నూతనకల్ ఉమ్మడి మండలంలో దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న భూముల భూ హక్కు పత్రాలను రైతులకు మంత్రుల చేతుల మీదుగా పంపిణీ చేసేందుకు మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన సభను విజయవంతం చేయాలని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మినీ స్టేడియంలోని ఏర్పాటుచేసిన సభాస్థలి, హెలిఫ్యాడ్ లను పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. నూతనకల్ మద్దిరాల మండలంలోని దాదాపు 2500 మంది రైతుల గాను సుమారు 3 వేల ఎకరాలకు సంబంధించిన సీలింగ్ యాక్ట్ రాకముందు దేశ్ ముఖ్ ల నుంచి కొనుగోలు చేసి దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న భూములకు 60 సంవత్సరాల రైతుల నిరీక్షణకు తెలపడిందని తెలిపారు. అట్టి భూములపై నాటి నుంచి ఎన్ని ఉద్యమాలు పోరాటాలు చేసిన చట్టబద్ధత కాలేదన్నారు. పెండింగ్ లో ఉన్న భూముల సమస్య పరిష్కారం కోసం అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ప్రత్యేక చొరవ చూపి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి బాధ్యతలు అప్పగించడంతో భూముల సమస్య పరిష్కారం అయ్యింది తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని పేద ప్రజలు రైతాంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందని అట్టి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని అన్నారు.

రైతులకు భూ హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర రెవిన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పౌరసరఫరాల శాఖ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ హాజరవుతున్నారని తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి రైతులు నాయకులు భారీగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్ అదనపు కలెక్టర్ రెవెన్యూ హరిసింగ్ తహసిల్దార్ శ్రీనివాసరావు జన్నారెడ్డి వివేక్ రెడ్డి నూతనకల్ మద్దిరాల మండల అధ్యక్షులు కట్ట మల్లారెడ్డి పచ్చిపాల వెంకన్న పిఎసిఎస్ చైర్మన్ నాగం జయసుధ సుధాకర్ రెడ్డి తుంగతుర్తి నాగారం అర్వపల్లి తిరుమలగిరి అడ్డగూడూరు మోత్కూరు శాలిగౌరారం మండల పార్టీ అధ్యక్షులు మాజీ మండల పార్టీ అధ్యక్షులు వివిధ గ్రామాల సర్పంచులు ప్రజా ప్రజా ప్రతినిధులు నాయకులు తదితరులున్నారు.



## ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేములకు రాఖీ కట్టిన మాజీ ఎంపీటీసీ మదూరి జ్యోతి

రామన్నపేట, ఆగస్టు 28 (ప్రజా జ్యోతి): రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు రామన్నపేట మండలం దుబ్బాక గ్రామానికి చెందిన దుబ్బాక,లక్ష్మాపురం, కొత్తగూడెం



మాజీ ఎంపీటీసీ మదూరి జ్యోతి రామచంద్ర రావు నకిరేకల్ లోని వారి స్వగృహంలో రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆమెకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## నిజాయితీ చాటుకున్న బస్ కండక్టర్ శ్రీనివాస్

### బస్సులో 6 లక్షల విలువైన సొత్తు మర్చిపోయిన బాధితులకు తిరిగి అందజేత

మిర్యాలగూడ, ఆగస్టు 28,( ప్రజాజ్యోతి ): బస్సులో లక్షల విలువైన బంగారం వస్తువులు, నగదు,సెల్ ఫోన్ల తో కూడిన పర్సు చేజార్చుకున్న బాధితురాలికి తిరిగి అందజేసి తన నిజాయితీ చాటుకున్నాడు కండక్టర్





వేముల శ్రీనివాస్. మిర్యాలగూడ ఆర్టీసీ డిపోలో కండక్టర్ గా విధులు నిర్వహిస్తున్న వేముల శ్రీనివాస్ మిర్యాలగూడ – కోదాడ బస్సులో డ్యూటీ చేస్తుండగా, కోదాడకు చెందిన ప్రయాణికురాలు తన పర్సు ను బస్సులో మర్చిపోయింది. గమనించిన శ్రీనివాస్ దానిని తెరిచి చూడగా నాలుగు తులాల బంగారం, రెండు సెల్ ఫోన్లు, 7 వేల నగదు ఉండటం గుర్తించాడు. వెంటనే కోదాడ డిపో కంట్రోలర్ వద్దకు వెళ్లి పర్సు ను అప్పగించి, అందులో ఉన్న వివరాల ఆధారంగా ప్రయాణికురాలికి సమాచారం అందించి అందరి సమక్షంలో తిరిగి పర్సును ఆమెకు అప్పగించారు. కండక్టర్ శ్రీనివాస్ నిజాయితీకి బాధితురాలితో సహా డిపో మేనేజర్, సిబ్బంది శ్రీనివాస్ ను అభినందించారు.




## అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ

హాలియా,ఆగస్టు28(ప్రజా జ్యోతి) రాఖీ పౌర్ణమి పవిత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని సోదరీ సోదరుల మధ్య అనురాగ బంధం మురిసిపోయింది.ఈ సందర్భంగా హాలియా క్లబ్ అధ్యక్షుడు పొట్టు ముత్తు వెంకటేష్‌కి ఆయన సోదరి ఎంతో ప్రేమతో,సాంప్రదాయబద్ధంగా రాఖీ కట్టి తమ జన్మజన్మల బంధాన్ని నెమరువేసుకున్నారు. సోదరుడి శ్రేయస్సును, ఆయురారోగ్యాలను ఆకాంక్షిస్తూ ఆమె మంగళ హారతులు పట్టి రాఖీ నిర్మలమైన బాధ్యతకు ప్రతీకగా నిలిచారు.అనంతరం వెంకటేష్ తన సోదరికి ఆశీస్సులు అందజేసి, బహుమతిని అందించి ఎల్లవేళలా రక్షణగా ఉంటానని అభయమిచ్చారు.ఈ వేడుక కుటుంబ సభ్యుల మధ్య అత్యంత ఆత్మీయ వాతావరణంలో,సంస్కృతీ సాంప్రదాయాల నడుమ ఘనంగా నిర్వహించారు.

## సెప్టెంబర్ 5న, అంగన్వాడి అభ్యర్థులకు ఇంటర్వ్యూలు

### సిడిపిఓ వేణుగోపాలరావు

మిర్యాలగూడ,ఆగష్టు 28, ( ప్రజాజ్యోతి ): మిర్యాలగూడ అర్బన్ ఐసిడిఎస్ ప్రాజెక్టులో అంగన్వాడి టీచర్లు, ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సెప్టెంబర్ 5న, ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ప్రాజెక్టు ఆఫీసర్ ఎం. వేణుగోపాల్ రావు తెలిపారు. శుక్రవారం విలేఖరులతోమాట్లాడుతూ మిర్యాలగూడ రెవిన్యూ డివిజన్ కార్యాలయంలో సెప్టెంబర్ 5 న,ఉదయం 11గంటల నుండి మిర్యాలగూడ మండలంలోని అంగన్వాడీ టీచర్ పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని, మునిసిపల్ ప్రాంత అభ్యర్థులు ఉదయం 9:00 గంటలకే హాజరు కావాలన్నారు. అదేవిధంగా ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారు మధ్యాహ్నం 2:00 గంటలకుఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.అర్హులైన దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూ కాల్ లెటర్ పంపిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఇంటర్వ్యూలకు వచ్చే అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. ఆయన వెంట సూపర్ వైజర్లు సిహెచ్.పద్మ, కె.నాగమణి, నజీమాబేగం మొహమ్మద్ ఉన్నారు.



## మార్కండేయ మందిరంలో ఘనంగా రాఖీపూర్ణిమ ఉత్సవాలు



**బాల్కొండ, (ప్రజా జ్యోతి) ఆగస్టు 28** నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండల కేంద్రంలో సుప్రసిద్ధ అతిప్రాచిన బ్రహ్మ సూత్రం గలా శివాలయం మార్కండేయ మందిరంలో పద్మశాలి కులం పెద్దలు పాలక వర్గం అధ్యక్షుడు అందే వెంకటగిరి,కుందరం శ్రీనివాస్,బుస రత్నకార్,మేక నాగేష్, తౌటి కోటేశ్వర్,భోగ భూమేష్ మరియు ఆలయకమిటీ నేతృత్వంలో నేడు రక్షబంధన్ పూర్ణిమను పురస్కరించుకొని ప్రత్యేక పూజలో భాగంగా ఉదయం నుండి బ్రహ్మసూత్ర శివ



లింగం స్వామి కి నామకచమకం అన్నపూజ అర్చన అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పద్మశాలిలా ఆరాధ్య దైవం మార్కండే భగవాన్ గాయత్రి మాతకు ప్రత్యేక పూజలు గణేష్ జోషి వేదపండితులు నిర్వహించారు. అన0తరం మార్కండేయ మందిర్ చుట్టు ప్రదక్షిణలు భజన మేల తాలలచే శివ నామస్మరణా చే జరిగింది.వేదపండితుల గాయత్రి మంత్రోచ్ఛరణ చే ముక్కుమ్మడి గా ఏకకాలంలో రక్షబంధన్ జంధ్యం ధారణ జరిగింది.అనంతరం భజన ఆధ్యాత్మిక పరులు సాయగౌడ్, రాజ్ కుమార్,కటకమ్ గంగాధర్,సుంకం శ్రీనివాస్ లకు శాలువల తో సన్మానించారు. మార్కండేయ మందిర పరిసరాలు శివనమ స్మరణచే మారుమోగింది.

## సోదరుడికి ఏ రాఖీ కడితే బాగుంటుంది..?

● ఆలోచనలో సోదరీమణులు ● మిఠాయి తయారీలో దుకాణాలు




**డోంగ్లి ఆగస్టు 28 (ప్రజాజ్యోతి)** రాఖీ పండుగ దగ్గర పడటంతో దుకాణాల్లో రద్దీ, సందడి మొదలైంది. తన సోదరుడికి ఏ రాఖీ కడితే బాగుంటుందోనని సోదరీమణులు ఏరికోరి రాఖీలు తీసుకుంటున్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండలాలు, గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో రాఖీ స్టాళ్లు కిటకిటలాడుతున్నాయి. రూ.10 నుంచి రూ.500 వరకు రకరకాల రాఖీలు అందుబాటులో ఉన్నాయి. రుద్రాక్ష రాఖీలు, స్టోన్ రాఖీలు, లైట్ రాఖీలు, ఫోటో రాఖీలు, డిజైనర్ రాఖీలను మహిళలు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. తమ సోదరునికి ప్రత్యేకంగా కనిపించే రాఖీ కట్టాలని సోదరీమణులు ఆసక్తి చూపుతున్నారు.సోదరుడి చేతికి రాఖీ కట్టి, తన రక్షణ బాధ్యతను గుర్తు చేయాలని అక్కాచెల్లెళ్లు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు మిఠాయి దుకాణాలు తీపి తయారీలో బిజీ అయ్యాయి. కాజూ కత్లీ, లడ్డూలు, బర్ఫీలకు డిమాండ్ పెరిగింది. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగ కోసం ప్రతి ఇంట్లో సన్నాహాలు జోరుగా సాగుతున్నాయి.

### బాన్సువాడ నియోజకవర్గం వివిధ గ్రామాలలో

## బీజేపీ నాయకులు కోనేరు శశాంక్ ఆధ్వర్యంలో రక్షాబంధన్

● వర్ని, కోటగిరి, చందూరు, రుద్రూర్, చందూర్ మండలాలలో బీజేపీ అధ్యక్షులు





**కోటగిరి, ఆగస్టు 28, ప్రజా జ్యోతి.** బాన్సువాడ నియోజకవర్గంలోని కోటగిరి మండల కేంద్రంలో బిజెపి నాయకుల నాయకురాలు ఆధ్వర్యంలో ఘనంగా రక్షాబంధన్ నిర్వహించారు. శుక్రవారం మహిళలు కోనేరు శశాంకు రాఖీ కట్టు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశీర్వదించారు. నియోజకవర్గంలో ఆయన చేసే పనులను అభివృద్ధి పనులను ఎవరు ఏది అడిగినా కాదనుకుంటా అందరికి అందుబాటులో ఉంటారని ఆయా గ్రామస్తులు నాయకులు అన్నారు. బాన్స్వాడ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో బిజెపి పార్టీని బలోపేతం చేసేందుకు అందరూ కృషి చేయడానికి సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు . రాఖీ కట్టిన ఆడపడుచులకు తన వంతు బహుమతులను కూడా అందజేశారు. వివిధ మండలంలో మండల అధ్యక్షులను ఎన్నుకొని, నాయకులను కూడా



ఎన్నుకోవడం జరిగిందన్నారు. వర్ని మండలంలో ని అంబం సర్పంచ్ కుర్లెపు గంగాధర్,ఉపసర్పంచ్ రేపల్లె సాయిప్రసాద్,జిల్లా కౌన్సిల్ మెంబర్ సున్నం సాయిలు,జిల్లా కిసాన్ మోర్చా సెక్రటరీ సాయిరెడ్డి, చందూర్ మాజీ ఎంపీటీసీ నర్సింహులు, బాన్సువాడ రూరల్ అధ్యక్షుడు శ్రీను, కోటగిరి మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు ఏములే నవీన్, రుద్రూర్ మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు హరికృష్ణ, సీనియర్ నాయకులు పుల్లెల మోహన్ రావు, మహిళా మోర్చా నాయకురాలు శ్యామల కులకర్ణి, మామిడి శ్రీనివాస్, మామిడి రవి, మామిడి సాయిలు, ఓమన్న పటేల్, ప్రకాష్ పటేల్, దావులయ్య, నాగెల్లి శ్రీనివాస్, వడ్ల శ్యామ్, పబ్బా శేఖర్, విలాస్, జగదీష్, శ్యామ్, శివశంకర్, సీతారాం నాయక్, తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ హియరింగ్ ప్రక్రియ పరిశీలన

● అదనపు కలెక్టర్ విక్టర్

**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 28 (ప్రజా జ్యోతి)** అర్హులైన ఓటర్ల వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలి.పిట్లం ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా పిట్లం మండలంలోని బొల్లక్‌పల్లి, మద్దెల చెరువు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ హియరింగ్ ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్, శుక్రవారం పరిశీలించారు.పిట్లం మండల తహసీల్దార్, పీడీసీ అధికారితో కలిసి ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన హియరింగ్ కేంద్రాలను అదనపు కలెక్టర్ సందర్శించి, హియరింగ్ ప్రక్రియ నిర్వహణ తీరును పరిశీలించారు. నోటీసులు అందుకున్న ఓటర్ల నుంచి సమర్పిస్తున్న ధ్రువపత్రాలు, ఆధారాలను పరిశీలించి, నిబంధనల ప్రకారం ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. హియరింగ్‌కు హాజరయ్యే ఓటర్లకు అవసరమైన సమాచారం, మార్గదర్శకాలను అందించి, వారి అభ్యంతరాలు, వివరణలను నిబంధనల మేరకు నమోదు చేయాలని సూచించారు. హియరింగ్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ డిప్యూటీ కలెక్టర్ రవితేజ,పిట్లం మండల తహసీల్దార్,పీడీసీ అధికారి,సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.





## విజేత హైస్కూల్‌లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 28:** నారాయణఖేడ్ పట్టణంలోని విజేత హైస్కూల్‌లో ప్రిన్సిపల్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఒకరికొకరు రాఖీలు కట్టుకుని రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగ ప్రేమ, ఆప్యాయత, నమ్మకం, బాధ్యతలకు ప్రతీక అని అన్నారు. విద్యార్థుల్లో సోదరభావం, పరస్పర గౌరవం, ఆత్మీయత పెంపొందించడమే ఇలాంటి కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పండుగల ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేయడంతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించేందుకు పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు చదువుతో పాటు విలువలను అలవర్చుకుని మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని రక్షాబంధన్ వేడుకలను ఆనందోత్సాహాలతో నిర్వహించారు.



### జహీరాబాద్ ఏరియా ఆస్పత్రిలో డ్యూటీ డాక్టర్ల

## గైర్హాజరు పై మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులపై ఆగ్రహం

● విచారణకు ఆదేశం ● బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలకు ఆదేశం

● హెల్త్ సెక్రటరీ, జిల్లా కలెక్టర్‌లతో మాట్లాడిన మంత్రి దామోదర్ రాజనర్సింహ



**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి :** రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ జహీరాబాద్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల కొరత, డ్యూటీ డాక్టర్ గైర్హాజరు, ప్రైవేట్ డాక్టర్ తో చికిత్స పై వివిధ పత్రికలలో వచ్చిన వార్త కథనాలపై సంగారెడ్డి జిల్లా కలెక్టర్, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డా క్రిస్టినా జెడ్ చొంగ్తు తో మాట్లాడారు. జహీరాబాద్ ఏరియా ఆస్పత్రి లో జరిగిన ఘటన పై విచారణ కు ఆదేశించారు. ఈ లాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జహీరాబాద్ ఏరియా ఆస్పత్రిలో డ్యూటీ డాక్టర్ స్థానంలో విధుల్లో ప్రైవేట్ డాక్టర్ ఉండటం, డాక్టర్ల గైర్హాజరు పై మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కొత్త పెన్షన్ల మంజూరుకు అర్హులైన వారు ఆగస్టు 31లోగా దరఖాస్తు చేసుకోవాలి

● అదనపు కలెక్టర్ పాండు

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ఆగస్టు 28:--**ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న చేయూత సామాజిక భద్రత పింఛన్ల పథకం--2026 కింద అర్హులైన వారికి కొత్తగా పెన్షన్లు మంజూరు చేయనున్నట్లు అదనపు కలెక్టర్ పాండు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్, బ్యానర్, కరపత్రాలను శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పాండు, జిల్లా పరిషత్ సీఈఓ జానకిరెడ్డి, డీఆర్‌డీఏ అదనపు పీడీ సూర్యారావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ.. జిల్లాలోని అర్హులైన వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, రక్త సంబంధిత దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులకు ప్రభుత్వం చేయూత సామాజిక భద్రత పింఛన్లను అందిస్తోందన్నారు. కొత్తగా పెన్షన్ పొందేందుకు అర్హత ఉన్న వారు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**వితంతువులు**

18 సంవత్సరాలు పైబడి,
భర్త మరణ ధృవీకరణ పత్రం కలిగి ఉండాలి.

**ఒంటరి మహిళలు:**

18 సంవత్సరాలు పైబడి
భర్తతో విడిపోయి/వదిలివేయబడి కనీసం ఒక సంవత్సరం



పూర్తయిన వారు అర్హులని,
గ్రామీణ ప్రాంతాల్లో 30 సంవత్సరాలు, పట్టణ ప్రాంతాల్లో 35 సంవత్సరాలు పైబడిన అవివాహితులు అర్హులని తెలిపారు.

**దివ్యాంగులు**

దివ్యాంగులకు వయస్సుతో సంబంధం లేకుండా అర్హత ఉంటుంది.
ఎస్ఏడిఏఆర్ ఈఎం/ యుడిఐడి ధృవీకరణ ద్వారా కనీసం 40 శాతం వైకల్యం ఉండాలి. (51 శాతం వినికిడి లోపం ఉన్నవారికి )

**రక్త సంబంధిత దివ్యాంగులు :**

తలసేమియా, సికిల్ సెల్ డిసీజ్, హీమోఫీలియా వ్యాధులతో బాధపడుతున్న వారు.
సదరం /యుడిఐడి ధృవీకరణ ఉండాలని తెలిపారు.

**కల్లుగీత కార్మికులు:**

50 సంవత్సరాలు పైబడి,
కల్లుగీత కార్మికుల సహకార సంఘ సభ్యత్వం ఉండాలని,
ఎక్సైజ్ శాఖ ధృవీకరణ అవసరమని స్పష్టం చేసారు.

**చేనేత కార్మికులు:**

50 సంవత్సరాలు పైబడిన వారు అర్హులని,
చేనేత, జౌళి శాఖ ధృవీకరణ ఉండాలని తెలిపారు.

**ఫైలేరియా బాధితులు:**

గ్రేడ్--××, గ్రేడ్--××× ఫైలేరియా వ్యాధిగ్రస్తులు.
అర్హులైన వారు సంబంధిత గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు/మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పట్టణ ప్రాంతాల్లో వార్డు అధికారులు/పురపాలక కమిషనర్లు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. అలాగే **https://cheyutha.telangana.gov.in** వెబ్‌సైట్‌లోని **Cheyutha Application Forms** బటన్ నొక్కి దరఖాస్తు ఫారాలను పొందవచ్చని తెలిపారు. అర్హులైన ప్రతి వితంతువు, ఒంటరి మహిళకు దరఖాస్తు చేసుకునే విధంగా మహిళా సమాఖ్యల సహకారంతో దరఖాస్తు ప్రక్రియ మరియు అవసరమైన ధృవపత్రాల విషయంలో సహాయం అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కొత్తగా పెన్షన్ పొందేందుకు అర్హులైన వారు ఈనెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ పాండు కోరారు. జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం ప్రయోజనం అందేలా విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

## ప్లాట్ల కోసం వాగుకే ఎసరు..!

– ప్లాట్ల కోసం నీటి ప్రవాహానికి చెక్..!

మునిదేవునిపల్లి రఘునాథ్ నియోసిటీ వెంచర్‌లో నాళాల కబ్జా..

వాగుపై రహదారి ఏర్పాటు.. వర్షపు నీరు ఎటు వెళ్లాలి?

భవిష్యత్‌లో ముంపు ముప్పు తప్పదా..

అధికారుల అనుమతులు ఉన్నాయా?

**కొండాపూర్ ప్రజా జ్యోతి** మునిదేవునిపల్లి గ్రామ పరిధిలోని రఘునాథ్ నియోసిటీ వెంచర్‌లో నాళాలు, సహజ నీటి ప్రవాహ మార్గాలపై ఆక్రమణలు జరుగుతున్నాయి.స్థానికంగా తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ప్లాట్ల నిర్మాణానికి వాగు అడ్డుగా ఉందనే కారణంతో సహజంగా నీరు ప్రవహించే మార్గాన్ని పూడ్చివేసి, ఆ వాగుపైనే రహదారి ఏర్పాటు చేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.సహజంగా వర్షపు నీరు వెళ్లాల్సిన వాగును మట్టితో పూడ్చివేయడం వల్ల నీటి ప్రవాహానికి అడ్డంకి ఏర్పడే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలు కురిసే సమయంలో నీరు వెళ్లేందుకు మార్గం లేకపోతే వెంచర్‌లోని ప్లాట్లు, సమీప వ్యవసాయ భూములు, ఇళ్లపై ముంపు ప్రభావం పడే ప్రమాదం ఉందని వారు చెబుతున్నారు.

**ప్లాట్ల కోసం సహజ వాగుకే మంగళం?**

వెంచర్ అభివృద్ధి పేరుతో సహజ నీటి ప్రవాహ మార్గాలను మార్చడం లేదా పూడ్చివేయడం జరిగితే సంబంధిత నిబంధనల ప్రకారం అనుమతులు ఉన్నాయా? వాగు, నాళాలపై రహదారి నిర్మాణానికి ఎవరు అనుమతించారు? అనే ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి.వెంచర్‌కు సంబంధించిన లేఅవుట్ అనుమతుల్లో వాగు, నాళాలు, డ్రైనేజీ మార్గాలకు సంబంధించిన వివరాలు ఏమున్నాయి? ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితికి అనుమతించిన లేఅవుట్‌కు సంబంధం ఉందా? అనే అంశాలపై అధికారులు సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

**అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి**

సహజ నీటి ప్రవాహ మార్గాన్ని పూడ్చివేసినట్లు వస్తున్న ఆరోపణలపై పంచాయతీ, రెవెన్యూ, ఇరిగేషన్/సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, వాగు అసలు మార్గం ఎక్కడ ఉంది? ప్రస్తుతం దానిపై ఏ నిర్మాణాలు జరిగాయి? వాటికి అనుమతులు ఉన్నాయా? అనే విషయాలను స్పష్టం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల భద్రత, భవిష్యత్ వర్షపు నీటి ప్రవాహం దృష్ట్యా సహజ నాళాలు, వాగులను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ప్లాట్ల అభివృద్ధి కోసం సహజ నీటి మార్గాలను మూసివేసే పరిస్థితి ఉంటే దానిపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ వ్యవహారంపై అధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడిస్తారా? లేక వాగు పూడ్చివేత ఆరోపణలు ఇలాగే మిగిలిపోతాయా? అనేది వేచి చూడాలి.





# ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

- అన్నా చెల్లెల అనురాగానికి ప్రతీక రక్షాబంధన్
- 18 వ వార్డ్ కౌన్సిలర్ శ్రీరాం సరస్వతి - నరేందర్

**దుబ్బాక ప్రతినిధి, ఆగస్టు 28( ప్రజా జ్యోతి)** అన్నా, చెల్లెళ్ల అనురాగానికి, అక్కా, తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ (రాఖీ పౌర్ణమి) శుక్రవారం రోజున రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని, ఘనంగా రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించడం








జరుగుతుందని 18వ వార్డ్ కౌన్సిలర్ శ్రీరాం సరస్వతి నరేందర్ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పౌర్ణమి అనేది సోదర, సోదరీమణుల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు. రక్షాబంధన్ ను ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందోత్సవాల మధ్య జరుపుకోవడం జరుగుతుందని, నువ్వు నాకు రక్ష నేను నీకు రక్ష మనమంతా దేశానికి ,ధర్మానికి రక్ష అంటు రక్షాబంధన్ నిర్వహించడం జరిగింది.కుల,మత ,బేదాలు లేకుండా అందరూ ఐక్యమత్యం లో జీవించాలన్నారు. దేశం కోసం, సమాజం హితం కోసం పనిచేస్తున్నవారినిగుర్తుచేశారు. అందరి లోదేశ స్వాభిమానం ఉండాలని అన్నారు.సమాజ రక్షణ మన భాద్యత అని అన్నారు. మహిళాల పట్ల మాతృ భావనతో మెలగాలని అన్నారు.

# బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థికసహాయం

- అన్నలా తోడుంటా
- డిసిసి వైస్ ప్రెసిడెంట్ చిలుకూరి మహేందర్ రెడ్డి



**జగదేవపూర్, ఆగస్టు 28 (ప్రజా జ్యోతి):** తల్లిదండ్రులు లేకున్నా అన్నలా తోడుగా ఉంటానని సిద్ధిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ చిలుకూరి మహేందర్ రెడ్డి అన్నారు. జగదేవపూర్ మండల పరిధిలోని దౌలపూర్ గ్రామానికి చెందిన కొలిప్యాక మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మహేందర్ రెడ్డి శుక్రవారం మల్లయ్య కుమార్తెలను పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి ధైర్యం చెప్పి, తల్లిదండ్రులు లేకున్నా అన్నలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుకునూరి కృష్ణ, వార్డు సభ్యులు అకారం నర్సింలు, పోకల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# మిరుదొడ్డిలో సామూహిక యజ్ఞోపవీత ధారణ

- పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో వైభవంగా కార్యక్రమం



**మిరుదొడ్డి, ఆగస్టు 28, (ప్రజాజ్యోతి):** మిరుదొడ్డి మండల కేంద్రంలోని శ్రీ మార్కండేయ స్వామి దేవాలయంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక యజ్ఞోపవీత ధారణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే పద్మశాలి సంఘ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలిరావడంతో దేవాలయ ప్రాంగణం సందడిగా మారింది. వేద పండితుల పర్యవేక్షణలో వేద మంత్రోచ్చారణల మధ్య నియమనిష్ఠలతో సామూహిక యజ్ఞోపవీత ధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం శ్రీ మార్కండేయ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం నాయకులు మాట్లాడుతూ సంఘ సభ్యుల ఆధ్యాత్మిక, సాంస్కృతిక ఐక్యతను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రేమ అనురాగాలకు ప్రతీక రాఖీ పండుగ

- భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు

**గజ్వేల్ ఆగస్టు 28 (ప్రజా జ్యోతి):** రాఖీ పండుగ సోదర, సోదరీల మధ్య ఉన్న పవిత్రమైన ప్రేమానుబంధానికి ప్రతీక అని భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు అన్నారు.రాఖీ అనేది మణికట్టుకు కట్టే దారం మాత్రమే కాదని, సోదరుడి సుఖసంతోషాలను కోరుతూ సోదరి కట్టే ప్రేమబంధం, ఆప్యాయతకు ప్రతిరూపమని తెలిపారు.సోదరి కట్టే రాఖీలో ప్రేమ, ఆత్మీయత ఉంటే సోదరుడి ఆశీస్సుల్లో భరోసా,అనురాగం ఉంటాయని అన్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేస్తూ,జీవితంలో ఎన్ని మార్పులు వచ్చినా సోదర, సోదరీల బంధం ఎప్పటికీ చెదరని అనుబంధమని పేర్కొన్నారు.రాఖీ పౌర్ణమి సందర్భంగా సోదరీమణులు తమ సోదరులకు రాఖీ కట్టి, అక్షింతలు వేసి ఆశీర్వదించి,హారతి ఇచ్చి స్వీట్లు తినిపించుకోవడం భారతీయ కుటుంబ విలువలకు అద్దం పడుతుందని తెలిపారు. మన సంస్కృతి, సంప్రదాయాల్లో రక్షాబంధనానికి ఎంతో విశిష్టమైన స్థానం ఉందని, ఈ పండుగ కుటుంబాల్లో ప్రేమ,



ఐక్యత, పరస్పర గౌరవాన్ని మరింత పెంపొందిస్తుందని రామకోటి రామరాజు అన్నారు. రాఖీ బంధం ప్రతి ఇంటా ప్రేమను పంచాలి.. ప్రతి హృదయంలో ఆత్మీయతను నింపాలి.. సోదర, సోదరీల అనుబంధం చిరకాలం వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

# రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయండి

- తెలంగాణ బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్
- జిల్లా ప్రధానకార్యదర్శి భాస్కర్

**దుబ్బాక ప్రతినిధి, ఆగస్టు 28 ( ప్రజా జ్యోతి)** తెలంగాణ బీడీ ఒ సిగార్ వర్కర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర 4వ మహాసభలు సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఆగస్టు 30,31 తేదీలలో జరుగుతున్నాయని మహాసభలను జయప్రదం చేయాలని సిగార్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి జి.భాస్కర్ కోరారు. ఈ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయం తరువాత అతి పెద్ద పరిశ్రమ బీడి పరిశ్రమ అన్నారు. రాష్ట్రంలో సుమారు 7 లక్షల మంది బీడీ కార్మికులు బీడీ పరిశ్రమ ద్వారా ఉపాధి పొందుతున్నారనీ వారిలో అత్యధికులు మహిళలు, నిరుపేదలు,సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందినవారనీ తెలిపారు.బీడీ పరిశ్రమలో ఉన్న అన్ని కేటగిరీ కార్మికుల కోసం సిఐటియు నిరంతరం పని చేస్తుందనీ గత పోరాటాలను సమీక్షించుకొని భవిష్యత్ కార్యాచరణను రూపొందించడానికి రాష్ట్ర 4వ మహాసభలు దోహద పడతాయని తెలిపారు. ఈ మహాసభలకు రాష్ట్రంలోని అనేక జిల్లాలల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నారనీ తెలిపారు. ఈ మహాసభలలో జిల్లాలోని బీడీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని




అన్నారు.బీడీ పరిశ్రమలో ఉన్న అన్ని క్యాటగిరీ కార్మికులకు వేతనాలు పెంచాలని కొత్త జీఓ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బీడీ కార్మికులందరికీ షరతులు లేకుండా జీవనభృతి 4016/- రూపాయలకు పెంచుతామని హామీ ఇచ్చి 15 ఆగస్టు రోజున రాష్ట్రంలో ఆసరా పెన్షన్లు మంజూరు చేస్తున్నామని ప్రకటన చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పెన్షన్ల జీవన భృతి కొరకు దరఖాస్తులు చేసుకోవడానికి బీడీ కార్మికులకు అవకాశం లేకుండా బీడీ కార్మికులను మోసం చేసిందని విమర్శించారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం క్యాన్సర్ గుర్తు పేరుతో మళ్ళీ బీడీ పరిశ్రమపై దాడికి పూనుకుందనీ, బీడీ పరిశ్రమపై +ాు భారాలు వేస్తూ బీడీ పరిశ్రమను మట్టుబెట్టాలని కుట్ర చేస్తుందనీ విమర్శించారు. ప్రత్యామ్నాయ ఉపాధిని చూపకుండా ఆరోగ్యమనే కుంటి సాకుతో బీడీ పరిశ్రమను దెబ్బకొట్టే చర్యలను సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తోందని అన్నారు. భవిష్యత్ లో బీడీ కార్మికుల సంక్షేమం, కనీస వేతనాల పెంపుదల కొరకు చర్చించడానికి తగిన కార్యాచరణను రూపొందించడానికి ఈ రాష్ట్ర 4వ మహాసభలు దోహద పడతాయని తెలిపారు. బీడీ కార్మికులు 50 సంవత్సరాలు కష్టపడి పనిచేసిన కార్మికులకు రిటైర్మెంట్ పెన్షన్ కనీసం 7500/రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. కావున అత్యంత ప్రాధాన్యత కల్గిన బీడి ఒ సిగార్ వర్కర్స్ రాష్ట్ర 4వ మహాసభలలో జిల్లాలోనీ బీడీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు దుబ్బాక పట్టణ కన్వీనర్ కొంపల్లి భాస్కర్, బీడీ ప్యాకింగ్ కార్మికులు బత్తుల రాజు,మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ పోరాట అమరవీరులకు జోహార్లు

- బషీర్బాగ్ విద్యుత్ పోరాటం దేశానికే ఆదర్శం
- సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్

**దుబ్బాక, ఆగస్టు 28 (ప్రజా జ్యోతి)** దుబ్బాక మండలకేంద్రంలో దుబ్బాక పట్టణ కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ పోరాట అమరవీరుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళుకర్పించారు. అనంతరం సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.భాస్కర్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు విద్యుత్తును ఉత్పత్తి చేస్తూ ప్రజలకు, వ్యవసాయంలాంటి కీలక రంగాలకు,సేవా రంగాలకు,ప్రైవేటు పరిశ్రమలకు కూడా సరఫరా చేస్తున్న సమయంలో ప్రపంచబ్యాంకు సంస్కరణలలో భాగంగా విద్యుత్ రంగాన్ని ప్రైవేటుపరం చేయడానికి విద్యుత్ ఛార్జీల పెంపు 2000 సంవత్సరంలో జరిగిందనీ వీటికి వ్యతిరేకంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో తొమ్మిది వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పోరాటం ప్రారంభమైందనీ దీనికి వ్యతిరేకంగా 2000 ఆగస్టు 28న చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని మరో జలియన్వాలాబాగ్




చేయాలని అప్పటి ప్రభుత్వం బషీర్ బాగ్ వద్ద ప్రదర్శనను అడ్డుకుని బుల్లెట్ల వర్షం కురిపించి పదుల సంఖ్యలో కాల్పులు జరపడంతో వందల సంఖ్యలో తీవ్రంగా గాయాల పాలయ్యారనీ,రామకృష్ణ, విష్ణువర్ధన్,బాలస్వామి అమరులయ్యారనీ ఆవేదన వ్యక్తం చేశారు.వారి ప్రాణ త్యాగం విద్యుత్తు ప్రైవేటీకరణ ఆగిపోయి నేటికీ వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందుతున్న దంటే అది ఆ ఉద్యమ ఫలితమే అన్నారు. విద్యుత్ కీలకమైన రంగాన్ని ఆదానీ,అంబానీలకు అప్పగించ దానికి కేంద్ర బీజేపీ ప్రభుత్వం . విద్యుత్ సవరణ చట్టం ముందుకు తెచ్చిందని విమర్శించారు.ఆనాటి విద్యుత్తు ఉద్యమం దేశానికే ఆదర్శంగా నిలిచిందనీ,కానీ నరేంద్రమోడీ బీజేపీ ప్రభుత్వం విద్యుత్తును కేంద్ర జాబితాలోకి తీసుకుంటూ చట్టాలు చేస్తుందని మండిపడ్డారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తిరిగి ఉద్యమాలు చేయాల్సన అవసరం నేడు ఉన్నదనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం వార్తలు దుబ్బాక పట్టణ కార్యదర్శి కొంపల్లి భాస్కర్. నాయకులు బత్తుల రాజు,మహేష్,కంపె ఎల్లయ్య,మల్లయ్య, లక్ష్మీ నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

# అకాడమిక్ క్యాలెండర్‌లో నర్మెట విద్యార్థుల ఫోటో

- సిద్దిపేట జిల్లా విద్యా ప్రగతికి దక్కిన అరుదైన గుర్తింపు


**నంగునూరు, ఆగస్టు 28 (ప్రజా జ్యోతి):-** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం--విద్యాశాఖ ప్రచురించిన అకాడమిక్ క్యాలెండర్‌లో సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట ప్రాథమిక పాఠశాలకు సంబంధించిన విద్యార్థుల ఫోటో చోటు చేసుకుంది. నర్మెట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఆవరణలో గత మార్చి నెలలో రాష్ట్ర అభివృద్ధిని తెలిపే మేళా నిర్వహించారు. ఈ మేళాలో విద్యాశాఖ ప్రగతిని తెలిపే స్టాల్ ను జిల్లా విద్య శాఖ ఏర్పాటు చేసింది. ఈ స్టాల్ ను నర్మెట ప్రాథమిక పాఠశాల విద్యార్థులు నిర్వహించారు. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అభివృద్ధి కార్యక్రమాల మేళాను సందర్శించారు. విద్యాశాఖ స్టాల్ వద్ద నర్మెట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా వారితో ఆత్మీయంగా ఫోటో దిగారు. ఈ ఫోటోను రాష్ట్ర విద్యా శాఖ రూపొందించిన అకాడమిక్ క్యాలెండర్‌లో మార్చి నెల పేజీలో ప్రచురించూడం విశేషం. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర స్థాయి విద్యా క్యాలెండర్‌లో తమ పాఠశాల విద్యార్థులతో ముఖ్యమంత్రి మాట్లాడిన దృశ్యం ప్రచురితం కావడం పాఠశాలకు, గ్రామానికి గర్వకారణమని ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడు ఎనగందుల మనీష్ కుమార్ పేర్కొన్నారు.సాధారణంగా రాష్ట్ర స్థాయి ప్రచురణల్లో ఒక చిన్న గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు సంబంధించిన ఫోటో చోటు చేసుకోవడం అరుదైన విషయమని ప్రధానోపాధ్యాయుడు ఎనగందుల మనీష్ కుమార్ అన్నారు. తమ పాఠశాలకు ఈ అవకాశం లభించడం ఆనందంగా ఉందని విద్యార్థులు తెలిపారు. ముఖ్యమంత్రి విద్యార్థులు, తల్లిదండ్రులతో మమేకమైన ఆ క్షణాన్ని విద్యాశాఖ అకాడమిక్ క్యాలెండర్‌లో పొందుపరచడం ద్వారా నర్మెట పాఠశాల ప్రత్యేకత రాష్ట్ర స్థాయిలో ప్రతిబింబించిందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న విద్యా వాతావరణం, పాఠశాల--తల్లిదండ్రుల అనుబంధం, విద్యార్థుల భాగస్వామ్యం వంటి అంశాలకు ఈ ఫోటో ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.తమ పాఠశాల ఫోటో రాష్ట్ర విద్యాశాఖ అకాడమిక్ క్యాలెండర్‌లో ప్రచురితమైందన్న విషయం విద్యార్థుల్లోనూ ఉత్సాహాన్ని నింపిందని మనీష్ కుమార్ తెలిపారు. “మన పాఠశాల ఫోటో రాష్ట్రస్థాయి క్యాలెండర్‌లో రావడం ప్రతి విద్యార్థి, ఉపాధ్యాయుడు, తల్లిదండ్రికి గర్వకారణం. ముఖ్యమంత్రి విద్యార్థులతో ముచ్చటించిన ఆ మధుర జ్ఞాపకం ఇప్పుడు అకాడమిక్ క్యాలెండర్ ద్వారా శాశ్వత గుర్తింపుగా నిలిచింది” అని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. నర్మెట వంటి గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఫోటో రాష్ట్ర విద్యాశాఖ అకాడమిక్ క్యాలెండర్‌లో చోటు దక్కడం సిద్దిపేట జిల్లా విద్యారంగానికి, నంగునూరు మండలానికి, నర్మెటకి గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. ఈ గుర్తింపు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరింత ఉత్సాహంతో పనిచేసేందుకు ప్రేరణ ఇస్తుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.




# సమస్యల వలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

**నంగునూరు, ఆగస్టు 28(ప్రజా జ్యోతి):-** నంగునూరు మండల పరిధిలోని గట్ల మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (్రాఎజ) సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. నిత్యం వందలాది మంది రోగులకు వైద్య సేవలు అందించాల్సిన ఈ ఆసుపత్రికి కనీస రక్షణ కరువైందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్య కేంద్రం కిటికీల అద్దాలు పగిలిపోవడంతో ఆసుపత్రి ప్రాంగణం మొత్తం కోతుల మయయిగా మారింది. కోతులు గుంపులు గుంపులుగా ఆసుపత్రిలోకి ప్రవేశించి, వార్డుల్లో స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో చికిత్స కోసం వచ్చే రోగులు, గర్భిణులు, బాలింతలు కోతుల దాడి భయంతో బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తోంది. ఆసుపత్రిలోని మందులు, రికార్డులను సైతం కోతులు నాశనం చేస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. మరోవైపు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది నిర్లక్ష్యం రోగుల పాలిట శాపంగా మారిందని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆసుపత్రిలో కనీస పారిశుధ్యం లోపించిందని, కిటికీలు విరిగిపోయి కోతులు లోపలికి వస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని ప్రజలు మండిపడుతున్నారు. వైద్యం కోసం వచ్చి కొత్త రోగాలను కొని తెచ్చుకోవాల్సి వస్తోందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే గట్ల మల్యాల పి.హెచ్.సికి తగిన రక్షణ కల్పించాలని, పగిలిన కిటికీలను పునరుద్ధరించి కోతుల బెడద నుండి కాపాడాలని స్థానికులు గట్టిగా డిమాండ్.





# అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్



**ములుగు, ఆగస్టు28 (ప్రజాజ్యోతి)** అన్నా చెల్లెలు అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్,శుక్రవారం రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని అన్నా,తమ్ముళ్లకు చెల్లెలు రాఖీలు కట్టగా ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకొని శుభాకాంక్షలు తెలుపుతున్నారు. రాఖీ కట్టిన అనంతరం చెల్లెలుకు కట్న కానుకలు సమర్పించి కాళ్లు మొక్కి ఆశీర్వచనం తీసుకున్నారు. ఈ రాఖీ పండుగను పెళ్లిళ్లయిన ఆడపిల్లలు అత్తవారింటి నుండి పుట్టింటికి వచ్చి అన్న,తమ్ముళ్లకు రాఖీలు కట్టడం ఎన్నో సంవత్సరాలుగా ఆనవాయితీగా వస్తుంది. ఈ ఆనవాయితీని కొనసాగిస్తూ ఇప్పటికీ ఈ పండుగను ఘనంగా నిర్వహించుకొని సంబరాలు జరుపుకుంటున్నారు.

## రాఖీ పౌర్ణమి వేడుకల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**ఉప్పల్, ఆగస్టు 28, ప్రజాజ్యోతి :** నాచారం డివిజన్ మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ నివాసంలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు జరిగాయి. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఉప్పల్ శాసన సభ్యులు బండారి లక్ష్మారెడ్డి నాచారం డివిజన్ మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ నివాసంలో నాచారం హెచ్ఎంటి నగర్ డివిజన్ల మహిళా కార్యకర్తలతో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కి రాఖీ కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నాచారం, హెచ్ఎంటి నగర్ డివిజన్లకు చెందిన మహిళా పార్టీ కార్యకర్తలు ఎమ్మెల్యే కు రాఖీలు కట్టి తమ ఆత్మీయతను చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, రాఖీ పౌర్ణమి అన్నాచెల్లెళ్ల అనుబంధానికి, ప్రేమకు, ఆత్మీయతకు ప్రతీక అని అన్నారు. మహిళా కార్యకర్తలతో కలిసి రాఖీ పౌర్ణమి వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.

## రామంతపూర్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో గాయత్రి హోమమ్

ప్రత్యేక పూజలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**ఉప్పల్ ఆగస్టు 28 ప్రజాజ్యోతి :** రామంతాపూర్ డివిజన్ ఇందిరానగర్ పద్మశాలి సంఘం వారు ఏర్పాటు చేసిన గాయత్రి హోమమ్ ప్రత్యేక పూజలో పాల్గొని తదనంతరం రాఖీ పౌర్ణమి వేడుకల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు రామంతాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ గంథం జ్యోత్స్న నాగేశ్వర రావు రాఖి కట్టి రాఖి పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

అలాగే రామంతాపూర్ డివిజన్ల మహిళా కార్యకర్తలతో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం డివిజన్లకు చెందిన మహిళా పార్టీ కార్యకర్తలు ఎమ్మెల్యే కు రాఖీలు కట్టి తమ ఆత్మీయత ను చాటుకున్నారు.ఈ సందర్భం గా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, రాఖీ పౌర్ణమి అన్నాచెల్లెళ్ల అనుబంధానికి, ప్రేమకు, ఆత్మీయతకు ప్రతీక అని అన్నారు.మహిళా కార్యకర్తల తో కలిసి రాఖీ పౌర్ణమి వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని సంతోషం వ్యక్తం చేసారు,ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ నాయకులు కొప్పు నర్సింగ్ రావు,సురం శంకర్,చాంద్ పాషా,అలె రమేష్,మనీష్,సాలార్,గోల్డ్ శివ,బాలకృష్ణ, మున్నా, ప్రేమ్ మహిళా సోదరీమణులు సంధ్య,కుర్నాలక్ష్మి ,తుముల లక్ష్మి,రేణుక,ఆర్ లక్ష్మి, విజయలక్ష్మి మంజుల భాగ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యలపై తక్షణమే స్పందించి ఇచ్చిన మాటను నెరవేర్చిన ఆకారపు అరుణ్ పటేల్





**ఉప్పల్, ఆగస్టు 28, ప్రజాజ్యోతి :** వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ రామ్ రెడ్డి నగర్ కాలనీ లో అధికారులతో కలిసి స్పీడ్ బ్రేకర్స్ ప్రారంభించిన అరుణ్ కొద్ది రోజుల క్రితం జరిగిన పలు రోడ్డు ప్రమాదాల్లో స్థానికులు తీవ్ర గాయాలపాలై కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయమై శివ యాదవ్ చిన్న టీం కాలనీ ప్రజలు ఆకా రపు అరుణ్ పటేల్ దృష్టికి సమస్యను తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించారుసమస్య తీవ్రతను అర్థం "ఖచ్చితంగా పరిష్కరిస్తా" అని మాట ఇవ్వడమే కాకుండా, చెప్పిన మాట ప్రకారం అధికారులతో కలిసి స్వయంగా ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు.

అరుణ్ పటేల్ చొరవతో ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు హెచ్చరిక సైన్ బోర్డులను తక్షణమే ఏర్పాటు చేయడం జరిగింది.సమస్య అని చెప్పగా నే క్షేత్రస్థాయికి వచ్చి, ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ చర్యలు తీసుకున్న అరుణ్ పటేల్ గారికి కాలనీవాసులు మరియు ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ జేస్తున్నారు ఈ కార్యక్రమంలో ఏఈ శ్వేత వర్కింగ్ ఇన్స్పెక్టర్ మహేందర్ కాలనీవాసులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## దేవాలయ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**ఉప్పల్, ఆగస్ట్ 28, ప్రజాజ్యోతి :** చర్లపల్లి డివిజన్ పరిధిలోని సోనియా గాంధీ నగర్ 1,2,3 గాంధీ నగర్ కుషాయిగూడలో నిర్వహించిన శ్రీ దుర్గమ్మ తల్లి, శ్రీ పోచమ్మ తల్లి, శ్రీ ఎల్లమ్మ తల్లి దేవాలయ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, భక్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, నియోజకవర్గం సుభిక్షంగా అభివృద్ధి చెందాలని కోరారు.

దేవాలయ ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవార్ల ఆశీస్సులు పొందాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు స్థానిక ప్రజలు, భక్తులుబి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పరిగి మున్సిపాలిటీలో ముమ్మరంగా

# ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ

- 'నో మ్యాపింగ్' దరఖాస్తుల పరిశీలన పూర్తి
- పత్రాలు ధ్రువీకరించి అక్కడికక్కడే ఆన్‌లైన్ మ్యాపింగ్



**పరిగి, ఆగస్టు 28 (ప్రజాజ్యోతి) :** పరిగి పురపాలక సంఘం పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ శుక్రవారం ముమ్మరంగా కొనసాగింది. ఓటర్ల జాబితాలో 'నో మ్యాపింగ్' సమస్యలు ఉన్న ఓటర్ల ప్రత్యేక దరఖాస్తులను పరిశీలించేందుకు స్థానిక పురపాలక కార్యాలయంలో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు.

పురపాలక సంఘ కమిషనర్ మల్లేష్, సహాయక ఓటర్ల నమోదు అధికారి (ఏఈఆర్వో)ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సంబంధిత ఓటర్లు తమ దరఖాస్తులు, అవసరమైన ధ్రువపత్రాలతో హాజరయ్యారు. అధికారులు సమర్పించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయి సమాచారం ఆధారంగా అక్కడికక్కడే ఆన్‌లైన్ మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, వార్డు కౌన్సిలర్లు, బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు)తోపాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొని సమన్వయంతో సేవలు అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మల్లేష్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఓటరికి మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా బీఎల్ఓల సహకారంతో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా మ్యాపింగ్ సమస్యలు ఉన్న ఓటర్లు తమ వివరాలను సరిచేసుకోవాలని, ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

# వీరారెడ్డి పల్లి పంచాయతీ కార్యదర్శిపై విమర్శలు





- అసహనం వ్యక్తం చేసిన ఉప సర్పంచ్ ఎన్నెం కవిత
- మద్దతుగా నిలిచిన పలు గ్రామాల ఉపసర్పంచులు

**తాండూరు ఆగస్టు 28 ప్రజా జ్యోతి :** వికారాబాద్ జిల్లా తాండూరు మండలం వీరారెడ్డి పల్లి పంచాయతీ కార్యదర్శి రవి తనను కావాలనే అవమానించే విదంగా వ్యవహరిస్తునట్లు స్థానిక ఉప సర్పంచ్ ఎన్నెం కవిత జగదీశ్ అగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం రోజు గ్రామంలో జరిగిన వికాసత్ భారత్ లో బాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న వీబిజి రామ్ జి యోజన గ్రామ సభ సమావేశానికి హాజరైన పంచాయతీ కార్యదర్శిని స్థానిక ఉప సర్పంచ్, మండల ఉప సర్పంచ్ ల సంఘం అధ్యక్షురాలు ఎన్నెం కవిత సభలో నిలదీశారు. దీంతో గ్రామ సర్పంచ్ పురుషోత్తం రెడ్డి జోక్యం చేసుకొని పంచాయతీలో జరిగే ప్రతి సమావేశానికి ఉప సర్పంచ్ తో పాటు వార్డు సభ్యులకు కూడా సకాలంలో సమాచారం అందించాల్సిన బాధ్యత మీ పైన ఉందని పంచాయతీ కార్యదర్శి రవికి సూచించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి రవి మాట్లాడుతూ తనకు వ్యక్తిగత పరిస్థితుల రీత్యా సమాచారం ఇవ్వలేకపోయానని ఇక ముందు ఇలా జరగదు అని సమాధానం ఇవ్వడంతో సభ ప్రశాంతంగా కొనసాగింది.

ఈ కార్యక్రమంలో పలువురు వార్డు సభ్యులు గ్రామ ప్రజలు, మద్దతుగా నిలిచిన పలు గ్రామాల ఉపసర్పంచ్ లలో ఉప సర్పంచ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, గిర్మాపూర్ ఉప సర్పంచ్ లక్ష్మి కాంత్ రెడ్డి, ఉప సర్పంచ్ల సంఘం జిల్లా ఇన్చార్జి చిట్టిఘనాపూర్ ఉప సర్పంచ్ ప్రవీణ్ గౌడ్, అల్లాపూర్ ఉప సర్పంచ్ శ్రీనివాస్,తాండూరు మండలం ఉప సర్పంచ్ ల సంఘం గౌరవ అధ్యక్షురాలు గౌతాపూర్ ఉప సర్పంచ్ ఇంద్రజా, మిట్టబాస్పల్లి బాష్పపల్లి ఉప సర్పంచ్ ఎ బసంత్ కుమార్, బెల్కటూరు ఉప సర్పంచ్ వై ప్రవీణ్ కుమార్, కొత్లాపూర్ ఉప సర్పంచ్ రాజు, చెంగోల్ గ్రామ ఉప సర్పంచ్ భర్త విజయ్ కుమార్,తదితరులు ఉన్నారు.

## రాఖీ పౌర్ణమి సందర్భంగా చిల్కానగర్‌లో

# ఘనంగా గాయత్రి పౌర్ణమి వేడుకలు

- పద్మశాలీల ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా గాయత్రి ధారణ



**ఉప్పల్ ఆగస్టు 28 ప్రజాజ్యోతి :** రాఖీ పౌర్ణమిని పద్మశాలి సమాజం "గాయత్రి పౌర్ణమి"గా అత్యంత పవిత్రమైన రోజు గా భావిస్తూ,తమ ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాలను కొనసాగిస్తూ వస్తోంది. ఈ సందర్భంగా శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సంక్షేమ సంఘం–చిల్కానగర్ ఆధ్వర్యంలో చిల్కానగర్‌లోని శ్రీ మార్కండేయ దేవాలయం లో జంధ్యాల పౌర్ణమి, రాఖీ పౌర్ణమి పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.కార్యక్రమం లో ముందుగా మార్కండేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి, అనంతరం కార్యక్రమానికి హాజరైన పద్మశాలి కులబంధువులకు పవిత్రమైన గాయత్రి లను శాస్త్రోక్తంగా అందజేసి గాయత్రి ధారణ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. చిల్కానగర్ ప్రాంతానికి చెందిన సుమారు 30 మంది పద్మశాలి కుల బంధువులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

పద్మశాలీలకు గాయత్రి పౌర్ణమి ప్రత్యేకత,రాఖీ పౌర్ణమి రోజున దేశవ్యాప్తంగా అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా రాఖీ కట్టుకునే సంప్రదాయం ఉండగా పద్మ శాలి సమాజంలో ఇదే రోజుకు ప్రత్యేకమైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యత ఉంది. ఈ రోజును జంధ్యాల పౌర్ణమి గా భావించి పవిత్రమైన జంధ్యాలను ధరించడం ద్వారా ధర్మం,ఆచారం,ఆధ్యాత్మికత, క్రమశిక్షణ,సమాజ ఐక్యత పట్ల తమ నిబద్ధతను చాటు కుంటారు.పద్మశాలి సమాజం తమ కులదైవమైన శ్రీ భక్త మార్కండేయ స్వామివారి స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని, తరతరాలుగా వస్తున్న సంప్రదా యాలు, ఆచార వ్యవహారాలను పరిరక్షించు కోవడంతో పాటు వాటిని భావితరాలకు అందించాలనే సంకల్పంతో ప్రతి సంవత్సరం జంధ్యాల పౌర్ణమి కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. గాయత్రి కేవలం ఒక పవిత్ర దారం మాత్రమే కాకుండా, మనిషి తన కర్తవ్యాన్ని,ధర్మాన్ని, ఆత్మ నిగ్రహాన్ని,సత్ప్రవర్తనను గుర్తుచేసే ఆధ్యాత్మిక ప్రతీకగా పద్మశాలీలలో విశిష్ట స్థానం కలిగి ఉందని కార్యక్రమంలో పాల్గొన్న పెద్దలు తెలిపారు.

బోడ విద్యాసాగర్‌కు ఘన సన్మానం అనంతరం శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారు బోడ విద్యాసాగర్ చిల్కానగర్ ప్రాంత సీనియర్ సిటిజన్ అసోసియేషన్ కో–కన్వీనర్‌గా అలాగే మేడ్చల్ మల్కాజ్‌గిరి అర్బన్ జిల్లా బీజేపీ చేనేత సెల్ కో–కన్వీనర్‌గా ఎన్నికైన సందర్భంగా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు,ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ సామాజిక సేవ, పద్మశాలి సమాజ సంక్షేమం, సీనియర్ సిటిజన్ల సమస్యల పరిష్కారం,చేనేత రంగ అభివృద్ధి కోసం బోడ విద్యాసాగర్ మరింతగా కృషి చేయాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమం లో శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షులు సకినాల ప్రసాద్, ప్రధాన కార్యదర్శి బెజగం శ్రీనివాస్, కోశాధికారి పెండెం నాగార్జున, ఉపాధ్యక్షులు అడ్డగట్ల భవానందం తో పాటు ముఖ్య సలహాదారులు దేవసాని బాలచందర్, దాసరి శ్రీనివాస్, గూడ శ్రీశైలం, కోడం రమేష్, బోడ అశోక్ కుమార్, పాలకుర్తి నవీన్, చిన్నం నవీన్, పెద్దబొమ్మ రమేష్, తాటి సంపత్, పాము ఆంజనేయులు, కుమార్ కనకదుర్గ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.పద్మశాలి సమాజం యొక్క ఆధ్యాత్మిక వారసత్వాన్ని, కులదైవ భక్తిని, ఐక్యతను, సంప్రదాయాలను ప్రతిబింబించే గాయత్రి పౌర్ణమి వేడుకలను భవిష్యత్ తరాల కుస్ఫూర్తినిచ్చేలా ప్రతి సంవత్సరం మరింత ఘనంగా నిర్వహిస్తామని సంఘ నాయకులు తెలిపారు.

# రక్షాబంధన్ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు



**ఉప్పల్, ఆగస్టు 28, ప్రజాజ్యోతి :** ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కి సైనిక్ పురిలోని ఎమ్మెల్యే నివాసంలో రాఖీ కట్టిన మహిళ సోదరీమణులు అన్నా–చెల్లెళ్ల ఆత్మీయతకు, అక్కా–తమ్ముళ్ల ప్రేమాను రాగాలకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన రక్షాబంధన్(రాఖీ పౌర్ణమి)పర్వదినం సందర్భంగా ప్రజలందరికీ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు.రక్షాబంధన్ పండుగ కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేసే పవిత్రమైన రోజని, సోదర–సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనురాగం, నమ్మకానికి రాఖీ ప్రతీకగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి సోదరి ముఖంలో చిరునవ్వు వెల్లివిరియాలని, ప్రతి సోదరుడి జీవితం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, విజయాలతో నిం డాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో, ఆనందంగా రక్షాబంధన్ పర్వదినాన్ని జరుపుకోవాలని బండారి లక్ష్మారెడ్డి కోరారు.

## రక్షాబంధన్ వేడుకల్లో మాజీ మేయర్ అజయ్ యాదవ్



**మేడిపల్లి ఆగస్టు 28, (ప్రజా జ్యోతి) :** రక్షాబంధన్ పర్వదినం సందర్భంగా మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ తన సోదరుడితో కలిసి సోదరి డా. సరిత యాదవ్ చేత రాఖీ కట్టించుకున్నారు.

ఈ సందర్భంగా రక్షాబంధన్ సోదర, సోదరీమణుల మధ్య ప్రేమానుబంధానికి ప్రతీకగా నిలిచే పవిత్రమైన పండుగ అని పేర్కొంటూ, ప్రజలందరికీ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

## సోదరితో రాఖీ కట్టించుకున్న మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి

- రక్షా బంధన్ సందర్భంగా కుటుంబ సభ్యులతో వేడుకలు
- ప్రతి సోదరికి అన్నదమ్ములు అండగా నిలవాలని ఆకాంక్ష




**పరిగి, ఆగస్టు 28 (ప్రజాజ్యోతి):** రక్షా బంధన్ పండుగ సందర్భంగా పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి తన సోదరి అర్చన రెడ్డి చేత రాఖీ కట్టించుకుని పండుగను ఘనంగా జరుపుకున్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొని ఆనందోత్సాహాల మధ్య రక్షా బంధన్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కొప్పుల మహేష్ రెడ్డి మాట్లాడుతూ, రక్షా బంధన్ అనేది అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే పవిత్రమైన పండుగ అని అన్నారు. ప్రతి సోదరికి అన్న లేదా తమ్ముడు ధైర్యంగా, అండగా, రక్షణగా నిలవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులందరూ ప్రేమాభిమానాలతో, సంతోషంగా రాఖీ పండుగను జరుపుకోవాలని కోరారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి శుభాకాంక్షలు పంచుకుని పండుగ వేడుకల్లో పాల్గొన్నారు.

## హెల్త్‌కేర్ లీడర్‌షిప్‌పై రౌండ్‌టేబుల్ సమావేశం



**హైదరాబాద్, ఆగస్ట్ 28 (ప్రజా జ్యోతి) :** మెడిరెస్ట్–సీఏహెచ్ఓ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన హెల్త్‌కేర్ లీడర్‌షిప్ రౌండ్‌టేబుల్ సమావేశంలో ఏఐ ఆధారిత న్యూట్రిషన్, వ్యక్తిగతీకరించిన మీల్ ప్లానింగ్, థెరప్యూటిక్ డైట్స్, ఫుడ్ సేఫ్టీ, పేషెంట్ ఎక్స్‌పీరియన్స్‌పై చర్చించినట్లు సీఏహెచ్ఓ సెక్రటరీ జనరల్ డాక్టర్ సంజీవ్ కె.సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 50 మందికి పైగా హాస్పిటల్ సీఈఓలు, సీఓఓలు, వైద్యులు, డైటీషియన్లు, నిపుణులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో కాంపస్ గ్రూప్ ఇండియా ఎం.డీ.రాహుల్ షిండే, సీఏహెచ్ఓ అధ్యక్షుడు డాక్టర్ లల్లు జోసెఫ్ వ్యక్తిగత పోషకాహారం, పేషెంట్ సెంటర్డ్ కేర్ ప్రాధాన్యతను వివరించినట్లు చెప్పారు. మెడిరెస్ట్ 25కి పైగా ఆసుపత్రుల్లో ఏడాదికి 10 మిలియన్లకు పైగా భోజనాలు అందిస్తూ, పేషెంట్ మీల్ ప్లానర్ టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు తెలిపారు.

## వినోద రంగంలో పెట్టుబడులకు సినీనౌ నాయకత్వం



**హైదరాబాద్, ఆగస్ట్ 28 (ప్రజా జ్యోతి) :** వినోద రంగంలో పెట్టుబడులకు కొత్త సంస్థాగత విధానాన్ని రూపొందించే లక్ష్యంతో సినీనౌ తన 150 మిలియన్ డాలర్ల చలనచిత్ర పెట్టుబడి విభాగానికి నాయకత్వ, పాలనా నిర్మాణాన్ని ప్రకటించినట్లు సినీనౌ ఎండీ, చైర్మన్ రోహిత్ దాల్మియా శుక్రవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హిందీతో పాటు మరాఠీ, గుజరాతీ, పంజాబీ, తెలుగు, తమిళం, మలయాళం భాషల్లో బ్లాక్‌బస్టర్, ఇండీ చిత్రాల కోసం సహకారాలను ఆహ్వానిస్తోందని తెలిపారు. ప్రధాన సలహాదారు సిద్ధార్థ్ రాయ్ కపూర్ తోకలసి ఆయన మాట్లాడుతూ అరెళ్లలో 30కి పైగా చిత్రాల్లో పెట్టుబడులు పెట్టాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. పెట్టుబడి కమిటీ, ఇండియా కౌన్సిల్, నాయకత్వ బృందంలో సమీర్ నాయర్, నేహా కౌల్, జైదీప్ సాహ్ని, ఆశిష్ సింగ్, అభయ్ సిన్హా, సంజయ్ అర్జున్‌దాస్ వాధ్వా, డా.రెసుల్ పూకుట్టి, జితేంద్ర నాగ్‌పాల్, రేష్మ శెట్టి, సురేష్ మీనన్, యూసుఫ్ షేక్, రాధిక గోపాల్, రాహత్ బెరి చేరినట్లు చెప్పారు.

## ముఖ్యమంత్రికి రాఖీ కట్టిన కొత్త స్రవంతి కిషోర్ గౌడ్

ముఖ్యమంత్రి ఆశీస్సులు పొందిన బోడుప్పల్ మాజీ డిప్యూటీ మేయర్



**మేడిపల్లి ఆగస్ట్ 28, (ప్రజా జ్యోతి) :** రాఖీ పౌర్ణమి సందర్భంగా బోడుప్పల్ మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాఖి కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశీర్వాదాలు తీసుకున్నారు. మహిళల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, కళ్యాణ లక్ష్మి, వంటి అనేక సంక్షేమ పథకాలతో పాటు బీసీ మహిళల కోసం ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. భవిష్యత్తులో మహిళలకు అధిక ప్రాధాన్యతనిస్తూ మరిన్ని నూతన సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి మహిళలను అన్ని రంగాలలో ప్రోత్సహిస్తారని కొత్త స్రవంతి కిషోర్ గౌడ్ అన్నారు.

# నిబంధనల మేరకే కొలతలు

ఎండపల్లి, ఆగస్ట్ 28,ప్రజా జ్యోతి: జగిత్యాల కూడలి వద్ద చేపడుతున్న డ్రైనేజీ నిర్మాణం ఆర్‌అండ్‌బీ నిబంధనల మేరకే జరుగుతోందని రాజారాంపల్లి సర్పంచ్ సంగ రమేష్‌యాదవ్ తెలిపారు.



ఆర్‌అండ్‌బీ నిర్దేశించిన 33 అడుగులకు అదనంగా ఆదర్శనగర్ ప్రజలు మరో రెండు అడుగుల స్థలాన్ని ఇచ్చారని చెప్పారు. దీంతో 35 అడుగుల పరిధిలో పనులు చేపడుతు న్నట్లు పేర్కొన్నారు. . రూ.80 వేల పరిహారానికి సంబంధించిన వ్యవహారం 15 ఏళ్ల క్రితం జరిగిందని, అప్పట్లో ప్రహరీ గోడ, సెప్టిక్ ట్యాంకు తదితర నిర్మాణాలను తొలగించారని వివరించారు. పాత అంశాన్ని ప్రస్తుత పనులతో ముడిపెట్టడం సరికాదన్నారు. అధికారిక సర్వే, ప్రభుత్వ రికార్డులు, ఆర్‌అండ్‌బీ నిర్ణయాల మేరకే చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. చౌరస్తాలో ప్రమాదాలకు కారణాలను పోలీసులు, ఆర్‌అండ్‌బీ అధికారులు సాంకేతికంగా నిర్ధారించాలన్నారు. చిన్న వ్యాపారులను ప్రమాదాలకు కారణాలుగా చూపడం సమంజసం కాదన్నారు. రాజకీయ దురుద్దేశంతో అభివృద్ధి పనులను అడ్డుకోవద్దని కోరారు.

# గ్రామ పంచాయతీ భవనం ప్రారంభించిన మంత్రి లక్ష్మణ్‌కుమార్

వెల్గటూర్, ఆగస్టు 28,ప్రజా జ్యోతి: మండలంలోని సంకనపల్లి గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో 20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని శుక్రవారం సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మద్దుల



గోపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. మంత్రి లక్ష్మణ్‌కుమార్ నాయకత్వంలో ధర్మపురి నియోజకవర్గంలోని గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, ప్రభుత్వ సేవలు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. నూతన పంచాయతీ భవనంతో గ్రామ పాలన మరింత సమర్థంగా సాగుతుందని తెలిపారు. పంచాయతీ పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్ల తిరుపతి, పాక్స్ చైర్మన్ గూడ రాంరెడ్డి, ఎండపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గెల్లు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి కందికట్ల రాజేష్, ఆలయ కమిటీ చైర్మన్ పుదరి రమేష్, సర్పంచుల ఫోరం నాయకులు కుశ లక్ష్మణ్, సంగ రమేష్, ఎండపల్లి మండల సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఎంజీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

# పండగొస్తే చాలు.. ప్రయాణికులపై అదనపు చార్జీల భారం!

## ప్రత్యేక బస్సుల పేరుతో వసూళ్లు.. ఆర్టీసీ తీరుపై ప్రయాణికుల ఆవేదన

మేడిపల్లి,భీమారం,ఆగస్టు 28 ప్రజాజ్యోతి: పండగ వచ్చిందంటే చాలు.. సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులపై అదనపు చార్జీల భారం పడుతోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండగల సందర్భంగా ప్రయాణికుల రద్దీ పెరుగుతుండటంతో ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నప్పటికీ, ప్రత్యేక సర్వీసుల పేరుతో అధిక చార్జీలు వసూలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణ రోజుల్లో ఉన్న చార్జీలతో పోలిస్తే పండగ సమయాల్లో ప్రత్యేక బస్సుల్లో అధిక మొత్తాన్ని చెల్లించాల్సి వస్తోందని ప్రయాణికులు చెబుతున్నారు. కుటుంబ సమేతంగా సొంత గ్రామాలకు వెళ్లే వారు తప్పనిసరి పరిస్థితుల్లో అదనపు చార్జీలు భరించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. పండగల సమయంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అదనపు బస్సులు ఏర్పాటు చేయడం స్వాగతించదగిన విషయమే అయినప్ప టికీ, అందుకు ప్రయాణికులపై అదనపు ఆర్థిక భారం మోపడం సరికాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. పండగ అంటే ఆనందంగా సొంతూళ్లకు వెళ్లాల్సిన ప్రయాణికు లకు అదనపు చార్జీలు భారంగా మారుతున్నాయని వాపోతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి పండగ సీజన్‌లో ప్రత్యేక బస్సుల చార్జీలపై స్పష్టత ఇవ్వడంతో పాటు, ప్రయాణి కులపై ఆర్థిక భారం పడకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రద్దీకి అనుగుణంగా మరిన్ని బస్సులు అందుబాటులోకి తీసుకువచ్చి, ప్రయాణికులకు సౌకర్య వంతమైన రవాణా కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


# ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు రాఖీ కట్టిన సోదరి

వేములవాడ,ఆగస్ట్,28:ప్రజాజ్యోతి: రాఖీ పౌర్ణమి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ఆయన సోదరి లీల స్వగృహంలో రాఖీ కట్టారు. అనంతరం స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధాన్ని చాటుకున్నారు. రక్షాబంధన్ సందర్భంగా సోదర సోదరీమ ణుల ప్రేమకు ప్రతీకగా నిలుస్తుందని ఆది శ్రీనివాస్ పేర్కొంటూ, ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.



# మంథని డివిజన్ ప్రెస్ క్లబ్ (డబ్ల్యూ జె) గౌరవ అధ్యక్షునిగా కొండేలా మారుతి

మంథని, ఆగస్టు 28 (ప్రజాజ్యోతి): మంథని డివిజన్ ప్రెస్ క్లబ్ డబ్ల్యుజే గౌరవ అధ్యక్షునిగా కొండేలా మారుతి నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మోతుకూరి శ్రీనివాస్, గడిపల్లి అజయ్ శుక్రవారం ప్రకటించారు. పత్రిక రంగంలో అపార అనుభవం కలిగి, సామాజిక సేవా రంగంలో విశేష అనుభవం కలిగి సేవలు అందిస్తున్న కొండేల మారుతి నియామకం పట్ల మంథని డివిజన్ ప్రెస్ క్లబ్ (డబ్ల్యూజె) సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. కొండేల మారుతి అనుభవాలు ఆలోచనలు తమకు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.



# ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

## కేంద్ర మంత్రి బండిసంజయ్, ఎమ్మెల్యే గంగుల ఇంట్లో రాఖీ పండుగ సందడి

కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 28 ( ప్రజాజ్యోతి ): అన్నా చెల్లెలు, అక్కా తమ్ముళ్ల మధ్య ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి వేడుకలు ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా జరిగాయి. పండుగను పురస్కరించుకుని పట్టణాలు, పల్లెల్లో సందడి నెలకొంది.ఉదయం నుంచే మహిళలు, బాలికలు తమ సోదరుల ఇళ్లకు చేరుకుని రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సోదరులకు హారతులు ఇచ్చి, నుదుట తిలకం దిద్ది రాఖీ కట్టి తమ ప్రేమాభిమానాలను చాటుకున్నారు. సోదరులు సైతం తమ సోదరీమణులకు కానుకలు అందించి, జీవితాంతం అండగా ఉంటామని భరోసా కల్పించారు.



రాఖీ పౌర్ణమి సందర్భంగా కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లోని ప్రధాన మార్కెట్లు, షాపింగ్ ప్రాంతాలు సందడిగా మారాయి. వివిధ రకాల రంగురంగుల రాఖీలు, స్వీట్లు, పండ్లు, పండుగ సామగ్రి కొనుగోళ్లతో వ్యాపార కేంద్రాల్లో రద్దీ కనిపించింది. చిన్నారులు, యువతులు ప్రత్యేకంగా ఆకర్షణీయమైన రాఖీలను కొనుగోలు చేశారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులంతా ఒకచోట చేరి పండుగను ఆనందంగా జరుపుకున్నారు. ఉద్యోగ, విద్య, ఇతర కారణాలతో దూర ప్రాంతాల్లో ఉన్న సోదరులు సైతం తమ స్వస్థలాలకు చేరుకోవడంతో ఇళ్లలో పండుగ వాతావరణం నెలకొంది. పలువురు సోదర, సోదరీమణులు సామాజిక మాధ్యమాల ద్వారా రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో ప్రత్యేక స్థానం కలిగిన రాఖీ పౌర్ణమి.. కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేస్తుందని పలువురు పేర్కొన్నారు. ప్రేమ, ఆప్యాయత, పరస్పర నమ్మకం, రక్షణకు ప్రతీకగా రాఖీ పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.

**నగరంలో రాఖీ పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహణ:**

రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లాలోని ప్రభుత్వ వయోవృద్ధుల మరియు వికలాంగుల వసతి గృహం, శిశు గృహంలో రాఖీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి సరస్వతి గారు ముఖ్య అతిథిగా హాజరై, వసతి గృహంలోని వయోవృద్ధులు, వికలాంగులు మరియు శిశు గృహంలోని చిన్నారులతో కలిసి రాఖీ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.

**సోదరి శైలజతో రాఖీ కట్టించుకున్నకేంద్ర మంత్రి బండి సంజయ్:**

రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ తన సోదరి శైలజతో రాఖీ కట్టించుకున్నారు. కరీంనగర్‌లో జరిగిన ఈ ఆత్మీయ కార్యక్రమంలో సోదరి శైలజ బండి సంజయ్ కుమార్‌కు రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సోదర, సోదరీమణుల మధ్య అనుబంధం, ఆప్యాయతకు రక్షాబంధన్ ప్రతీకగా నిలుస్తుందని బండి సంజయ్ పేర్కొన్నారు. చిన్ననాటి నుంచి కొనసాగుతున్న అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ రాఖీ పండుగను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకున్నారు.





రాఖీ కట్టిన అనంతరం సోదరి శైలజకు బండి సంజయ్ శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ బంధాలు, ఆత్మీయత, పరస్పర ప్రేమానురాగాలను చాటే రక్షాబంధన్ వేడుకలు ప్రతి ఇంట్లో ఆనందాన్ని నింపాలని ఆకాంక్షించారు.

**నగరపాలక సంస్థలో రక్షాబంధన్ వేడుకలు:**

శుక్రవారం కరీంనగర్ నగరపాలక సంస్థ లో రక్షాబంధన్ వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణం లో వైభవంగా జరిగాయి. రాఖీ పండగ సందర్భంగా బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయ సోదరీలు నగరపాలక సంస్థ కార్యాలయాన్ని సందర్శించి కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ కి పవిత్ర తిలకం పెట్టి.రాఖీ కట్టారు. అనంతరం స్వీట్లు తినిపించి ఆశీస్సులు అందజేశారు. అనంతరం కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ బ్రహ్మ కుమారీలకు రాఖీ శుభాకాంక్షలతో ధన్యవాదాలు తెలిపారు.

**కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల నివాసంలో రాఖీ పండుగ సందడి:**

కరీంనగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర మాజీ మంత్రి గంగుల కమలాకర్ నివాసంలో రాఖీ పౌర్ణమి వేడుకలు అత్యంత ఘనంగా, పండుగ వాతావరణంలో జరిగాయి. అన్నాచెల్లెళ్ల పవిత్ర బంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలను గంగుల కుటుంబ సభ్యులు ప్రతి ఏటా మాదిరిగానే ఈసారికూడా ఎంతో ఉత్సాహంగా, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకున్నారు.ఈ వేడుకల్లో భాగంగా గంగుల కమలాకర్ సోదరీమణులు పుష్పలత, స్వర్ణలత, అరుణలత లు తమ సహోదరులైన గంగుల కమలాకర్ తో పాటు వెంకన్న,



సుధాకర్‌లకు ఘనంగా రాఖీలు కట్టారు. తమ సోదరుల ఆయురారోగ్యాలు, క్షేమాన్ని కాంక్షిస్తూ మణికట్టుపై రక్షాసూత్రం కట్టి, ప్రేమతో మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా సోదరీమ ణులు మాట్లాడుతూ, తాము ఎక్కడ ఉన్నప్పటికీ ప్రతి ఏటా ఈ పండుగ రోజున కచ్చితంగా కలుసుకొని రాఖీ కట్టడం తమ కుటుంబంలో ఆనవాయితీగా వస్తోందని, ఈ బంధం ఎప్పటికీ ఇలాగే నిలవాలని ఆకాంక్షించారు.

# ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశంలో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్

వేములవాడ,ఆగస్ట్,28:ప్రజాజ్యోతి. వేములవాడ పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు.. అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ వసతి కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా అనేక మంది నిరాశ్రయులకు సొంత ఇల్లు నిర్మాణం చేసుకోవడం ఆనందకర మని ఆయన అన్నారు..



# వైభవంగా రాఖీ వేడుకలు

మంథని, ఆగస్టు 28 (ప్రజాజ్యోతి): అన్నచెల్లెళ్ల అనురాగానికి, అక్క తమ్ముళ్ల ఆత్మీయతకు ప్రతీక రాఖీ పౌర్ణమి వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించుకున్నారు. వివిధ ప్రాంతాల్లో ఉంటున్న అక్క చెల్లెలు తమ గ్రామాలకు, పట్టణాలకు వచ్చి అన్న తమ్ములకు రాఖీలు కట్టి తమ ఆత్మీయతను చాటుకున్నారు. మన సంస్కృతీ సాంప్రదాయాలకు అద్దం పడుతూ, తోబుట్టువుల మధ్య ఉండే పవిత్రమైన బంధాన్ని చాటిచెబుతూ వేడుకలు నిర్వహించుకున్నారు. రాఖీ పౌర్ణమి పర్వదినం వేల రక్షాబంధన్ పురస్కరించుకొని పవిత్రమైన రోజున అక్కాచెల్లెళ్ల ఆశీస్సులు, అన్నదమ్ముల రక్షణ ప్రతి ఒక్కరి జీవితంలో సుఖసంతోషాలను నింపింది. మంథని పట్టణంలో రక్షాబంధన్ వేల సోదరీ సోదరీ మణుల సందడితో కిక్కిరిసిపోయింది.



# ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు రాఖీ కట్టిన రాజన్న ఆలయ ఈవో రమాదేవి

వేములవాడ,ఆగస్ట్,28:ప్రజాజ్యోతి. వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఎల్. రమాదేవి రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే శ్రీ ఆది శ్రీనివాస్‌ను ఆయన క్యాంపు



కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ఆయనకు పండుగ శుభాకాంక్షలు తెలిపి, స్వామివారి కృపాకటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దేవస్థానం ఈవోకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేస్తూ, రాజన్న ఆలయ అభివృద్ధికి మరియు భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం ఉంటుందని పేర్కొన్నారు. ఈ విషయాలను ఆలయ పబ్లిక్ రిలేషన్స్ అధికారి పెరిక శ్రీనివాస్ వెల్లడించారు

# సీఎంఆర్ బియ్యం బకాయిలపై కఠిన చర్యలు

**ఖరీఫ్, రబీ 2021-22లో 2,821.915 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం బకాయి**

**పవన సుత రైస్ మిల్ రూ.12.28 కోట్ల డిఫాల్ట్**

**డిఫాల్ట్ మిల్లర్ పవన్ కుమార్ తో పాటు ట్రక్ చిట్టీల్లో సంతకాలు చేసిన వొల్లాల నవీన్ కుమార్ కేసు నమోదు**


**పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

మంథని, ఆగస్టు 28 (ప్రజాజ్యోతి): మంథని పవనసుత రైస్ మిల్ సీఎంఆర్ బియ్యం డిఫాల్ట్‌కు సంబంధించి ప్రభుత్వ ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకుం






టున్నామని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంథనిలోని రావికంటి పవన్ కుమార్ యాజమాన్యంలోని పవన సుత రైస్ మిల్‌కు ఖరీఫ్, రబీ 2021-22 సీజన్లలో మొత్తం 5,798.080 మెట్రిక్ టన్నుల ధాన్యం అప్పగించగా, దానికి సమానంగా 3,891.295 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం ప్రభుత్వానికి అందించాల్సి ఉందని తెలిపారు. అయితే మిల్లర్ ఇప్పటివరకు 1,069.380 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని మాత్రమే ఎఫ్‌సీఐ/టీజీఎస్‌సీఎస్‌సీఎల్‌కు అందించారని పేర్కొన్నారు. దీంతో 2,821.915 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం బకాయి ఉన్నట్లు తెలిపారు. ఇది 4,211.813 మెట్రిక్ టన్నుల సమాన ధాన్యానికి సమానమని, దీని విలువ రూ.9,82,51,492గా ఉందని పేర్కొన్నారు. 25 శాతం పెనాల్టీ రూ.2,45,62,873 కలిపి మొత్తం డిఫాల్ట్ మొత్తం రూ.12,28,14,365గా నిర్ధారించినట్లు తెలిపారు.



రబీ 2021-22కు సంబంధించి పవనసుత రైస్ మిల్లుకు అప్పగించిన ధాన్యాన్ని మంథనిలోని శ్రీలక్ష్మి ఎంఆర్‌ఎం సూరయ్య పల్లి మిల్లుకు తరలించినట్లు తెలిపారు. ఈ వ్యవహారానికి సంబంధించి పీపీసీల ద్వారా సమర్పించిన ట్రక్ చిట్టీలు, జాయింట్ సంతకాలను అధికారులు పరిశీలించగా, శ్రీలక్ష్మి ఎంఆర్‌ఎం, సూరయ్యపల్లికి చెందిన భాగస్వామి వొల్లాల నవీన్ కుమార్ సంతకాలు ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వానికి అప్పగించిన ధాన్యం స్వీకరణ, అంగీకారానికి సంబంధించిన ట్రక్ చిట్టీల్లో నవీన్ కుమార్ సంతకాలు ఉన్న నేపథ్యంలో ఆయన పాత్రపై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పవన సుత రైస్ మిల్ యాజమాని రావికంటి పవన్ కుమార్, శ్రీలక్ష్మి ఎంఆర్‌ఎం భాగస్వామి వొల్లాల నవీన్ కుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ధాన్యం, సీఎంఆర్ బియ్యం విషయంలో డిఫాల్ట్‌కు పాల్పడిన మిల్లర్లపై ప్రభుత్వ ఆదేశాల మేరకు కేసులు, రికవరీ తదితర చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.

# మంథని మదర్ థెరిస్సా పొదుపు సమితి లావాదేవీలపై సమగ్ర విచారణ జరపాలి

మంథని, ఆగస్టు 28 (ప్రజాజ్యోతి): మంథని మదర్ థెరిస్సా మహిళ పొదుపు సమితి ఆర్థిక అవకతవకలు, పారదర్శకత లోపం పై చట్ట పరమైన విచారణ జరపాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ ను ఆర్టిఐ ద్వారా కోరినట్లు నామని





హరీష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పొదుపు సంఘంలో జరుగుతున్న పలు అంశాలపై విచారణ జరపాలని ఆర్టిఐ దరఖాస్తులో కోరారు. మదర్ థెరిస్సా సంస్థకు సంబంధించిన అనుమతులు, పరిమితులు, పొదుపు సంస్థ ప్రారంభ తేది నుండి ఇప్పటి వరకు ఉన్నటువంటి సభ్యుల సంఖ్య తెలుపాలన్నారు. పొదుపు సమితి లావాదేవీలు, రుణాలు ఇవ్వడం, వడ్డీ వసూళ్లపై అనుమానాలు ఉన్నాయని అన్నారు. క్రిస్టియన్ మిషనరీ కి సంబంధించిన లోడి సంస్థతో ఎలాంటి సంబంధం లేని మదర్ థెరిస్సా పొదుపు సమితి లావాదేవీలు ఆడిట్ జరుగుతున్నాయా? లేదా? అంశాలపై సమగ్ర విచారణ జరిపి బహిరంగపర చాలన్నారు. తమది రిజిస్టర్డ్ సొసైటీ అని సొసైటీ నిబంధనలకు లోబడి లావాదేవీలు నిర్వహిస్తున్నామని మదర్ థెరిస్సా పొదుపు సమితి మేనేజర్ మేకల మల్లేశం తెలిపారు. తమ పొదుపు సంస్థ పై ఎవరికైనా, ఏమైనా అభ్యంతరాలు ఉంటే అన్ని వివరాలు వెల్లడిస్తామన్నారు.

# ఈపి ఆపరేటర్లకు ఏ గ్రేడ్ పరీక్ష వెంటనే ఏర్పాటు చేయాలి

☆ ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు



**సత్తుపల్లి ఆగస్టు28 (ప్రజా జ్యోతి)** కొత్తగూడెం రీజియన్ స్థాయిలో సత్తుపల్లి ఏరియాలో పనిచేస్తున్న ఈపి ఆపరేటర్లకు సంబంధించిన,ఏ గ్రేడ్ పదోన్నతి పరీక్షను వెంటనే నిర్వహించాలని ఐఎన్‌టీయూసీ సత్తుపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు గురువారం కోరారు.ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, మినిమం వేజెస్ చైర్మన్ డా. బి. జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు సత్తుపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏరియా జనరల్ మేనేజర్ వెంకటాచారిని కలిసి, వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ,2025-26 నాటికి బి గ్రేడ్‌లో మూడు సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకుని 'ఏ' గ్రేడ్‌కు అర్హత పొందిన సత్తుపల్లి ఏరియాలోని ఈపి ఆపరేటర్లకు పదోన్నతి పరీక్ష నిర్వహించాల్సి ఉందని, అర్హత కలిగిన ఉద్యోగులకు ఎలాంటి జాప్యం లేకుండా కొత్తగూడెం రీజియన్ స్థాయిలో ఏ గ్రేడ్ పరీక్షను వెంటనే నిర్వహించి, అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని ఆయన కోరారు. ఉద్యోగుల సర్వీస్, అర్హతలను పరిగణనలోకి తీసుకుని పరీక్ష నిర్వహణకు తక్షణమే చర్యలు చేపట్టాలని జనరల్ మేనేజర్ ని కోరారు.ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ మురళీకృష్ణ, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ పొట్టి కిరణ్, బ్రాంచ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నజీర్, హామీద్, పిట్ సెక్రటరీలు సీతారామరాజు, షణ్ముఖచారి, నగేష్, శ్రీధర్, చంద్రశేఖర్, చెరుకు రాజు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదల అభివృద్ధి
# కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం: ఎమ్మెల్యే రాగమయి

☆ ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే





**సత్తుపల్లి ఆగస్టు28 (ప్రజా జ్యోతి)** నిరుపేదల ఆర్థికంగా,అభివృద్ధి చెందేది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అవుతుందని,సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి విడతగా మంజూరు చేసిన ఇందిరమ్మ ఇల్లు,కొమ్మేపల్లి కాలనీలో నిర్మాణం పూర్తి అయినది. గృహ నిర్మాణం పూర్తి చేసుకున్న సందర్భంగా లబ్ధిదారులు గృహప్రవేశానికి స్థానిక శాసన సభ్యురాలు ఆహ్వానించగా, గురువారం ఆమె నూతన గృహాన్ని ప్రారంభించి,యజమానులకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవ జీవితంలో ఇంటి నిర్మాణం నిర్మించుకోవడం గొప్ప వరమని, అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుంది, కాబట్టి సుఖంగా సంతోషంగా ఉండాలని వారికి నూతన వస్త్రాలు అందించినారు. అనంతరం అంబేద్కర్ నగర్ కు చెందిన సాయి శ్రీనివాస్ వారి కుమార్తె వివాహ సందర్భంగా, కాబోయే నూతన వధువును ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ రెహానా కమల్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, కాంగ్రెస్ నాయకులు అభిమానులు ఉన్నారు.

## మాజీ జడ్పీటీసీ గుగులోత్ బాషాని
# ఆరోగ్య రీత్య పరామర్శించిన టీజి ఐడిసి చైర్మన్ మువ్వ



**వేంసూరు ఆగస్టు 28 ప్రజాజ్యోతి** మండలంలోని చోడవరం గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ గుగులోత్ బాషాను పరామర్శించిన మువ్వా విజయబాబు మర్యాదపూర్వకంగా పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాషా త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పొంగులేటి మరియు మువ్వా అభిమానులు పాల్గొన్నారు.

## యూనిటీ గోల్డ్ జిమ్ ఆధ్వర్యంలో ఈనెల
# 30న జిల్లా స్థాయి బెంచ్ ప్రెస్ పోటీలు

☆ పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరుకానున్న జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్




**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 29,(ప్రజా జ్యోతి)** పాల్వంచలో ఈనెల 30వ న యూనిటీ గోల్డ్స్ జిమ్ ఆధ్వర్యంలో ఏటీపీఎస్ ప్రాంగణంలోని ఇంజనీరింగ్ అసోసియేషన్ హాల్ నందు జిల్లా స్థాయి ఎంకరేజ్ మెంట్ బెంచ్ ప్రెస్ పోటీలను నిర్వహిస్తున్నట్లు, జిమ్ నిర్వాహకులు ఎండి నూర్ , ఎండి జాకీర్ , ఎండి అమీర్ ఖాన్ , ఎస్.కె సల్మాన్ ఖాన్ లో తెలిపారు , శుక్రవారం పాల్వంచ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 30 న జరిగే పోటీలకు ముఖ్య అతిథిగా జిల్లా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ) రోహిత్ రాజ్ హాజరు కానున్నట్టు యూనిటీ గోల్డ్స్ జిమ్ నిర్వాహకులు తెలిపారు. జిల్లాలో ఉన్న పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో పాల్వంచ పట్టణంలో మొట్టమొదటి సారి జిల్లా స్థాయి బెంచ్ ప్రెస్ పోటీలను సబ్ జూనియర్స్, జూనియర్స్,సీనియర్స్, మాస్టర్స్‌గా మొత్తం 9వెయిట్ కేటగిరీలలో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు పోటీలను ప్రారంభించనున్నట్టు, జిల్లా లోని జిమ్ నిర్వాహకులు, క్రీడాకారులు వయస్సు ధృవీకరణ కోసం ఆధార్ కార్డు తీసుకొని ఉదయం 8 గంటల కల్లా ఇంజనీరింగ్ అసోసియేషన్ హాల్ ప్రాంగణానికి చేరుకొని పోటీలు విజయవంతం చేసేందుకు సహకరించాలని కోరారు.

## కరాటేలో గిన్నిస్ రికార్డు
# సాధించిన రాంబాబుకు ఘన సన్మానం



**పినపాక, ఆగష్టు 28(ప్రజాజ్యోతి)** పినపాక మండలం దుగినేపల్లి గ్రామానికి చెందిన చర్ప రాంబాబు కరాటేలో ప్రతిభ చాటి గిన్నిస్ రికార్డులో స్థానం సంపాదించారు. గ్రామానికి చెందిన యువకుడు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం పట్ల దుగినేపల్లి గ్రామస్థులు, యువత హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దుగినేపల్లి యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం రాంబాబును ఘనంగా సన్మానించారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. కరాటేలో రాంబాబు సాధించిన విజయాన్ని ఆదర్శంగా తీసుకుని యువత క్రీడలు, మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలని పలువురు ఆకాంక్షించారు.గ్రామానికి మంచి పేరు తీసుకొచ్చినందుకు రాంబాబుపై ప్రశంసలు కురిపించారు. ఈ కార్యక్రమంలో పూజారి రాజేష్, మలోత్ భాస్కర్, భూపతి నాగేశ్వరరావు, శాతంశెట్టి సంతోష్, సున్నం సుదర్శన్, ఎల్పీ రాంప్రసాద్, బానోత్ సంతోష్, ఎంపల్లి స్వస్తిక్ తదితరులు పాల్గొని రాంబాబును అభినందించారు.

# 22ఏ భూముల సమస్యల పరిష్కారంలో పారదర్శకంగా వ్యవహరించాలి

☆ జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

☆ 22ఏ జాబితాలోని ప్రతి సర్వే నంబర్‌ను రికార్డులతో పక్కాగా క్రాస్‌చెక్ చేయాలి

☆ ప్రైవేట్ భూములు పొరపాటున నమోదైతే 48 గంటల్లో పరిష్కరించాలి

☆ 22ఏ నుంచి తొలగించే ప్రతి సర్వే నంబర్‌కు స్పష్టమైన కారణాలు, రిమార్క్స్ నమోదు చేయాలి

☆ ప్రభుత్వ భూములను కాపాడుతూ, నిజమైన భూ సమస్యలను వేగంగా పరిష్కరించాలి

☆ 22ఏ భూముల సమస్యపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్





**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** 22ఏ నిషేధిత భూముల సమస్యల పరిష్కారంలో అధికారులు పకడ్బందీగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు.22ఏ జాబితాలో ఉన్న ప్రతి సర్వే నంబర్‌ను సంబంధిత రెవెన్యూ రికార్డులతో పూర్తి స్థాయిలో పరిశీలించి, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా వివరాలను నిర్ధారించాలని ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం 22ఏ భూముల సమస్యలపై అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి రెవెన్యూ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ సమయంలో కొన్ని భూములు 22ఏ నిషేధిత జాబితాలో ఉన్నట్లు గుర్తించబడుతున్నా యని తెలిపారు. 22ఏకు సంబంధించి రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వస్తున్న ఫిర్యాదులను రెవెన్యూ అధికారులకు పంపిస్తున్నారని, వాటిపై సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలను క్రమం తప్పకుండా సమర్పించాలని సూచించారు.22ఏ భూముల పరిశీలన,నమోదు, తొలగింపు ప్రక్రియకు జిల్లావ్యాప్తంగా ఒకే విధమైన సాధారణ ఫార్మాట్‌ను రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. నిషేధిత భూములను ప్రధానంగా ఐదు కేటగిరీలుగా గుర్తించాలని తెలిపారు.

**22ఏ నిషేధిత భూముల ఐదు కేటగిరీలు:**
మొదటి కేటగిరీలో రాష్ట్ర, కేంద్ర చట్టాల పరిధిలోని నిషేధిత భూములు ఉంటాయని తెలిపారు. అసైన్‌మెంట్ భూములు, సీలింగ్ యాక్ట్, టెనెన్సీ యాక్ట్, ఆర్ఓఎఫ్ఆర్ తదితర చట్టాల పరిధిలోని భూములు ఉంటాయని వీటిలో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల రకాలు ఉంటాయని పేర్కొన్నారు. రెండవ కేటగిరీలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ భూములు, మూడవ కేటగిరీలో ఎండోమెంట్, వక్ఫ్ భూములు, నాలుగవ కేటగిరీలో సీలింగ్, అర్బన్ సీలింగ్‌కు సంబంధించిన భూములు, ఐదవ కేటగిరీలో ప్రభుత్వ ప్రయోజనాలను పరిరక్షించాల్సిన ఇతర భూములు ఉంటాయని తెలిపారు.గతంలో రికార్డులను పూర్తి స్థాయిలో పరిశీలించకుండానే కొన్ని భూముల రిజిస్ట్రేషన్లు జరిగేవని, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలు సమన్వయంతో పనిచేయకపోవడం వల్ల సమస్యలు తలెత్తేవని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ చట్టానికి సవరణలు తీసుకువచ్చి నిషేధిత కేటగిరీలకు చెందిన భూముల రిజిస్ట్రేషన్లను నియంత్రించడం జరిగిందని పేర్కొన్నారు.ప్రస్తుతం సర్వే,రిజిస్ట్రేషన్,రెవెన్యూ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తున్నాయని కలెక్టర్ స్పష్టం చేశారు.

**ప్రజల్లో భయాందోళనలకు తావివ్వొద్దు:**
కొన్ని సందర్భాల్లో నిజమైన ప్రైవేట్ భూములు పొరపాటున 22ఏ నిషేధిత జాబితాలో చేరే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. అలాంటి నిజమైన కేసులను గుర్తించి నిబంధనల ప్రకారం వేగంగా పరిష్కరించాలని సూచించారు.అదే సమయంలో ప్రభుత్వ భూములను కాజేయాలనే స్వార్థ ప్రయోజనాలు కలిగిన వ్యక్తులు ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం లేదా అపోహలు వ్యాప్తి చేయడం ద్వారా తమకు అనుకూలంగా భూములను 22ఏ నుంచి తొలగించుకునే ప్రయత్నాలు చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు.నిజమైన కేసుగా నిర్ధారణ అయిన భూములను అవసరమైన రికార్డులను పరిశీలించి 48 గంటల్లోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ లో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడవద్దని స్పష్టం చేశారు.22ఏ జాబితాలోని ప్రతి భూమిని సర్వే నంబర్ వారీగా క్రాస్ వెరిఫై చేయాలని తెలిపారు.ముందుగా సంబంధిత సర్వే నంబర్ పాత 22ఏ జాబితాలో ఉందా లేదా అనే విషయాన్ని పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. పాత 22ఏ జాబితాలో లేని సర్వే నంబర్ ప్రస్తుతం 22ఏలోకి ఎలా చేరిందో, అందుకు గల కారణాలను స్పష్టంగా నమోదు చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

**22ఏ నుంచి తొలగింపులకు ప్రత్యేక విధానం:**
ఏదైనా ప్రైవేట్ భూమి పొరపాటున 22ఏ నిషేధిత జాబితాలో నమోదైనట్లు నిర్ధారణ అయితే, దానిని తొలగించేందుకు సర్వే నంబర్ వారీగా డిలీటెడ్ లిస్ట్ రూపొందించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ తెలిపారు. 22ఏ జాబితాలో భూములను చేర్చే సమయంలో అనుసరించే విధానాన్నే తొలగింపు ప్రక్రియలోనూ పాటించాలని సూచించారు. తొలగించే ప్రతి సర్వే నంబర్‌కు నిర్దిష్ట కారణాలు, స్పష్టమైన రిమార్క్స్ తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 22ఏ సమస్యలను పారదర్శకంగా, వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. అదే సమయంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.22ఏ భూములకు సంబంధించిన ఫిర్యాదులపై అధికారులు సమన్వయంతో పనిచేసి, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మాత్రమే నిర్ణయాలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లాలోని మండల తహశీల్దార్లు, నాయబ్ తహశీల్దార్లు, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రాఖీ పండుగ వేళ కిటకిటలాడుతున్న ఖమ్మం పాత బస్టాండ్

☆ పండుగ సందర్భాల్లో అదనపు బస్సులు నడపాలని ప్రయాణికుల విజ్ఞప్తి







**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** శుక్రవారం పవిత్రమైన సోదరీసోదరుల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పౌర్ణమి (రాఖీ పండుగ) సందర్భంగా ఖమ్మం నగరంలోని పాత బస్టాండ్ ప్రాంగణం ప్రయాణికులతో తీవ్ర రద్దీగా మారింది. పండుగకు సొంత ఊళ్లకు వెళ్లేందుకు, తమ సోదరులకు రాఖీలు కట్టేందుకు బయలుదేరిన మహిళలు,ప్రజలతో బస్టాండ్ అంతా కళకళలాడుతోంది.అయితే, ఈ పండుగ వాతావరణంలో ప్రయాణికులు తీవ్ర ప్రయాణ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.ప్రస్తుతం బస్టాండ్‌లో అందుబాటులో ఉన్న బస్సుల సంఖ్య ప్రయాణికుల రద్దీకి సరిపోకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బస్సులు బస్టాండ్‌లోకి రాగానే ప్రయాణికులు ఎక్కడానికి ఒకరినొకరు తోసుకుంటూ అల్లాడిపోతున్నారు. బస్సుల్లో కూర్చోవడానికి సీట్లు దొరకడం దేవుడెరుగు, నిలబడటానికి కూడా స్థలం లేని పరిస్థితి నెలకొంది. చిన్న పిల్లలు,వయోవృద్ధులు, మహిళలు ఈ రద్దీలో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అధికారులు తక్షణమే స్పందించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. పండుగ రోజుల్లో పెరిగే రద్దీకి అనుగుణంగా వివిధ ప్రాంతాలకు ప్రత్యేక (అదనపు) బస్సులను నడపాలని కోరుతున్నారు. అదనపు బస్సుల ఏర్పాటు: ఖమ్మం పాత బస్టాండ్ నుండి గ్రామీణ ప్రాంతాలకు, పరిసర మండలాలకు, పండుగ వేళలు అదనపు సర్వీసులు నడపాలి.తాగునీరు, ప్రాథమిక వసతులు: తీవ్ర రద్దీ కారణంతో ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తున్నందున బస్టాండ్ ప్రాంగణంలో మంచినీరు, నీడ వసతులను సజావుగా అందించాలి.పండుగ పూట ప్రజలు తమ గమ్యస్థానాలకు సురక్షితంగా, వేగంగా చేరుకునేలా ఆర్టీసీ యాజమాన్యం త్వరితగతిన చర్యలు తీసుకోవాలని,డిపో అధికారులు పాత బస్టాండ్ రద్దీపై ప్రత్యేక దృష్టి సారించి అదనపు ట్రిప్పులను అందుబాటులోకి తీసుకురావాలని ఖమ్మం జిల్లా ప్రజలు,ప్రయాణికులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# రాఖీ కట్టిన బంధం.. గుండెల్లో నిలిచిన ప్రేమ..

☆ అక్క చేతికి రాఖీ.. తమ్ముడి జీవితానికి రక్షణ కవచం

☆ అక్క-తమ్ముళ్ల అపురూప అనుబంధానికి ప్రతీకగా రక్షాబంధన్: ప్రత్యేక కథనం



**అశ్వరావుపేట ప్రజా జ్యోతి ఆగస్టు 28** చిన్నప్పటి నుంచి ఒకరితో ఒకరు ఆటపట్టించుకోవడం... చిన్న చిన్న విషయాలకు గొడవపడటం... మళ్లీ క్షణాల్లో కలిసిపోవడం.. ఇదే అక్కా-- తమ్ముళ్ల బంధం ప్రత్యేకత. బయటకు కనిపించేది అల్లరి, ఆటపాటలే అయినా... ఆ బంధం వెనుక చెప్పలేని ప్రేమ, అపారమైన ఆప్యాయత దాగి ఉంటుంది. అలాంటి అపురూపమైన అక్కా--తమ్ముళ్ల అనుబంధాన్ని మరింత మధురంగా గుర్తు చేసే పండుగే రక్షాబంధన్. అక్క తన తమ్ముడి చేతికి రాఖీ కడుతూ, అతడు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటుంది. తమ్ముడు కూడా జీవితాంతం తన అక్కకు అండగా ఉంటానని, ఆమెను కాపాడుకుంటానని మాట ఇస్తాడు.

**రాఖీ దారం కాదు... ప్రేమ బంధం!**
చేతికి కట్టే రాఖీ కేవలం రంగురంగుల దారం మాత్రమే కాదు. అది అక్క ప్రేమకు ప్రతీక... తమ్ముడి బాధ్యతకు గుర్తు... ఇద్దరి మధ్య ఉన్న విడదీయరాని అనుబంధానికి సాక్ష్యం. కాలం మారినా, జీవనశైలి మారినా, దూరాలు పెరిగినా అక్కా--తమ్ముళ్ల మధ్య ప్రేమ మాత్రం మారదు. ఉద్యోగాలు, చదువులు, కుటుంబ బాధ్యతలతో వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నా... రాఖీ పండుగ వస్తే చిన్ననాటి జ్ఞాపకాలు మళ్లీ కళ్ల ముందు మెదులుతాయి.

**చిన్ననాటి అల్లరి నుంచి జీవితాంతం అండగా..**
చిన్నప్పుడు అక్కను ఆటపట్టించిన తమ్ముడే పెద్దయ్యాక ఆమెకు ధైర్యంగా నిలుస్తాడు. తమ్ముడిపై కోపంగా నటించే అక్కే అతడికి ఏ కష్టం వచ్చినా ముందుగా స్పందిస్తుంది. మాటల్లో చెప్పుకోలేని ఈ ప్రేమే అక్కా--తమ్ముళ్ల బంధాన్ని మరింత గొప్పదిగా నిలబెడుతోంది.

**బహుమతి కంటే విలువైనది ఆప్యాయతే**
రాఖీ సందర్భంగా ఖరీదైన బహుమతులు ఇవ్వడం కంటే, ఒకరిపై ఒకరు చూపించే ప్రేమ, గౌరవం, నమ్మకం ఎంతో గొప్పది. జీవితంలో ఎన్ని సమస్యలు వచ్చినా "నేనున్నాను" అని చెప్పే ఒక అక్క.. "నీకు నేను అండగా ఉంటాను" అని ధైర్యం చెప్పే ఒక తమ్ముడు ఉంటే ఆ బంధానికి మించిన సంపద మరొకటి ఉండదు.

**నేటి తరానికి రక్షాబంధన్ సందేశం**
సోషల్ మీడియా, బిజీ జీవితాల మధ్య కుటుంబ బంధాలు బలహీనపడుతున్న ఈ రోజుల్లో రక్షాబంధన్ ఒక గొప్ప సందేశాన్ని ఇస్తోంది. బంధాలు కేవలం రక్త సంబంధాలకే పరిమితం కాకుండా ప్రేమ, నమ్మకం, పరస్పర గౌరవంతో నిలవాలని ఈ పండుగ గుర్తు చేస్తోంది.

**అక్క కట్టే రాఖీ... తమ్ముడికి ధైర్యం**
**తమ్ముడి మాట... అక్కకు జీవితాంతం భరోసా**
**ఇదే రక్షాబంధన్... ఇదే అక్కా--తమ్ముళ్ల అపురూప ప్రేమ బంధం!**

**బాక్స్ ఐటెమ్**
**"చిన్ననాటి గొడవలు మరిచిపోతాం...**
**కానీ అక్క ప్రేమను మరిచిపోలేం...**
**తమ్ముడి అల్లరిని భరించలేమనుకుంటాం...**
**కానీ అతడు దూరంగా ఉంటే ఉండలేం...**
**అదే అక్కా--తమ్ముళ్ల బంధం!"**



## కర్నాటకలో మరోమారు తప్పకున్న మంత్రి

**వాల్మీకి కుంభకోణం కేసులో నాగేంద్ర రెండోసారి రాజీనామా**

బెంగళూరు,ఆగస్ట్28(ప్రజాజ్యోతి): కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. వాల్మీకి కుంభకోణ ఆరోపణలపై ఆ పార్టీ నేత బి.నాగేంద్ర తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. గతంలోనూ ఇవే ఆరోపణలపై ఆయన పదవి నుంచి తప్పుకొన్నారు. డీకే శివకుమార్ సీఎంగా బాధ్యతల చేపట్టిన తర్వాత మంత్రివర్గంలో చేరిన నాగేంద్ర.. విపక్షాల అవినీతి ఆరోపణల వేళ మరోసారి మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. తన రాజీనామా నిర్ణయాన్ని ప్రకటిస్తూ మీడియా ముందు ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. మహర్షి వాల్మీకి షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి కార్పొరేషన్‌లో అకౌంట్స్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన పి.చంద్రశేఖరన్ 2024 మే నెలలో ఆత్మహత్య చేసుకున్నారు. కార్పొరేషన్ నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపిస్తూ ఓ లేఖ రాశారు. కార్పొరేషన్ ఖాతా నుంచి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాకు రూ.89.63 కోట్లు, అక్కడి నుంచి మరికొన్ని ఖాతాలకు ఆ నిధులు బదిలీ అయినట్లు విచారణలో తేలింది. దీంతో అప్పట్లో రాజకీయంగా దుమారం రేగింది. ఈ వివాదం సమయంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న నాగేంద్ర 2024 జూన్‌లో పదవికి రాజీనామా చేశారు. అయితే, తనపై వచ్చిన ఆరోపణలన్నీ రాజకీయ ప్రేరేపితమైనవని నాగేంద్ర పేర్కొన్నారు. ఈ క్రమంలోనే సీఎంగా డీకే శివకుమార్ బాధ్యతలు చేపట్టాక రెండోసారి మంత్రివర్గంలో చేరారు. దీంతో ఆయన్ను తొలగించాలంటూ ప్రతిపక్షాలు మరోసారి రాజీనామా డిమాండ్‌ను తెరపైకి తీసుకొచ్చాయి. ఇటీవలి వర్షాకాల సమావేశాల సమయంలోనూ శాసనసభ లోపల, బయటా ఇదే అంశంపై భాజపా, జేడీఎస్ నిరసనలు తెలిపాయి. రాజకీయంగా ఒత్తిడి పెరగడంతో ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కలిసిన అనంతరం నాగేంద్ర తన రాజీనామా నిర్ణయాన్ని ప్రకటించారు.

## చెట్టుకు రాఖీ కట్టిన పర్యావరణ ప్రేమికుడు

నల్గొండ,ఆగస్ట్28(ప్రజాజ్యోతి): అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రాఖీ పండుగ జరుపుకుంటారు. అయితే ఈ పండుగ వేళ ఓ పర్యావరణ ప్రేమికుడు మాత్రం వినూత్నంగా ఆలోచించి.. పర్యావరణంపై తన ప్రేమను వ్యక్తం చేశాడు. గతంలో తాను నాటిన రావి చెట్టు మహావృక్షంగా ఎదగడంతో.. అతడి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. రాఖీ పండగ సందర్భంగా ఆ చెట్టుకు ఆవు పిడకతో చేసిన రాఖీని కట్టి తన ప్రత్యేక అభిమానాన్ని చాటుకున్నాడు. అతడి పేరు సురేష్ గుప్తా. అతడి స్వస్థలం నల్గొండ. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెట్లు మనకు ప్రాణవాయువును అందిస్తూ పర్యావరణ సమతుల్యతను కాపాడుతున్నాయని పేర్కొన్నారు. వాటిని సొంత కుటుంబ సభ్యుల్లా భావించి సంరక్షించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. చెట్టుకు రాఖీ కట్టి దానిని సంరక్షణకు ప్రతిజ్ఞ చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే సందేశాన్ని ఇచ్చినట్లు సురేష్ గుప్తా వెల్లడించారు

## హెల్మెట్ ధరించిండి..భయ్యా

### రాఖీ కట్టి హితబోధ చేసిన పోలీసులు

కామారెడ్డి,ఆగస్ట్28(ప్రజాజ్యోతి): హెల్మెట్లు లేని వాహనదారులకు ఎప్పుడూ చలాన్లు వేసే ట్రాఫిక్ పోలీసులు.. నేడు రక్షా బంధన్ సందర్భంగా ప్రేమతో రాఖీలు కట్టారు. కామారెడ్డి డీఎస్పీ ఆదేశాలతో పట్టణ సీఐ నరహరి ఆధ్వర్యంలో రాఖీ పూర్ణిమ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చూట్టారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి బొట్టు పెట్టి, రాఖీ కట్టి.. హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పించారు ట్రాఫిక్ పోలీసులు. హెల్మెట్ ధరించడం ప్రతి కుటుంబానికీ రక్ష అని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వల్ల ప్రమాదాల బారినపడతారని హెచ్చరించారు. రక్షా బంధన్ నాడు రాఖీ ఎంత రక్షణ ఇస్తుందని విశ్వసిస్తామో.. హెల్మెట్ కూడా నిత్యం అంతే రక్షణను ఇస్తుందని పేర్కొన్నారు. పోలీసులు ఇలా ద్విచక్ర వాహనదారులను ఆపి ఆప్యాయంగా రాఖీ కట్టడం చూసి వాహనదారులు అవాక్కయ్యారు. ఈ రకమైన శైలిలో వినూత్నంగా అవగాహన కల్పించడంపై కొందరు ప్రశంసలు కురిపిస్తున్నారు.

## నార్సింగ్‌లో హిట్ అండ్ రన్

### డెలివరీ బాయ్ బైకును ఢీకొట్టి పరార్

హైదరాబాద్,ఆగస్ట్28(ప్రజాజ్యోతి): సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని నార్సింగిలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. నార్సింగి ప్రధాన రహదారిపై చోటుచేసుకున్న హిట్ అండ్ రన్ ప్రమాదంలో ఒక డెలివరీ బాయ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. వేగంగా వచ్చిన ఒక గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టడమే కాకుండా, వాహనాన్ని ఆపకుండా అక్కడి నుంచి పరారైంది. హైదరాబాద్ గోల్కొండ ప్రాంతానికి చెందిన మహమ్మద్ అబ్దుల్ సమద్ అనే యువకుడు 'ఫస్ట్ క్లబ్' సంస్థలో డెలివరీ బాయ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. విధుల నిర్వహణలో భాగంగా నార్సింగి నుండి గండిపేట వైపు ఆర్డర్ డెలివరీ తీసుకొని బైక్‌పై వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మితిమీరిన వేగంతో వెనుక నుండి వచ్చిన అపరిచిత వాహనం సమద్ బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఆ దెబ్బకు బైక్ అదుపుతప్పి ఫుట్‌పాత్‌పై పడటంతో సమద్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు తక్షణమే అక్కడికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని, డ్రైవర్‌ను గుర్తించేందుకు రహదారిపై ఉన్న సిసిటీవీ ఫుటేజ్‌ను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామని అధికారులు తెలిపారు.

## గవర్నర్‌ను పరామర్శించిన భట్టి

### ఆరోగ్యంపై ఆరా తీసిన సిఎస్ సంజయ్ జాజు

హైదరాబాద్,ఆగస్ట్28(ప్రజాజ్యోతి): తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను లోక్ భవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పరామర్శించారు. గుండె సంబంధిత సమస్యతో అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం డిశ్చార్జ్ అయ్యి లోక్ భవన్‌కు చేరుకున్న గవర్నర్ ని శుక్రవారం సాయంత్రం ఉప ముఖ్యమంత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకుని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు. అలాగే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు కూడా గవర్నర్‌ను వేరుగా పరామర్శించారు. ఆయన ఆరోగ్యంపై ఆరా తీసారు.

## నేపాల్ నుంచి 21మంది భారత్ చేరిక

### విదేశాంగశాఖ ప్రతినిధి జైశ్వాల్ వెల్లడి

న్యూఢిల్లీ,ఆగస్ట్28(ప్రజాజ్యోతి): నేపాల్‌లోని వరద ప్రభావిత ప్రాంతాల నుంచి 21 మంది భారతీయులు సురక్షితంగా దేశ రాజధాని ఢిల్లీ చేరుకున్నారని కేంద్ర విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. వీరంతా వారి స్వస్థలం తమిళనాడు చేరుకున్నారని వివరించారు. శుక్రవారం న్యూఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. నేపాల్‌లోని త్రిశూలి హైడ్రో పవర్ ప్రాజెక్టులో పని చేస్తున్న 63 మంది భారతీయులను కూడా రక్షించారని తెలిపారు. అయితే నేపాల్ వరదలకు 320 మంది భారతీయులు, 100 మంది ఎన్నారైలు గల్లంతయ్యారని చెప్పారు. కైలాస మానస సరోవర యాత్రకు వెళ్లి వీరంతా గల్లంతయ్యారని పేర్కొన్నారు. అయితే చైనా వైపు టిబెట్‌లో 400 మంది భారతీయులు సురక్షితంగా ఉన్నారని అన్నారు. వారందరితో భారత రాయబార కార్యాలయం సంబంధాలు కలిగి ఉందని తెలిపారు. త్వరలో వారందరూ భారత్‌కు తిరిగి వచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కేంద్ర విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ చెప్పారు.

## బంగారం మైనింగ్‌లో హట్టి- సింగరేణి

# జతకట్టాలి

**మొదటిపేజీ తరువాయి..**

సందర్శించారు. బంగారు ఖనిజం తవ్వకం నుంచి శుద్ధ బంగారం తయారీ వరకు చేపడుతున్న పక్రియలను క్షుణ్ణంగా పరిశీలించారు. హట్టి గోల్డ్ మైన్స్‌కు బంగారం అన్వేషణ, తవ్వకం, ప్రాసెసింగ్, శుద్ధిలో అపార అనుభవం ఉందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. బొగ్గు, ఇతర ఖనిజాల అన్వేషణ, తవ్వకాల్లో సింగరేణికి ఉన్న సాంకేతిక నైపుణ్యాన్ని హట్టి



అనుభవంతో జోడించాలని సూచించారు. బంగారం అన్వేషణ, తవ్వకం, వెలికితీత, శుద్ధి, ఆధునిక సాంకేతికత వినియోగం, నిపుణుల సేవలు, మానవ వనరుల శిక్షణ తదితర అంశాల్లో రెండు సంస్థలు సంయుక్తంగా పనిచేసేందుకు కార్యాచరణ రూపొందించాలని సింగరేణి అధికారులను ఆదేశించారు. దేశ ఆర్థిక భద్రతలో బంగారం కీలక పాత్ర పోషిస్తుందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. దేశంలో అందుబాటులో ఉన్న బంగారు ఖనిజ వనరులను శాస్త్రీయంగా అన్వేషించి వెలికితీయడంలో సింగరేణి వంటి ప్రభుత్వ రంగ సంస్థలు ముందుండాలన్నారు. బంగారం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి దేశీయ ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. హట్టి-సింగరేణి భాగస్వామ్యంతో బంగారం ఉత్పత్తి పెంపు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, స్థానిక ఉపాధి కల్పనతోపాటు దేశ ఆర్థికాభివృద్ధికి మేలు జరుగుతుందని తెలిపారు. హట్టి గోల్డ్ మైన్స్‌లోని ప్రొడక్షన్ యూనిట్, ఖనిజ శుద్ధి కేంద్రం, ఎలక్ట్రో విన్నింగ్ కేంద్రాలను ఉప ముఖ్యమంత్రి పరిశీలించారు. గని నుంచి వెలికితీసిన ఖనిజాన్ని వివిధ దశల్లో ప్రాసెస్ చేసి శుద్ధ బంగారంగా మార్చే విధానాన్ని అధికారులు వివరించారు. హట్టి ప్రాజెక్టు ద్వారా రోజుకు సగటున రెండు నుంచి నాలుగు కిలోల బంగారం ఉత్పత్తి అవుతోందని అధికారులు తెలిపారు. యూటి ఓపెన్ కాస్ట్ గోల్డ్ మైన్' వ్యూ పాయింట్ వద్ద నిలబడి బంగారం ముడి మట్టిని వెలికి తీసిన పక్రియను, సేకరించిన ప్రదేశాలను ఆయన ప్రత్యక్షంగా తిలకించారు. ఈ సందర్భంగా ఓపెన్ కాస్ట్ గనిలో ఎంత లోతు నుంచి బంగారం తయారీకి కావలసిన ముడి సరుకును తీశారనే వివరాలను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బంగారం ఖనిజ గనికి సంబంధించిన సమగ్ర మ్యాప్‌లను లోతుగా పరిశీలించారు. బంగారు ఖనిజ అన్వేషణకు ఏ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తారని అధికారులను అడిగారు. అక్కడి అధికారులు డిప్యూటీ సీఎంతో మొక్కను నాటించారు.అనంతరం యుటీ భూ గర్భ గనిలో జరుగుతున్న బంగారు ఖనిజ తవ్వకాలను పరిశీలించారు.భూగర్భ గనిలో ఖనిజం తవ్వకం, రవాణా, యంత్రాల వినియోగం, కార్మికుల భద్రత తదితర అంశాలను ఉప ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి, ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, జనరల్ మేనేజర్ పంకజ్ కులశ్రేష్ఠ, రాయచూరు జిల్లా పరిషత్ సభ్యులు అమ్జద్, హట్టి గోల్డ్ మైన్స్ ఉన్నతాధికారులు అరుణవ ఘోష్, సఫీయుల్లా ఖాన్, విధాత్రి ఉపుండ, యెమ్మూరప్ప గౌడ, రిటైర్డ్ కల్నల్ దస్తగిరిసాహెబ్ దఫేదార్ పాల్గొన్నారు.

## చిన్నోడు తీసిన డ్రాలో కుటుంబానికి లక్కీ



**మొదటిపేజీ తరువాయి..**

లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి పొంగులేటి తెలిపారు. మరో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థలాల గుర్తింపు పక్రియ పూర్తయిందని, ఆయా నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం సెప్టెంబర్ 3వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు. క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్లలో ప్లాట్లను లాటరీ ద్వారా లబ్ధిదారులకు కేటాయిస్తున్నారు. మొదటి దఫాలో 7,350 ఇందిరమ్మ ఇళ్లను అర్హులకు అందించనున్న ప్రభుత్వం కుత్బుల్లాపూర్, కంటోన్మెంట్, రాజేంద్రనగర్, నాంపల్లి నియోజకవర్గాల్లో లక్కీ డ్రా నిర్వహించింది. శుక్రవారం నాంపల్లి నియోజకవర్గంలోని లక్కీడ్రాలో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. అర్హులైన పేదలందరికీ నిష్పక్షపాతంగా ఇళ్లు ఇస్తున్నామని తెలిపారు. పేదల ఆత్మగౌరవానికి చిహ్నంగా రూ. వందల కోట్లు ధర పలికే భూముల్లోనూ ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. మొదటివిడతలో కులం, మతం, పార్టీ చూడకుండా అర్హులందరికీ ఇళ్లు ఇచ్చామని, మరో 10 రోజుల్లో రెండో విడత జాబితా విడుదల చేస్తామన్నారు. 16 నియోజకవర్గాల్లో స్థలాలు సేకరించి టెండర్లు పూర్తిచేశామన్నారు. రెండు, మూడు రోజుల్లో టవర్ల నిర్మాణం ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. ఇళ్ల రిజిస్ట్రేషన్‌కు ఎలాంటి ఛార్జీలు వసూలు చేయట్లేదన్నారు. పదేళ్ల తర్వాత ఇంటిని అమ్ముకునే హక్కు లబ్దిదారులకు ఉందన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత ఇంటిని తాకట్టు పెట్టుకునేందుకు అనుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు.

## నేపాల్-చైనా సరిహద్దుల్లో భూకంపం!

నేపాల్‌లో రెండు రోజుల క్రితం ధ్వంసం చేసిన వరదలు మరోసారి ముంచెత్తే ప్రమాదం ఉందని వాతావరణశాఖాధికారులు హెచ్చరిస్తున్నారు. చైనా- నేపాల్ సరిహద్దుల్లో ఏర్పడిన భూకంపం ఇప్పుడు నేపాల్‌ను వణికిస్తోంది. భూకంపం గురించి తెలుసుకున్న వెంటనే నేపాల్‌లోని ప్రజలు సురక్షిత ప్రాంతాలకు పరుగులు పెడుతున్నారు. ఏ క్షణమైనా నేపాల్‌ను మరోసారి వరదలు చుట్టుముట్టబోతున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. దీనికి



తగ్గట్టుగానే ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. చైనాలోని సిచువాన్ ప్రావిన్స్‌లో 5.1 తీవ్రతతో భూకంపం ఏర్పడింది. దీని ప్రధాన కేంద్రం చైనా- నేపాల్ సరిహద్దుల్లో ఉంది. అందుకే ఈ భూకంపం ప్రభావం చైనాపై కంటే నేపాల్‌పై ఎక్కువగా ఉంటుంది. మరోసారి వరద ప్రళయం ముంచెత్తబోతోందని గ్రహించిన అధికారులు ప్రభావిత ప్రాంతాల్లో రెడ్ అలర్ట్ జారీ చేశారు. ప్రజలను సురక్షితం ప్రాంతాలకు తరలించారు. ఇప్పటికే నేపాల్‌లో వరదల కారణంగా మృతుల సంఖ్య పెరుగుతూనే ఉంది. పలు భవనాలు పేకమేడల్లా కూలిపోయాయి. వాహనాలు కాగితపు పడవల్లా కొట్టుకుపోయాయి. పరుగెత్తుతున్న ప్రజలను వరద కమ్మేసింది. జంతువులు, చెట్లు వరదలో కలిసిపోయాయి. భూకంపంతో మంచు, రాళ్లు, శిథిలాలు కొట్టుకొచ్చి లిండే నదిలో ప్రవాహానికి తాత్కాలికంగా అడ్డుపడ్డాయి. అడ్డంకి తొలగిపోగానే అది ఉప్పెనై భారీగా వరద, బురద దిగువకు పోటెత్తింది. అది భోటే కోశీ, త్రిశూలి నదుల ప్రవాహాన్ని బీభత్సం చేసింది. టిబెట్‌లోనూ వరద భారీ విధ్వంసం సృష్టించింది. భవనాలకు భవనాలే నేలమట్టమయ్యాయి.పాల్‌లో వరదల్లో మృతుల సంఖ్య 579కి చేరగా, ఏకంగా 1,924 మంది గల్లంతు అయ్యారని ఆ దేశ విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. కాగా నేపాల్- టిబెట్ సరిహద్దులో సంభవించిన జలప్రళయానికి సంబంధించి ఆందోళన కలిగించే కారణాలు వెలుగులోకి వచ్చాయి. తొలుత ఈ జలప్రళయానికి భూకంపమే కారణమని భావించినప్పటికీ, తాజా శాస్త్రీయ విశ్లేషణలు అందుకు భిన్నమైన విషయాన్ని వెల్లడించాయి. దాదాపు 5,200 మీటర్ల ఎత్తులో ఉన్న భారీ హిమానీనదం విరిగిపడటం, దాని వెంట మంచు, రాళ్లు, మట్టి, ఇతర శిథిలాలు కొండపై నుంచి కిందికి దూసుకురావడం వల్లే విపత్తు సంభవించినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇస్రోకు చెందిన నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ విశ్లేషించిన ఉపగ్రహ చిత్రాలు కూడా ఈ ఘటన ఎలా జరిగిందో స్పష్టంగా చూపించాయి. పర్వత శిఖరాలపై ఉన్న హిమానీనదంలో దాదాపు మూడింట రెండు వంతుల భాగం విరిగిపోయినట్లు ఉపగ్రహ చిత్రాల విశ్లేషణలో తేలింది. ఈ భారీ మంచు ముక్కలు సుమారు 1.2 కిలోమీటర్ల దిగువన ఉన్న 'లెండే ఖోలా' నదీ పరివాహక ప్రాంతంలో పడిపోయాయి. ఆగస్టు 24న తీసిన ఇస్రో సెంటినెల్-2 ఉపగ్రహ చిత్రాల్లో హిమానీనదం దాదాపు చెక్కుచెదరకుండా కనిపించింది. అయితే ఆగస్టు 26 తర్వాత తీసిన ల్యాండ్‌శాట్-9 చిత్రాల్లో హిమానీనదం విరిగిపడిన ఆనవాళ్లు స్పష్టంగా కనిపించాయి. యూనివర్సిటీ ఆఫ్ కాల్గరీకి చెందిన శాస్త్రవేత్త డానియల్ షుగర్ అంచనా ప్రకారం, భారీ మొత్తంలో మంచు విరిగిపడి లోయలోకి చేరింది. హిమానీనదం కూలిపోవడం ఎంత బలంగా జరిగిందంటే, భూకంప పరికరాల్లో నమోదయ్యేంత స్థాయిలో ప్రకంపనలు ఏర్పడ్డాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.హిమానీనదం పై నుంచి కిందకు జారిపడే సమయంలో అది ముక్కలుగా విడిపోయింది. ఆ మంచు ముక్కలతో పాటు రాళ్లు, మట్టి, చెట్లు, ఇతర శిథిలాలు కూడా దిగువకు కొట్టుకొచ్చాయి. దీంతో సాధారణ నీటి ప్రవాహానికి భిన్నంగా అత్యంత సాంద్రత కలిగిన బురద, శిథిలాల ప్రవాహం ఏర్పడింది. శాస్త్రవేత్తలు దీనిని 'లిక్విడ్ కాంక్రీట్' ప్రవాహంగా అభివర్ణించారు. మొదట భారీగా కొట్టుకొచ్చిన శిథిలాలు నది ప్రవాహాన్ని అడ్డుకున్నట్లు భావిస్తున్నారు. దీంతో అక్కడ తాత్కాలికంగా ఒక అడ్డుకట్ట ఏర్పడింది. ఆ తర్వాత ఆ అడ్డుకట్ట ఒక్కసారిగా తెగిపోవడంతో నీరు, బురద, మంచు, రాళ్లతో కూడిన భారీ ప్రవాహం ఉగ్రరూపం దాల్చింది. భోటే కోశీ-త్రిశూలి కారిడార్ వెంట ఉన్న ప్రాంతాలపై ఈ ప్రవాహం తీవ్ర ప్రభావం చూపింది. ఇళ్లు, వాహనాలు, భారీ బండరాళ్లు సైతం ఈ శక్తివంతమైన ప్రవాహం ధాటికి కొట్టుకుపోయాయి. ఈ ఘటనలో వరుస పరిణామాలు చైన్ రియాక్షన్‌లా చోటుచేసుకున్నట్లు శాస్త్రవేత్తల అంచనాలు సూచిస్తున్నాయి. తొలుత హిమానీనదం విరిగిపడటం ఆ తర్వాత మంచు, రాళ్ల శిథిలాలు కొండపై నుంచి కిందకు జారడం, అవి నదిని అడ్డుకోవడం దాంతో తాత్కాలికంగా నీరు నిలవడం, ఆ అడ్డుకట్ట తెగిపోవడంతో భారీ స్థాయిలో వరద దిగువకు దూసుకెళ్లడం ఇలా ఒకదాని తర్వాత ఒకటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. మొదట ఈ విపత్తు భూకంపం కారణంగానే జరిగిందని అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే భూకంప తరంగాలపై నిర్వహించిన అదనపు విశ్లేషణతో ఆ అనుమానాలు తప్పని తేలింది. నమోదైన ప్రకంపనలు నిజమైన భూకంపం వల్ల కాకుండా హిమానీనదం కూలిపోవడం, దాని వెంట భారీగా శిథిలాలు కిందకు జారిపడటం వల్లే ఏర్పడినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ ఘటన హిమాలయ ప్రాంతంలో పెరుగుతున్న ప్రకృతి విపత్తుల ముప్పుపై మరోసారి ఆందోళన కలిగిస్తోంది. భూమి ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల హిమానీనదాలు క్రమంగా కరుగుతున్నాయి. అదే సమయంలో ఎత్తైన ప్రాంతాల్లో మంచు, రాళ్లను స్థిరంగా ఉంచే శాశ్వత మంచు పొరలు బలహీనపడుతున్నాయి. దీంతో పర్వత ప్రాంతాలు మరింత అస్థిరంగా మారి హిమానీనదాలు, మంచు-రాళ్ల చరియలు విరిగిపడే ప్రమాదం పెరుగుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## సింగరేణి కార్మికుల సమస్యలపై ఒప్పందం

**మొదటిపేజీ తరువాయి..**

ఏఐటీయూసీ ప్రతినిధులు ఒప్పందాలు చేసుకున్నారు. 23 కీలక అంశాలపై అంగీకారం తెలిపారు. కోల్ ఇండియాలో అమలవుతున్న విధానానికి అనుగుణంగా కార్మికులకు లభించే అలవెన్సులు, పెర్క్‌పై విధించే ఇన్‌కమ్ ట్యాక్స్‌ను యాజమాన్యమే భరించేందుకు అంగీకరించింది. సర్వీసులో ఉండగానే సహజ మరణం పొందిన కార్మికుడి కుటుంబానికి రూ.20 లక్షలు అందించే అంశానికి యాజమాన్యం అంగీకరించింది. కార్మికుల వైద్య సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు నెలనెలా మెడికల్ బోర్డు నిర్వహించనున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సంస్థకు వచ్చిన వాస్తవ లాభాలను దసరాలోపు ప్రకటించేందుకు అవసరమైన ప్రభుత్వ అనుమతులు తీసుకుని చర్యలు చేపట్టనున్నారు. మూడు సంవత్సరాల సర్వీస్ నిబంధనను తొలగించి, ఖాళీల ఆధారంగా ఒక సంవత్సరం నిబంధనతో ట్రాన్స్‌ఫర్లు చేపట్టేందుకు అంగీకరించారు. అర్హులైన సీనియర్ మైనింగ్ స్టాఫ్‌కు సకాలంలో ఓవర్‌మ్యాన్ ప్రమోషన్లు కల్పించనున్నారు. ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాల మేరకు కమిటీ ఏర్పాటు చేసి, అందులో యూనియన్ సంఘాలకు కూడా ప్రాతినిధ్యం కల్పించారు. సింగరేణి కార్మికులు, వారి కుటుంబాలకు మెరుగైన వైద్య సేవల కోసం హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటుపై యాజమాన్యం సానుకూలంగా స్పందించింది. దాదాపు 22 ఏళ్లుగా మార్పులేని మెడికల్ అటెండెన్స్ నిబంధనలను సవరించేందుకు అంగీకరించారు. సర్వీసు నుంచి దిగిపోయిన కార్మికులకు ఓపీ సేవలతో పాటు వారం రోజుల వరకు చికిత్స అందించేలా చర్యలు చేపట్టనున్నారు. సింగరేణి విద్యాసంస్థల్లో పూర్తిస్థాయిలో అఃఃఇ సిలబస్ అమలుపై యాజమాన్యం సానుకూలంగా స్పందించింది. గనుల్లో కార్మికుల భద్రతకు అవసరమైన సేఫ్టీ మెటీరియల్‌ను సకాలంలో అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోనున్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న డిస్మిస్ కేసులను కమిటీ ద్వారా పరిష్కరించేందుకు అంగీకరించారు. మెకానికల్, ఎలక్ట్రికల్, అండర్‌గ్రౌండ్ మైనింగ్ విభాగాల్లో జనరల్ అసిస్టెంట్లుగా ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిశీలించి అర్హతలకు అనుగుణంగా సర్ఫేస్‌లో సూటబుల్ జాబ్ కల్పించేందుకు చర్యలు తీసుకోనున్నారు. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరికీ వైద్య సదుపాయం అందేలా చర్యలు చేపట్టనున్నారు. పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ ఉద్యోగాల కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు అంగీకరించారు. ఐటీయూసీ ఇచ్చిన సమ్మె నోటీసు, ఆర్‌ఎల్‌సీ సమక్షంలో జరిగిన చర్చలు, యాజమాన్యంపై కొనసాగించిన నిరంతర ఒత్తిడి ఫలితంగానే ఈ కీలక నిర్ణయాలు సాధ్యమయ్యాయని ఏఐటీయూసీ నాయకులు తెలిపారు. పెర్క్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్, సహజ మరణానికి రూ.20 లక్షలు, మెడికల్ బోర్డు, లాభాల ప్రకటన, ట్రాన్స్‌ఫర్ నిబంధనల మార్పు, ప్రమోషన్లు, వైద్య సదుపాయాలు, ఖాళీ పోస్టుల భర్తీ, డిపెండెంట్ ఉద్యోగాలు తదితర అంశాలపై సాధించిన అంగీకారాలు సింగరేణి కార్మికుల పోరాట చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయి అని పేర్కొన్నారు. ఈ చర్చల్లో ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు సారయ్య, వై.వి.రావు, కందికట్ల వీరభద్రయ్య, మడ్డి ఎల్లయ్య, ముస్కె సమ్మయ్య.. యాజమాన్యం తరపున డైరెక్టర్ పా.గౌతం పోట్రూ, జీఎం పర్సనల్ కిరణ్‌కుమార్, అజయ్, జీఎం ఎం.ఎస్.రవి, డీజీఎం రాజగోపాల్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసింగ్‌లో వృత్తి నైపుణ్య ప్రమాణాలు తప్పనిసరి

**నేరం వెనుక కారణాలు, నేరస్థుల విధానంపై ఆరా తీయాలి**

**నేర నియంత్రణలో సాంకేతికతకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలి**

**అధికారులకు తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశం**

హైదరాబాద్,ఆగస్ట్28(ప్రజాజ్యోతి): నేరాల దర్యాప్తు, పోలీసింగ్‌లో వృత్తి నైపుణ్య ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులను తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు. నేరాల సమీక్షను కేవలం గణాంకాలకే పరిమితం చేయకుండా.. ప్రతి నేరం వెనుక కారణాలు, నేరస్థుల విధానం, దర్యాప్తు తీరు, ఆయా కేసుల పరిష్కారాన్ని సమగ్రంగా విశ్లేషించాలని సూచించారు. అన్ని యూనిట్ల పోలీసు ఉన్నతాధికారులతో శుక్రవారం డీజీపీ కార్యాలయంలో అర్ధవార్షిక నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని యూనిట్ల పోలీసు అధికారులకు పలు కీలక అంశాలపై డీజీపీ దిశా నిర్దేశం చేశారు. సాంకేతికతను నేర నియంత్రణకు సాధనంగా వినియోగించాలని డీజీపీ




సూచించారు. సైబర్, ఆర్థిక నేరాలు తగ్గాయని అన్నారు. మాదకద్రవ్యాలు, వ్యవస్థీకృత నేరాలపై ప్రత్యేక దృష్టిసారించామని వెల్లడించారు. ఆయా యూనిట్ల వారీగా నెలవారీ సమీక్షలు తప్పనిసరని స్పష్టం చేశారు. బేసిక్ పోలీసింగ్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. వృత్తిపరమైన ప్రమాణాలు పాటించాలని మార్గనిర్దేశర చేశారు. ఇటీవల సీసీటీఎన్‌ఎస్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించడంతో గతంలో 70 నుంచి 80 శాతంగా ఉన్న.. సీసీటీఎన్‌ఎస్ డేటా అప్‌డేట్.. అధికారులు, సిబ్బంది సమష్టి కృషితో 96 శాతానికి చేరడం అభినందనీయమని డీజీపీ పేర్కొన్నారు. ప్రతి నెల నిర్వహించే క్రైమ్ రివ్యూ సమావేశాలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పోలీసులు పాటించాల్సిన ప్రాథమిక విధానాలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రొఫెషనల్ స్టాండర్డ్స్‌ను పాటించడాన్ని అధికారులు పోటీగా తీసుకోవాలని సూచించారు. అన్ని జోన్ల డీఐజీలు, మల్టీజోన్ ఐజీలు ఇకపై ఇన్‌స్పెక్షన్ నోట్స్‌ను పరిశీలించాలని డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు. ఆయా జిల్లాల పర్యటనలు, పోలీస్‌స్టేషన్ల తనిఖీల సమయంలో గుర్తించే అంశాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. నేరాల ధోరణిని ముందుగానే గుర్తించి, అవసరమైన చోట ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. డీజీపీ సీవీ ఆనంద్ అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశానికి డీజీ (లా అండ్ ఆర్డర్) మహేశ్ భగవత్, సీఐడీ డైరెక్టర్ శిఖా గోయెల్, ఉమెన్ సేఫ్టీ, సీఐడీ డైరెక్టర్ చారు సిన్హా, ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా హాజరయ్యారు. అలాగే, రాష్ట్రంలోని అన్ని పోలీసు కమిషనర్లు, జిల్లా ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులు, పోలీసు సిబ్బంది ఈ సమావేశంలో పాల్గొన్నారు. అన్ని జోన్ల డీఐజీలు, మల్టీజోన్ ఐజీలు ఇకపై ఇన్‌స్పెక్షన్ నోట్స్‌ను పరిశీలించాలని ఆదేశించారు. రాష్ట్రంలో 7.15శాతం నేరాలు పెరిగాయని డీజీపీ వెల్లడించారు. మాదకద్రవ్యాల కేసుల్లో 46.10శాతం వృద్ధి సాధించిందని అన్నారు. సైబర్, ఆర్థిక నేరాల్లో తగ్గాయని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో మొత్తం నేరాల సంఖ్య మూడేళ్లలో 7.15 శాతం పెరిగాయని వివరించారు. 2023-24లో 2,65,377 కేసులు నమోదుకాగా.. 2025-26లో 2,84,363కు చేరాయని చెప్పారు. లక్ష జనాభాకు నేరాల రేటు 481.58 నుంచి 491.59కి పెరిగిందని తెలిపారు. మాదకద్రవ్యాల కేసులు 2023-24లో 2,026 ఉండగా.. 2025-26లో 2,960కు చేరాయని ప్రస్తావించారు. మూడేళ్లలో 46.10 శాతం పెరిగాయని వెల్లడించారు. వ్యవస్థీకృత నేరాలు 25 నుంచి 451కు పెరిగి 1,704 శాతం వృద్ధిని నమోదు చేశాయని అన్నారు. ట్రాఫిక్ నేరాలు 29,130 నుంచి 31,891కు పెరిగి 9.48 శాతం వృద్ధి చెందాయన్నారు. మరోవైపు సైబర్ నేరాలు 25,373 నుంచి 22,000కు తగ్గి 13.29 శాతం, ఆర్థిక నేరాలు 37,690 నుంచి 32,684కు తగ్గి 13.28 శాతం క్షీణించాయని చెప్పారు. తీవ్ర నేరాల్లో 10.33శాతం తగ్గాయని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967